

'అభివృద్ధి ఎంత ముఖ్యమో...
సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 90


బుధవారం 21-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఐఐటీ-బాంబేకు రూ.315 కోట్లు

ఐఐటీ-బాంబేకు మరో రూ.315 కోట్ల విరాళం అందజేసిన నందన్ నీలేకని - 6లో



త్యాగధనులకు నిత్య నీరాజనం

గురువారం ఆవిష్కృతం కానున్న తెలంగాణ అమరవీరుల స్మారకం - 3లో



టైటానిక్ వీక్షణకు వెళ్లి...

టైటానిక్ నౌక శకలాల సందర్శనకు నలుగురు యాత్రికులతో వెళ్లిన మినీ జలాంతర్గామి 'టైటాన్' జాడ తెలియకుండా పోయింది.
- వివరాలు 6లో



యూపీ, బిహార్‌కు కేంద్ర బృందాలు

వడగాడ్పులతో 100 మంది వరకు మరణించిన యూపీ, బిహార్ రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించాలని మాండవీయ ఆదేశించారు.
- వివరాలు 6లో



వైభవంగా జగన్నాథుని రథయాత్ర

అంగరంగ వైభవంగా జరిగిన పూరీ రథ యాత్రని వీక్షించడానికి ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు.
- వివరాలు 6లో



పవన్ ఏమిటీ భాష?: ముద్రగడ

వీధిరౌడీ భాషలో మాట్లాడటం సమంజసం కాదంటూ పవన్ కల్యాణ్‌ను ఉద్దేశించి రాసిన లేఖలో ముద్రగడ పద్మనాభం పేర్కొన్నారు.
- వివరాలు 10లో

బీసీ కోటాతో పాగా..!

విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించేలా కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళిక

- బీసీ కులాలకు ఏం చేయాలనే దానిపై ముమ్మర కసరత్తు
- జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీ ఇవ్వాలని నిర్ణయం
- కుల వృత్తుల వారు ఆత్మ గౌరవంతో బతికేలా పథకాలకు రూపకల్పన
- ఎంబీసీ కులాలు, సంచార జాతుల వారికి ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ
- ఈ మేరకు బీసీ డిక్లరేషన్‌లో ప్రకటన
- ఈసారి 34కు తగ్గకుండా 50 వరకు టికెట్లు ఇచ్చే యోచన...



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సామాజిక వ్యవస్థలో సింహభాగం వాటా ఉన్న బీసీలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఆ కులాల వారిని ఆకట్టుకునేందుకు భారీ ప్రణాళికలు రూపొందిస్తోంది. సామాజిక వర్గాల వారీగా డిక్లరేషన్లు ప్రకటించి, మేనిఫెస్టోలో ఆయా డిక్లరేషన్లలోని హామీలను పొందుపరిచే ఆలోచనలో ఉన్న హస్తం పార్టీ.. బీసీల కోసం ఏం చేయాలన్న దానిపై ముమ్మర కసరత్తు జరుపుతోంది. కొన్ని ప్రతిపాదనలపై పార్టీలో ఇప్పటికే సూత్రప్రాయ అంగీకారం వచ్చిందని, ఈ మేరకు బీసీ డిక్లరేషన్ ఎజెండా ఖరారైందని సమాచారం. ఇందులో భాగంగా జనాభా ప్రాతిపదికన బీసీలకు విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు కల్పిస్తామనే హామీ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించినట్లు తెలిసింది. కులగణన కోసం జాతీయ స్థాయిలో పార్టీ మద్దతు లభించినందున, ఆయా కులాల జనాభా లెక్కల మేరకు వారికి రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పాలని నిర్ణయించింది. టికెట్ల కేటాయింపులో గతానికి భిన్నంగా.. కనీసం 34 అసెంబ్లీ స్థానాలకు తగ్గకుండా, 50 వరకు టికెట్లు ఇస్తామని భరోసా ఇవ్వనుంది.

లోక్‌సభలో కనీసం రెండు అసెంబ్లీలు వారికే..

బీసీ నేతలకు టికెట్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ గత రెండు ఎన్నికల్లోనూ ఆశించిన ఫలితాలు సాధించలేక పోయింది. 2014 ఎన్నికల్లో 31 స్థానాలను కేటాయించగా, 2018లో పొత్తుల కారణంగా అది 25కు తగ్గింది. అదే సమయంలో 2018 ఎన్నికల్లో ఓసీలకు 41, ఎస్సీలకు 17, ఎస్టీలకు 10, మైనార్టీలకు 7 స్థానాలను కేటాయించింది. అయితే ఈ ఎన్నికల్లో బీసీ నేతలు కొందరికి ఆఖరి క్షణంలో సీట్లు కేటాయించడంతో సానుకూల ఫలితాలను రాబట్టడంలో విఫలమయ్యింది. కాగా వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో ప్రతి లోక్‌సభ స్థానంలో కనీసం రెండు సీట్లు బీసీ నేతలకు ఇస్తామనే హామీని బీసీ డిక్లరేషన్‌లో చేర్చనుంది. అయితే ఈ 34 స్థానాలకే

మిగతా 2వ పేజీలో ▶



న్యూయార్క్‌కు చేరుకున్న ప్రధాని నరేంద్ర మోదీకి స్వాగతం పలుకుతున్న అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు

శాంతి వైపే భారత్

- ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై మా వైఖరి తటస్థం కాదు
- ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని అందరూ గౌరవించాల్సిందే
- వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ స్పష్టీకరణ - 6లో

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే

'మార్గదర్శి'పై దర్యాప్తు

ఆ సంస్థ అక్రమాలు వెలుగులోకి తెస్తున్నాం

ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్



- ఇప్పటికే 23 గ్రూప్ చిట్స్‌లో రూ.604 కోట్ల టర్నోవర్ నిలిపివేత
- సోదాల్లో రకరకాల అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి.. ఇలాగైతే మార్గదర్శి కొనసాగడం కష్టమే
- నిబంధనల అతిక్రమణపై పక్కా ఆధారాలున్నాయి
- ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేయకముందే వారి సొమ్ము కాపాడే చర్యలు.. చట్టాలకు లోబడే మా దర్యాప్తు సాగుతోంది
- చిట్‌ఫండ్స్ చట్టం అమలు కాకుండా 26 ఏళ్లు ఆపిన రామోజీ

- వివరాలు 10లో



సర్టిఫికెట్ల కోసం గద్వాల తహసీల్దార్ కార్యాలయంలో రాత్రి 9 గంటల సమయంలో దరఖాస్తు దారులు

సాయం సరే.. దరఖాస్తెలా?

- కుల, ఆదాయం సర్టిఫికెట్లు అందని బీసీల ఆవేదన
- రూ.లక్ష సాయానికి మంగళవారంతో ముగిసిన గడువు
- గడువు పెంచాలని విజ్ఞప్తులు.. పెంచేది లేదన్న మంత్రి గంగుల

3 లో

అదను దాటలేదు... ఆందోళన వద్దు

- ఈ వానాకాలం సీజన్ అదను దాటలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు భరోసా ఇచ్చింది. పంటలను విత్తుకోవడానికి సమయం దాటిపోలేదని విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి తెలిపారు.

3 లో

నెలాఖరున బీఆర్ఎస్

విస్తృత స్థాయి సమావేశం

- యువజన, విద్యార్థి సమ్మేళనాల నిర్వహణపై దృష్టి
- పార్టీ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించేలా కార్యక్రమాలు

2 లో

క్లుప్తంగా...

లౌకికవాద పార్టీలు ఏకతాటిపైకి రావాలి

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు రాఘవులు



మిర్యాలగూడ: బీజేపీ మళ్లీ అధికారంలోకొస్తే దేశంలో ప్రజాస్వామ్యం లేకుండా పోతుందని, దాన్ని ఎదుర్కోవడానికి లౌకికవాద పార్టీలన్నీ ఏకతాటిపైకి రావాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డితో కలిసి మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బీజేపీ విధానాలను వ్యతిరేకించే పార్టీలన్నీ ఒక వేదికపైకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నాయని, అందులో భాగంగా ఈనెల 23న బిహార్‌లో ఆయా పార్టీల సమావేశం జరుగుతోందని చెప్పారు. బీజేపీని ఓడించడమే ఆయన లక్ష్యమైతే.. తెలంగాణ సీఎం కేసీఆర్ కూడా హాజరు కావాలని సూచించారు. కేరళలో కాంగ్రెస్ తమ పార్టీకి ప్రధాన ప్రత్యర్థి అయినప్పటికీ బీజేపీని ఓడించాలనే లక్ష్యంతో కలిసి ముందుకెళ్తున్నట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తీగల సాగర్ తదితరులు పాల్గొన్నారు.

'గద్దర్ ప్రజా పార్టీ'కి శ్రీకారం

పార్టీ రిజిస్ట్రేషన్ కోసం సీఈసీకి నేడు దరఖాస్తు



సాక్షి, న్యూఢిల్లీ: ప్రజా గాయకుడు గద్దర్ నూతన రాజకీయ పార్టీకి శ్రీకారం చుట్టనున్నారు. 'గద్దర్ ప్రజా పార్టీ' పేరుతో కొత్త రాజకీయ పార్టీ రిజిస్ట్రేషన్ కోసం కేంద్ర ఎన్నికల సంఘానికి దరఖాస్తు చేయనున్నారు. ఈ మేరకు గద్దర్ బృందం మంగళవారం ఢిల్లీ చేరుకుంది. బుధవారం ఈబృందం కేంద్ర ఎన్నికల సంఘంను కలవనున్నట్లు సమాచారం.

జై తెలుగు పార్టీ ఆవిర్భావం

కొత్త పార్టీని ప్రకటించిన సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణకు రాజకీయ వేదిక ఉండాలనే ఉద్దేశంతో సరికొత్తగా జై తెలుగు పార్టీని ఏర్పాటు చేసినట్లు సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు ప్రకటించారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో పార్టీ పేరును ఆయన ప్రకటించారు. భాషా, సంస్కృతుల పట్ల రాజకీయ నాయకులు, ప్రజలకు అవగాహన ఉండాలని, వీటిపై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడమే తమ పార్టీ లక్ష్యమని చెప్పారు. పార్టీ విధివిధానాలు త్వరలో ప్రకటిస్తామన్నారు. ఐదు రంగులతో పార్టీ జెండా రూపొందించామని చెప్పారు.

లక్షలోపు రుణమాఫీ ఉత్తమాటేనా?

కేసీఆర్ తీరుపై వైఎస్ షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రైతులందరికీ రూ. లక్షలోపు రుణాలు మాఫీ చేస్తామని సీఎం కేసీఆర్ 2014, 2018 ఎన్నికల్లో హామీనిచ్చి ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చాక ఆ హామీ ఉత్తమాటగానే మిగిలిపోయిందా అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలనే లక్షణం సీఎం కేసీఆర్‌కి లేదన్నది స్పష్టమవుతోందన్నారు. రైతులకు విడతల వారీగా రూ.90 వేలలోపు రుణమాఫీ చేస్తామని చెప్పి కేవలం రూ.37 వేల లోపు రుణాలు ఉన్న వారికే రుణమాఫీ చేసి చేతులు దులుపుకున్నారని గుర్తు చేశారు. 5.66 లక్షల మందికి మాత్రమే రుణమాఫీ జరిగిందని మండిపడ్డారు. కేసీఆర్ చేసిన ద్రోహంతో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 31లక్షల మంది రైతులు బ్యాంకర్ల వద్ద తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నా రు. కేసీఆర్ ఇచ్చిన హామీని వెంటనే నిలబె ట్టుకోవాలని డిమాండ్ చేశారు.


జంట జలాశయాల ఉనికికి భంగం కలుగకుండా నిపుణుల కమిటీ కసరత్తు

జీవో 111 రద్దుతో ఎదురయ్యే పర్యావరణ సమస్యలు దృష్టిలో ఉంచుకుని మార్గదర్శకాలు

మురుగునీటి శుద్ధి కేంద్రాలు, వరద కాల్వల నిర్మాణం, గ్రీన్‌బెల్ట్ తదితర అంశాలపై అధ్యయనం

శాటిలైట్ మ్యాప్‌తో వర్షం నీటి ప్రవాహ మార్గాల గుర్తింపు

300 చ.మీ. పైన ఉండే ప్లాట్లకు మీటరు వెడల్పుతో గ్రీన్ బెల్ట్ తప్పనిసరి



బఫర్ జోన్ 500 మీటర్లే!

ప్రస్తుతం జంట జలాశయాల చుట్టూరా 10 కిలో మీటర్ల ప్రాంతాన్ని చెరువు పూర్తి స్థాయి సామర్థ్యం (ఎఫ్‌టీఎల్)గా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో కేవలం పదిశాతం విస్తీర్ణంలో మాత్రమే నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారు. అయితే కొత్త నిబంధనలలో ఎఫ్‌టీఎల్ స్థానంలో 500 మీటర్ల వరకే బఫర్ జోన్ ఉండనుంది. ఈ జోన్ పరిధిలో నిర్మాణాలపై ఆంక్షలుంటాయి. కాగా 300 చదరపు మీటర్లకు పైన ఉన్న ప్లాట్లకు కనిష్టంగా మీటరు వెడల్పుతో ఒకవైపున గ్రీన్ బెల్ట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుందని ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకరు 'సాక్షి'కి తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి

సాక్షి, హైదరాబాద్

జీవో 111 రద్దు అనంతర పరిణామాలను రాష్ట్ర ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. జీవో ఎత్తివేత తర్వాత ఎదురయ్యే పర్యావరణ సమస్యలను అంచనా వేస్తూ దానికి తగ్గట్టుగా మార్గదర్శకాల జారీకి కసరత్తు చేస్తోంది. ముఖ్యంగా జీవో రద్దుతో ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల మనుగడ ప్రశ్నార్థకమవుతుందనే పర్యావరణ వేత్తల ఆందోళనను పరిగణనలోకి తీసుకుంటూ అచితూచి అడుగులేస్తోంది. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా.. జలాశయాల ఉనికికి భంగం కలుగకుండా ప్రణాళికా బద్ధమైన అభివృద్ధికి సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేస్తోంది. భారీ నిర్మాణాలు, పరిశ్రమలతో జంట జలాశయాలు కలుషితం కాకుండా కఠినమైన చర్యలు తీసుకోనుంది. స్థిరాస్తి వ్యాపారం, నిర్మాణాలకు ఎడాపెడా అనుమతులు ఇచ్చేసి చేతులు దులుపుకోకుండా.. మురుగు నీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటు, వరద కాల్వల నిర్మాణం, గ్రీన్‌బెల్ట్, బఫర్ జోన్ పరిధుల నిర్ధారణ తదితర అంశాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తోంది. సుప్రీంకోర్టు, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్‌జీటీ)ల నుంచి అభ్యంతరాలు రాకుండా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలోని అత్యున్నత స్థాయి అధికారులు, నిపుణుల కమిటీ కొత్త నిబంధనల రూపకల్పనలో తలమునకలైంది. జీవో 111 పరిధిలోని ఏడు మండలాల్లో 84 గ్రామాలుండగా వీటిల్లో ప్రభుత్వ, ప్రైవేట్ కలుపుకొని సుమారు 1.35 లక్షల ఎకరాల భూమి ఉంది.

జెడ్‌ఎల్‌డీ ప్రాంతాల్లో నివాస సముదాయాలు

వర్షపాతాన్ని అధ్యయన నివేదిక ఆధారంగా తక్కువ వర్షపాతం ఉండి, జలాశయాల మనుగడకు ఇబ్బంది లేని ప్రాంతాన్ని జీరో లెవల్ డిశ్చార్జి (జెడ్‌ఎల్‌డీ)గా గుర్తించనున్నారు. ఈ ప్రాంతంలో హెచ్‌ఎండీఏ నిబంధనల ప్రకారమే నివాస సముదాయాల నిర్మాణాలకు అనుమతి ఇస్తారు. వాణిజ్య కార్యకలాపాలకు అస్సలు అనుమతులు ఉండవు. ఇక ఈ ప్రాంతాల్లోని నివాసాల నుంచి విడుదలయ్యే వ్యర్థ జలాలను శుద్ధి చేసి, తిరిగి ఆ నీటిని అక్కడే వివిధ ఇతర అవసరాలకు వినియోగించుకునే విధంగా తగిన ఏర్పాట్లు చేసుకోవాల్సి ఉంటుంది.

శాటిలైట్ మ్యాపుల ద్వారా గ్రీన్ చానళ్ల గుర్తింపు..

మురుగు, వర్షపు నీరు జంట జలాశయాలకు చేరితే వాటి ఉనికికే ప్రమాదమనేది పర్యావరణవేత్తల ప్రధాన అభ్యంతరం. దీనికి పరిష్కారం చూపించగలిగితే సమస్య ఉండదని భావించిన నిపుణులు కమిటీ.. అసలు వరద నీరు జలశయాలకు ఏ ప్రాంతం నుంచి చేరుతుందో అధ్యయనం చేయాలని నిర్ణయించారు. గత 50 ఏళ్ల వర్షపాతాన్ని అధ్యయనం చేసి నీటి ప్రవాహ మార్గాన్ని శాటిలైట్ మ్యాపుల ద్వారా గుర్తించనున్నారు. జలాశయాల ఎగువ నుంచి వచ్చే ఈ నీరు జీవో 111 పరిధిలోని 84 గ్రామాల గుండా ఎలా ప్రవహిస్తుందో నిర్ధారిస్తారు. ఈ ప్రవాహ మార్గాన్ని గ్రీన్ ఛానల్‌గా గుర్తిస్తారు. ఈ చానల్స్ వద్ద వరద కాలువలను నిర్మిస్తారు. ఒకవేళ కాలువల నిర్మాణం కోసం భూములు తీసుకోవాల్సి వస్తే గనక ప్రస్తుత మార్కెట్ రేటు కట్టి ఇవ్వాలని, అప్పుడే భూ యజమానులు ముందుకొస్తారని అధికారులు ప్రభుత్వానికి సూచించినట్లు తెలిసింది.

నేడు పొంగులేటి నివాసానికి రేవంత్

కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించేందుకు వెళ్లనున్న టీపీసీసీ చీఫ్

- ముందుగా జూపల్లి నివాసానికి, ఆ తర్వాత పొంగులేటి వద్దకు
- సాయంత్రం ఢిల్లీకి రేవంత్.. రేపు రాహుల్‌తో భేటీ అయ్యే అవకాశం
- 25 లేదా మరో రోజున పొంగులేటి టీం ఢిల్లీకి?



సాక్షి, హైదరాబాద్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఏ పార్టీలోకి వెళతారన్న దానిపై సస్పెన్స్ క్రమంగా వీడుతోంది. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ఆ ఇద్దరూ సిద్ధమయ్యారని గత కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి ఊతమిస్తూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బుధవారం ఆ ఇద్దరితో భేటీ కానున్నారు. బుధవారం మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఆయన ముందుగా అత్తాపూర్ సమీపంలోని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఇంటికి వెళ్లనున్నారు. అక్కడ జూపల్లితో భేటీ అయి ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం జూపల్లిని వెంటబెట్టుకుని జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ సమీపంలో ఉన్న పొంగులేటి నివాసానికి వస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి. అక్కడే ముగ్గురు నేతలతో పాటు మరికొందరు ముఖ్యులు భోజనం చేస్తారని, ఆ సమయంలోనే రేవంత్‌రెడ్డి వారందరినీ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తారని తెలుస్తోంది.

రాహుల్ అపాయింట్‌మెంట్ కోసం ఢిల్లీకి

పొంగులేటి అండ్ టీంతో సమావేశమైన తర్వాత రేవంత్‌రెడ్డి నేరుగా ఢిల్లీ వెళ్లనున్నట్టు సమాచారం. విదేశాల నుంచి ఢిల్లీకి వస్తున్న రాహుల్‌తో గురువారం రేవంత్ సమావేశమవుతారని, ఆయనతో మాట్లాడిన తర్వాత పొంగులేటి అండ్ టీం కలిసేందుకు రాహుల్ అపాయింట్‌మెంట్ తీసుకుంటారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఈనెల 25న లేదంటే నెలాఖరులోపు ఏదో ఒక రోజు రాహుల్‌గాంధీ వీలును బట్టి పొంగులేటి, జూపల్లి అండ్ టీం ఢిల్లీకి వెళ్లి రాహుల్‌గాంధీని కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరికపై అధికారిక ప్రకటన చేస్తారని గాంధీభవన్ వర్గాలు చెబుతున్నాయి.

నెలాఖరున బీఆర్‌ఎస్ విస్తృత స్థాయి సమావేశం

- యువజన, విద్యార్థి సమ్మేళనాల నిర్వహణపై దృష్టి
- పార్టీ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించేలా కార్యక్రమాలు



సాక్షి, హైదరాబాద్: ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా బీఆర్‌ఎస్ యంత్రాంగాన్ని సన్నద్ధం చేస్తున్న ముఖ్యమంత్రి, పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు తదుపరి కార్యాచరణపై దృష్టి సారించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 2న ప్రారంభమైన తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు గురువారం ముగుస్తున్నాయి. దీంతో పార్టీ యంత్రాంగాన్ని భాగస్వాములను చేస్తూ మరిన్ని కార్యకలాపాలు చేపట్టేందుకు అవసరమైన కార్యాచరణపై ఇప్పటికే కేసీఆర్ కసరత్తు పూర్తి చేశారు. రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై పార్టీ యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసేందుకు ఈ నెలాఖరులో పార్టీ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. మంత్రులు, పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యవర్గం, ప్రభుత్వ కార్పొరేషన్ల, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఇతర ముఖ్య నేతలు విస్తృత స్థాయి సమావేశానికి హాజరవుతారు. ఆత్మీయ సమ్మేళనాలు, దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల పనితీరును మదింపు చేసిన కేసీఆర్ ఎన్నికల సన్నద్ధతలో తదుపరి కార్యాచరణకు మరింత పదును పెడుతున్నట్లు సమాచారం.

యువజన, విద్యార్థి సమ్మేళనాలు

దశాబ్ది ఉత్సవాల ద్వారా ప్రభుత్వ పథకాల లబ్ధిదారులను చేరుకున్న బీఆర్‌ఎస్ నేతలు యువత, విద్యార్థులతో మమేకమయ్యేలా మరో కార్యక్రమాన్ని కేసీఆర్ రూపొందించారు. నియోజకవర్గ స్థాయిలో యువత, విద్యార్థులతో పార్టీ పక్షాన ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. తెలంగాణ ఉద్యమ ట్యాగ్‌లైన్ 'నిధులు, నీళ్లు, నియామకాలు' అంశంపై ఆయా వర్గాలను చేరుకునేలా కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. జూలై నెలాఖరు వరకు ఉద్యోగ, ఉపాధి కల్పన, ఉద్యోగ నియామకాలు వంటి అంశాలను యువత, విద్యార్థులతో నిర్వహించే సమ్మేళనాల్లో వివరిస్తారు. అక్టోబర్‌లో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందని భావిస్తున్న బీఆర్‌ఎస్, ఆలోగా పార్టీ యంత్రాంగం అనునిత్యం క్షేత్ర స్థాయిలో ఉండేలా కార్యకలాపాలు నిర్వహించాలని భావిస్తోంది.

బీఆర్‌ఎస్ నేతలు పార్టీ మారేందుకు సిద్ధంగా ఉన్నారు

- బీఆర్‌ఎస్‌ను గద్దె దింపేందుకే నా పాదయాత్ర: సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- స్వల్ప అస్వస్థతతో పాదయాత్రకు విరామం



పాదయాత్ర శిబిరం వద్ద భట్టివిక్రమార్కను పరీక్షిస్తున్న డాక్టర్

కేతేపల్లి: బీఆర్‌ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని నమ్మకం లేని ఆ పార్టీ నాయకులు గోడ దూకేందుకు సిద్ధంగా ఉన్నారని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క అన్నారు. ఉత్తర తెలంగాణ మొదలుకుని నల్లగొండవరకు సబ్బండ వర్గాల ప్రజలు బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై వ్యతిరేకతతో ఉన్నారని, ప్రజల సంపద దోచుకుంటున్న ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకే తాను పాదయాత్ర చేపట్టానని ఆయన పేర్కొన్నారు. పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మంగళవారం నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలంలో సాగింది. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో మభ్యపెడుతున్న కేసీఆర్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నక్కలగండి ప్రాజెక్టు వద్ద కుర్చీ వేసుకుని కూర్చుని పనులు పూర్తి చేయిస్తానని ఎన్నికల సమయంలో చెప్పిన కేసీఆర్‌కు.. ఇప్పటికీ కుర్చీ దొరకలేదా? అని ప్రశ్నించారు. ఏడేళ్లుగా పూర్తి చేయని 'పాలమూరు-రంగారెడ్డి'ఎత్తిపోతల ప్రాజెక్టును నాలుగు నెలల్లో పూర్తి చేస్తామంటూ ప్రజలను మరోసారి మోసం చేసేందుకు కేసీఆర్ ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. డిండి ఎత్తిపోతల, ఎస్‌ఎల్‌బీసీ, బ్రాహ్మణ వెల్లెంల ప్రాజెక్టుల పనులు పూర్తి చేయించడంలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి ఇద్దరూ విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేస్తామని చెప్పారు. సమావేశంలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య పాల్గొన్నారు.

భట్టివిక్రమార్కకు అస్వస్థత

కాగా, భట్టివిక్రమార్క మంగళవారం సాయంత్రం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. సూర్యాపేట నుంచి వచ్చిన వైద్యులు కేతేపల్లిలోని పాదయాత్ర శిబిరం వద్ద ఆయనకు చికిత్స అందించారు. తీవ్రమైన వడగాలులు, ఎండలను లెక్కచేయకుండా 96 రోజులుగా పాదయాత్ర చేస్తుండటంతో ఆయన వడదెబ్బకు గురయ్యారు. జ్వరం, తలనొప్పితో ఆయన బాధపడుతున్నారని, బీపీ కూడా పెరిగిందని వైద్యులు తెలిపారు. ఫ్లూయిడ్స్ ఎక్కించడంతో బీపీ కంట్రోల్‌లోకి వచ్చిందన్నారు. షెడ్యూలు ప్రకారం మంగళవారం ఆయన నకిరేకల్ హైవే నుంచి కొర్లపాడు మీదుగా కేతేపల్లికి, అక్కడి నుంచి భాగ్యనగరం శివారు వరకు మొత్తం 12.5 కిలోమీటర్ల దూరం నడవాల్సి ఉంది. అస్వస్థతకు గురికావడంతో నకిరేకల్ హైవే నుంచి బయలుదేరి కొర్లపాడు మీదుగా 6 కిలోమీటర్లు నడిచి కేతేపల్లికి చేరుకున్నారు. అక్కడే పాదయాత్రకు విరామం ప్రకటించారు. బుధవారం ఉదయం వరకు జ్వరం, తలనొప్పి తగ్గితే పాదయాత్ర తిరిగి ప్రారంభం అవుతుందని భట్టి విక్రమార్క కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. అస్వస్థతకు గురైన విషయం తెలిసిన వెంటనే మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు చెరుకు సుధాకర్, మాజీ ఎమ్మెల్సీ పి.నాగేశ్వరరావు, ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు భట్టిని పరామర్శించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

అభివృద్ధి లేదంటే క్షమాపణ చెబుతా

- ప్రగతి నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తారా..?
- కాంగ్రెస్ నేతలకు మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్

నల్లగొండ: తొమ్మిదేళ్ల పాలనలో అభివృద్ధి జరగలేదని నిరూపిస్తే తాము క్షమాపణకు సిద్ధమని.. అభివృద్ధి జరిగిందని నిరూపిస్తే గల్లీ నుంచి ఢిల్లీ వరకు ముక్కు నేలకు రాస్తారా.. అని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి కాంగ్రెస్ నేతలకు సవాల్ విసిరారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నల్లగొండలో జరిగిన విద్యా దినోత్సవంలో మంత్రి మాట్లాడారు. 9 ఏళ్ల కాలంలో జిల్లాలో అభివృద్ధి జరగలేదని, ఇందుకు సీఎం నల్లగొండ జిల్లా ప్రజలకు క్షమాపణ చెప్పాలంటూ ఇటీవల సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను మంత్రి పరోక్షంగా ప్రస్తావించారు. 60ఏళ్లు పాలించిన మీరే రాష్ట్రాన్ని నాశనం చేశారని.. మీరు 60 ఏళ్లలో చేయలేనిది 9 ఏళ్లలో సీఎం కేసీఆర్ సాధించి చూపించారని చెప్పారు. తాను చెప్పే ఒక్క లెక్క తప్పయినా అన్న మాటకు కట్టుబడి ఉంటానన్నారు. కేసీఆర్ ఉద్యమ నాయకుడిగా, అన్ని అనుభవాలు ఉన్న వ్యక్తిగా తొమ్మిదేళ్ల పాలనలో అన్ని రంగాలను అభివృద్ధి చేశారని జగదీశ్‌రెడ్డి వివరించారు. నల్లగొండ జిల్లా అత్యధిక ధాన్యం పండించి దేశానికే అన్నంపెట్టే స్థాయికి ఎదగడం అభివృది కాదా అని ప్రశ్నించారు. కేసీఆర్ ఫ్లోరిన్ సమస్య శాశ్వత పరిష్కారానికి కృష్ణ జలాలు అందించారని ఆయన గుర్తుచేశారు. కార్యక్రమంలో నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందే

రెండో స్థానం కోసమే ఆ పార్టీల ఆరాటం: మంత్రి గంగుల కమలాకర్



కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీ దొందూ దొందేనని, పొద్దంతా తెలంగాణపై విషం చిమ్మే ఆ పార్టీల నాయకులు రాత్రివేళ ఒకచోట కలిసి మాట్లాడుకునే తత్వమని మంత్రి గంగుల కమలాకర్ ధ్వజమెత్తారు. రాష్ట్రంలో రెండోస్థానం కోసమే ఆ పార్టీల ఆరాటమని గంగుల ఎద్దేవా చేశారు. తానెవరి జోలికి పోనని..తన జోలికి ఎవరన్నా వస్తే వదిలిపెట్టబోనని ఆయన హెచ్చరించారు. మంగళవారం కరీంనగర్‌లో గంగుల మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్, బీజేపీలు ఒక్కటేనని మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. మునుగోడు, హుజూరాబాద్ ఉపఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఒక్కటేనన్న విషయం స్పష్టమైందన్నారు. పొన్నం ప్రభాకర్, ఎంపీ బండి సంజయ్ తనపై కేసులు వేశారని, ఈసీకి ఫిర్యాదులు చేశారని, జైలుపంపించేందుకు కుట్రలు పన్నారని మండిపడ్డారు.

బీసీ కోటాతో పాగా..!

▶ మొదటి పేజీ తరువాయి

పరిమితం కాదని, అవకాశాలు, సమీకరణలను బట్టి ఆ సంఖ్య 50 వరకు ఉండే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతేకాకుండా గత ఎన్నికల మాదిరి ఆఖరి నిమిషం వరకు వేచి ఉండకుండా వీలున్నంత ముందుగానే అభ్యర్థులను ప్రకటిస్తామని వారు స్పష్టం చేస్తుండటం గమనార్హం.

జీవితాలకు స్థిరత్వం కల్పించే దిశలో..

తాము అధికారంలోకి వస్తే బీసీ కులాలకు ఆర్థికంగా సాయం చేస్తామనే హామీని కూడా ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. అయితే ఏదో కొంత నగదు ఇచ్చి చేతులు దులుపుకోకుండా.. బీసీ వర్గాలకు చెందిన వారు, ముఖ్యంగా కుల వృత్తుల వారు వారి వారి జీవితాల్లో స్థిరపడి ఆత్మగౌరవంతో బతికే విధంగా చేయూతనిచ్చే పథకాలకు రూపకల్పన చేసి, బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించనుంది. ఇక బీసీల్లో బాగా వెనుకబడిన (ఎంబీసీ) కులాలు, సంచార జాతులను గుర్తించి వారికి ఆర్థిక ప్యాకేజీ ప్రకటించే అవకాశాలు కూడా కనిపిస్తున్నాయి. గాంధీభవన్ వర్గాల్లో జరుగుతున్న చర్చ ప్రకారం.. బీసీలకు పార్టీ పదవులు, సీట్ల కేటాయింపులో తగినంత ప్రాధాన్యత ఇచ్చినప్పుడే అధికారం దక్కుతుందని పలుమార్లు రుజువయ్యిందని.. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు, తెలంగాణలో బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చింది కూడా ఆ సూత్రాన్ని అనుసరించేనన్న అభిప్రాయానికి కాంగ్రెస్ నేతలు వచ్చారు.

మా పార్టీకి ఆ స్పృహ ఉంది..

బలహీన వర్గాలకు న్యాయం చేస్తామంటూ ఎన్నికలకు ముందు ప్రకటనలు చేయడమే కాదు. వాటి అమలు కోసం చర్యలు తీసుకుంటాం. బీసీల అభివృద్ధికి మేం కట్టుబడి ఉంటాం. మేం అధికారంలోకి వచ్చాక వారికి ఏ ఇబ్బంది వచ్చినా జవాబుదారీతనంతో వ్యవహరిస్తాం. లక్ష రూపాయలు ఇచ్చి కొట్లాడుకోండని చెప్పం. వారు ఆత్మగౌరవంతో బతికే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. తెలంగాణ ఏర్పడింది సామాజిక కోణంలోననే ఆ స్పృహ మా పార్టీకి ఉంది.

– పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ బీసీ ముఖ్య నేత, మాజీ ఎంపీ

ఇదండీ సంగతి



'సారు భవిష్యత్తుకు గ్యారంటీ' కోసం కాదు..!

మనసున్న కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేద్దాం

సిరిసిల్లలో మంత్రి కేటీఆర్

- తొమ్మిదేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు
- ఆసరా పెన్షన్లు, రైతుబంధు, ఉచిత కరెంట్ ఇచ్చాం..
- వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించిన మంత్రి



సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలో నూతనంగా నిర్మించిన స్కూల్ భవనాన్ని విద్యార్థులతో కలసి ప్రారంభిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో వినోద్‌కుమార్ తదితరులు

సిరిసిల్ల: ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు తొమ్మిదేళ్ల పాలనలో అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు వచ్చాయని మంత్రి కేటీ రామారావు చెప్పారు. కరోనాతో రూ.లక్ష కోట్ల నష్టం వచ్చినా కల్యాణలక్ష్మి ఆగలేదని, ఆసరా పెన్షన్లు, రైతుబంధు, ఉచిత కరెంట్ ఇచ్చామని తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్నామని, దేశంలో ఆసరా పెన్షన్లు అధికంగా ఇచ్చే ప్రభుత్వం మనదేనని అన్నారు. ఇలాంటి మనసున్న కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేసుకుందామని చెప్పారు. మంగళవారం రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం గోరింట్యాలలో అదనపు తరగతి గదులు, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో జెడ్పీ హైస్కూల్ కాంప్లెక్స్, సిరిసిల్లలో వాలీబాల్ అకాడమీని మంత్రి ప్రారంభించారు. దివ్యాంగులకు ఉపకరణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు.

మనసున్న ముఖ్యమంత్రి కాబట్టే..

'మనసున్న ముఖ్యమంత్రి కాబట్టి కేసీఆర్ దివ్యాంగుల సంక్షేమానికి బాటలు వేస్తున్నారు. దివ్యాంగులకు పక్కనే ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో రూ.200, కర్ణాటకలో రూ.1,100, మహారాష్ట్రలో రూ.300, ప్రధాని మోదీ సొంత రాష్ట్రం గుజరాత్‌లో రూ.600 పెన్షన్ ఇస్తుంటే..మన రాష్ట్రంలో మాత్రం రూ.3,0 16 చొప్పున చెల్లిస్తున్నాం. వచ్చే నెలనుంచి రూ.4,0 16 ఇస్తాం. గుజరాత్‌లో 47 వేల మంది దివ్యాంగులకు పెన్షన్ ఇస్తున్నారు. అదే మన రాష్ట్రంలో 5.15 లక్షల మందికి ఇస్తున్నాం. వారి సంక్షేమానికి రూ.1,800 కోట్లు వెచ్చించాం. ఉద్యోగాల్లో 4%, డబుల్ బెడ్రూం ఇళ్లలో 5% రిజర్వేషన్లు కల్పించాం. ఇలా ఆసరా కల్పించడం తప్పని, ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుందని ప్రధాని మోదీ చెబుతున్నారు. బడా వ్యాపారులకు రూ.12 లక్షల కోట్లు మాఫీ చేయడం మాత్రం మంచిదట. ఎవరేం అన్నా..ఇంకా సదరం సర్టిఫికెట్ రాని వారికి, అర్హత ఉండి పెన్షన్ రాని వాళ్లను గుర్తించి వారికి కూడా పింఛన్లు ఇస్తాం..' అని కేటీఆర్ తెలిపారు.

బండి సంజయ్ అర్ధపైసా సాయం చేయలే..

'ఎంపీ బండి సంజయ్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. కేంద్రంలో ఆ పార్టీ అధికారంలో ఉన్నా అర్ధపైసా సాయం చేయలేదు. ఒక్క నవోదయ పాఠశాల, మెడికల్ కాలేజీ అయినా, సిరిసిల్లకు మెగా పవర్‌లూమ్ క్లస్టర్, కరీంనగర్‌కు ట్రిపుల్ ఐటీ అయినా తేలేదు. కానీ కాళ్లళ్ల కట్టెలు పెడుతున్నారు..' అని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్, ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, పలు సంస్థల చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

మన పిల్లలు ప్రపంచంతో పోటీ పడాలి

'గంభీరావుపేటలో కేజీ టూ పీజీ స్కూల్ రాష్ట్రానికి ఆదర్శమైంది. అక్కడ ప్రభుత్వ హాస్టళ్లను కూడా ప్రారంభిస్తాం. విద్యతోనే వికాసం..విజ్ఞానం. ఒకతరం చదువుకుంటే ఇక వెనక్కి చూడాల్సిన పని ఉండదు. ప్రపంచంతో పోటీపడే స్థాయికి ఎదగాలి. జిల్లాలోని 60 స్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతి వరకు పిల్లలకు కంప్యూటర్ బేసిక్స్ నేర్పిస్తున్నాం. ఈ నైపుణ్య శిక్షణ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా సర్కారు స్కూళ్లలో అమలు చేస్తాం. బాలికలకు ఆత్మరక్షణ కార్యక్రమాలు అన్ని పాఠశాలల్లో నిర్వహిస్తాం..' అని మంత్రి చెప్పారు.

మూడు రోజులు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాగల మూడు రోజులు తెలంగాణ రాష్ట్రంలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరికొన్నిచోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కాగా, నైరుతి రుతుపవనాలు రాగల మూడు రోజుల్లో ద్వీపకల్ప దక్షిణ భారత దేశంలోని మరికొన్ని భాగాలకు విస్తరించే అవకాశాలున్నాయని తెలిపింది. దిగువ స్థాయిలోని గాలులు ముఖ్యంగా వాయవ్య దిశ నుండి తెలంగాణ రాష్ట్రం వైపునకు వీస్తున్నాయని పేర్కొంది. మంగళవారం రాష్ట్రంలో పలుచోట్ల వడగాలులు వీచాయి. నల్లగొండ జిల్లా కట్టంగూరులో అత్యధికంగా 44.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. కొమురంభీం జిల్లా కెరమెరిలో 44.4 డిగ్రీలు నమోదైంది.

మంగళవారం రాష్ట్రంలో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు... (సెల్సియస్‌లలో)

ప్రాంతం	గరిష్ట ఉష్ణోగ్రత
కట్టంగూరు (నల్లగొండ)	44.7
కెరమెరి (కొమురంభీం)	44.4
మేడారం (ములుగు)	44.2
ముత్తారం (పెద్దపల్లి)	43.8
వీణవంక (కరీంనగర్)	43.7
ఆదిలాబాద్	42.5
రామగుండం	42.0
నల్లగొండ	41.5
హనుమకొండ	40.5
నిజామాబాద్	39.7
భద్రాచలం	39.6
మెదక్	39.6
మహబూబ్‌నగర్	39.5
హైదరాబాద్	38.8
ఖమ్మం	38.6

ప్రతి లక్ష జనాభాకు 22 మెడికల్ సీట్లు: మంత్రి హరీశ్



10 జీపీఏ సాధించిన విద్యార్థికి ఐప్యాడ్ అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సాక్షి, సిద్దిపేట: ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటయ్యాక ప్రతి లక్ష జనాభాకు 22 వైద్య సీట్లు మంజూరయ్యేలా చేయడంతోపాటుగా వైద్యవిద్యను అందుబాటులోకి తెచ్చామని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణలో ఐదే వైద్య కళాశాలుండగా అందులో రెండు స్వాతంత్ర్యానికి ముందు ఉన్నవేనని, 60ఏళ్లలో ఏర్పాటు చేసింది మూడేనని చెప్పారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సిద్దిపేటలో నిర్వహించిన విద్యాదినోత్సవంలో మంత్రి మాట్లాడారు. 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమి లేదని, కేసీఆర్ సీఎం కాకపోతే ఇంతటి అభివృద్ధి జరిగేదా ప్రశ్నించారు. టెన్త్‌లో 10 జీపీఏ సాధించిన 126 మంది విద్యార్థులకు ఐప్యాడ్‌లు, 100% ఉత్తీర్ణత సాధించిన 219 ప్రభుత్వ పాఠశాలలకు రూ.25వేల చొప్పున నగదు పురస్కారం, 100% ఉత్తీర్ణత సాధించిన 8 మండలాలకు రూ.50వేల చొప్పున నగదు పురస్కారం అందజేశారు.

'మెడికల్, నవోదయ' మంజూరులో కేంద్రం వివక్ష

విద్యా దినోత్సవంలో సుఖేందర్‌రెడ్డి



విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద తలసాని, గుత్తా, సబిత, మహమూద్ అలీ

గన్‌ఫౌండ్రీ: రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. మెడికల్ కాలేజీలు, కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ పాఠశాలలను మంజూరు చేయకుండా వివక్ష చూపుతోందన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాశాఖ ఆధ్వర్యంలో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రం ఎంత వివక్ష చూపినా.. సీఎం కేసీఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. 'మన ఊరు–మన బడి'కార్యక్రమం అద్భుతమని ప్రశంసించారు. పాఠశాలలు ప్రతిరోజూ 45 నిమిషాలు క్రీడలకు కేటాయించాలని, పీఈటీలను భర్తీ చేయాలని విద్యాశాఖ మంత్రికి సూచించారు. విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. 'మన ఊరు–మన బడి' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దినట్లు వెల్లడించారు. మంత్రులు తలసాని, మహమూద్ అలీ మాట్లాడుతూ... గత ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలలను విస్మరించాయని, నాటి ప్రభుత్వ పాఠశాలలకు, నేటి ప్రభుత్వ పాఠశాలలకు ఉన్న తేడా గమనించాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను, విద్యార్థులను ఘనంగా సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, పాఠశాల మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్ ఆర్.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్యాగధనులకు నిత్య నీరాజనం

- అమరులకు ఘనమైన స్మారకం
- అరుదైన శైలిలో నిర్మాణం
- దశాబ్ది ఉత్సవాల ముగింపు సందర్భంగా రేపు తెలంగాణ అమరవీరుల స్మారకాన్ని ఆవిష్కరించనున్న సీఎం



మంగళవారం రాత్రి విద్యుత్ వెలుగుల్లో అమరవీరుల స్మారకం

దేవాలయాల్లో నిత్య పూజలు ఎలా జరుగుతాయో, తెలంగాణను కలను సాకారం చేసేందుకు ప్రాణాలను పణంగా పెట్టిన తెలంగాణ అమరవీరులకు నిత్య నీరాజనాలు పలికే తరహాలో ఈ నిర్మాణానికి ముఖ్యమంత్రి దీనికి డిజైన్ చేశారు. ఆయన ఆలోచనలకు తగ్గ రీతిలో దీన్ని రూపొందించాం. ఆ నిర్మాణంలో కీలక భూమిక పోషించే అవకాశం నాకు రావటం గర్వంగా అనిపిస్తోంది. ఢిల్లీకి వచ్చే ప్రముఖులు బాపూ సమాధి వద్ద ఎలా నివాళులు అర్పిస్తారో, అదే తరహాలో.. నగరానికి వచ్చే ప్రముఖులు తెలంగాణ అమరుల స్మారకం వద్ద నివాళులు అర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నాం.
– మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

సాక్షి, హైదరాబాద్:'తెలంగాణ' కలను సాకారం చేసిన అమరులకు ఇక నుంచి నిత్య నివాళి ప్రతిధ్వనించబోతోంది. వెలకట్టలేని త్యాగధనులకు ఆరని రీతిలో నీరాజనాల దివ్వె జ్వలించబోతోంది.

➤ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించి తెలంగాణ కలను సాకారం చేసిన త్యాగ. దనులకు ఘనమైన నివాళిగా ప్రభుత్వం గొప్ప స్మా రకాన్ని నిర్మించింది. చారిత్రక హుస్సేన్‌సాగర్ చెంత లుంబిని పార్కును ఆనుకొని మరో అద్భుత దృశ్యంగా.. అమరుల జ్ఞాపకాలు అరుణకాంతులై ఆకాశాన్ని ఎరుపెక్కించే 'తెలంగాణ అమరవీరుల స్మారకం'గురువారం ఆవిష్కృతం కానుంది. తెలంగాణ దశాబ్ది ఆరంభ ఉత్సవాల ముగింపు సందర్భంగా సీఎం కేసీఆర్ గురువారం సాయంత్రం 6.30 గంటలకు ఆవిష్కరించనున్నారు.

రూ.180కోట్లతో..

ఇటీవలే ఘనంగా ప్రారంభించుకున్న సచివాలయానికి ఎదురుగా రూ.180 కోట్ల వ్యయంతో వెలుగుతున్న ప్రమిద ఆకృతిలో ఆరు అంతస్తులుగా దీన్ని రూపొందించారు. అతుకులు లేని జర్మనీ నుంచి తెప్పించిన స్టెయిన్‌లెస్ స్టీల్‌తో వెలుపలి భాగాన్ని డిజైన్ చేశారు. ఈ తరహాలో ప్రపంచంలో ఇప్పటి వరకు చికాగో, చైనా, దుబాయ్ లోనే నిర్మాణాలు రూపొందాయి. లుంబినీ పార్కులోని 3.29 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం దీనికి కేటాయించింది. ఇందులో 26800చ.మీ. విస్తీర్ణంలో భవనాన్ని నిర్మించారు. రెండో అంతస్తు సెల్లార్‌తో కలుపుకొని 6అంతస్తులుగా ఈ భవనం రూపుదిద్దుకుంది. ప్రమిద ఆకృతి లో భవనం ఉండగా, దానికి జ్వలిస్తున్న దీపం ఆకృతిని 26 మీటర్ల ఎత్తుతో ఏర్పాటు చేశారు. అద్దంతో రూపొందించిన తరహాలో ఆ భవనంలో వెలుపలి వాటి ప్రతిబింబాలు దర్శనమిస్తుండటం ప్రత్యేకంగా కనిపిస్తోంది.

బేస్‌మెంట్2లో పార్కింగ్ వసతి

బేస్‌మెంట్2లో 175 కార్లు, 200 ద్విచక్ర వాహనాలకు, బేస్‌మెంట్1లో 160 కార్లు, 200 ద్విచక్రవాహనాల పార్కింగ్, లాంజ్, ప్యానెల్ రూమ్, పంప్ రూమ్ నిర్మించారు. మొదటి అంతస్తులో మ్యూజియం, ఫొటో గ్యాలరీ, 70 మంది సామర్థ్యంతో ఆడియో విజువల్ రూమ్స్, ఎస్కలేటర్ ఏర్పాటు చేశారు. రెండో అంతస్తులో 500 మంది సామర్థ్యంతో సమావేశమందిరం, లాబీ ఏరియా ఏర్పాటు చేశారు. మూడో అంతస్తులో రెస్టారెంట్, వ్యూ పాయింట్, ఓపెన్ టెర్రస్ సీటింగ్ ఏరియా ఏర్పాటు చేశారు. నాలుగో అంతస్తులో గ్లాస్ రూఫ్‌తో ఉన్న రెస్టారెంట్, ఓవర్‌హెడ్ ట్యాంక్ ఉన్నాయి. పైన ఉక్కుతో రూపొందించిన దీపం ఆకృతి ఏర్పాటు చేశారు. దీనిపై బయటి నుంచి బంగారు రంగులో లైటింగ్ ప్రసరిస్తుంది. 15 మంది సామర్థ్యం ఉన్న 3 లిఫ్టులు ఏర్పాటు చేశారు.

డ్రోన్లతో మెగా లేజర్ షో..

స్మారకం ఆవిష్కరణ సందర్భంగా గురువారం సాయంత్రం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం నుంచి సెక్రటేరియట్ వరకు అమరుల త్యాగాలను తెలిపేలా 5000 మంది కళాకారులతో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించనున్నారు. తెలంగాణలోని వివిధ కళారూపాలను ప్రదర్శిస్తారు. స్మారకం ఎదురుగా బహిరంగసభను ఏర్పాటు చేయనున్నారు. తెలంగాణ ఉద్యమాన్ని, తెలంగాణ చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని చాటేవిధంగా సుమారు 800 డ్రోన్లతో లేజర్ షో కూడా ఉంటుంది. సీఎం స్మారకాన్ని ఆవిష్కరించినప్పటి నుంచి ప్రతి రోజూ సాయంత్రం నుంచి తెల్లవారు జాము వరకు వెలుగులు విరజిమ్మేవిధంగా జ్యోతి (దియా)లో లైటింగ్ ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

మంత్రి శ్రీనివాసగౌడ్ సమీక్ష

అమరవీరుల స్మారక కేంద్రం, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయం వద్ద గురువారం నిర్వహించనున్న లేజర్ మెగా డ్రోన్ల షోపై మంగళవారం మంత్రి శ్రీనివాసగౌడ్ తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. డ్రోన్లషోను టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్‌తో కలిసి పరిశీలించారు. వివిధ జిల్లాల్లో 400 డ్రోన్లతో లేజర్ షో నిర్వహిస్తామని చెప్పారు. ముందుగా మహబూబ్‌నగర్‌లో, తర్వాత వరంగల్, సిద్దిపేట, నిజా మాబాద్, ఖమ్మం జిల్లాలో లేజర్ షో ప్రదర్శిస్తామన్నారు.

మంత్రులు తలసాని, మహమూద్ అలీ, డీజీపీ పరిశీలన

బహిరంగసభను నిర్వహించనున్న ప్రాంతాన్ని మంత్రులు తలసాని, మహమూద్ అలీ, డీజీపీ అంజనీకుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సభలో కేసీఆర్ ప్రసంగిస్తారని తలసాని చెప్పారు. సభ ఏర్పాట్లకు సంబంధించిన మంత్రులు అధికారులకు తగిన సూచనలు చేశారు.

'అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషిస్తాం'

సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నిక యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా (యూఎస్ఏ)లోని బీఆర్ ఎస్ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని పార్టీ యూఎస్ఏ సలహా బోర్డు చైర్మన్ తన్నీరు మహేశ్ పేర్కొన్నారు. కొలంబస్ నగరంలో మంగళవారం జరిగిన బీఆర్ఎస్ తొలి 'జాతీయ సదస్సు 2023' ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వ్యవసాయ రంగంలో సంస్కరణలు, రైతుబంధు వంటి సంక్షేమపథకాలను ఇతర రాష్ట్రాలు కూడా అనుసరిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్‌ను అమెరికాలోని అన్ని రాష్ట్రాల్లో బలోపేతం చేయడం, ప్రవాస భారతీయులను ఆహ్వానించి తెలంగాణలో జరిగిన అభివృద్ధిని వివరించడంపై బీఆర్ఎస్ యూఎస్ దృష్టి సారిస్తుందని చెప్పారు. తెలంగాణ అభివృద్ధి నమూనాకు సంబంధించిన వీడియోలను వివిధ భారతీయ భాషల్లోకి అనువదిస్తామని మహేశ్ వెల్లడించారు. సదస్సులో అమెరికాలోని 50 రాష్ట్రాల నుంచి బీఆర్ఎస్ ప్రతినిధులు హాజరు కాగా, ప్రముఖ అటార్నీ వినీత మెహ్రా, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ అసోసియేషన్స్ అధ్యక్షుడు అరిందమ్ గుహ, బ్లూ యాష్ సిటీ కౌన్సిల్ వైస్ మేయర్ ప్రమోద్ ఝవేరీ అతిథులుగా పాల్గొన్నారు.

ముగిసిన బండి సంజయ్ ఢిల్లీ పర్యటన

రాష్ట్రంలోని తాజా పరిస్థితులు, పార్టీ కార్యక్రమాలపై ముఖ్య నేతలతో భేటీ



సాక్షి, హైదరాబాద్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఒకరోజు పర్యటన కోసం ఢిల్లీ వెళ్లి మంగళవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్నారు. సోమవారమే సంజయ్ బెంగళూరు వెళ్లి అక్కడి నుంచి ఢిల్లీ వెళ్లినట్టుగా పార్టీ వర్గాల సమాచారం. ఢిల్లీలో పార్టీ ముఖ్యనేతలతో ఆయన భేటీ అయినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులు, పార్టీపరంగా చేపడుతున్న కార్యక్రమాలు, వాటికి ప్రజల నుంచి వస్తున్న స్పందనపై భేటీలో చర్చకు వచ్చినట్లు సమాచారం. మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రస్తుతం తెలంగాణలో 'మహా జనసంపర్క్ అభియాన్'లో భాగంగా చేపడుతున్న ప్రచారం, ఈ నెల 30 దాకా చేపట్టబోయే కార్యక్రమాలపై చర్చించినట్లు పార్టీ వర్గాల సమాచారం. అభియాన్‌లో భాగంగా 25న నాగర్‌కర్నూల్‌లో పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సభ ఖరారు కాగా, నెలాఖరులోగా ఖమ్మం పట్టణంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా బహిరంగసభ తేదీపై నిర్ణయం తీసుకొనే విషయంలోనూ సమాలోచనలు జరిపినట్లు బీజేపీ నేతలు చెబుతున్నారు. అమెరికా పర్యటన నుంచి ప్రధాని మోదీ తిరిగొచ్చాక రాష్ట్రంలో బహిరంగసభ లేదా రోడ్‌షో నిర్వహించేందుకు అనుమతి కోసం కూడా జాతీయ నేతలను సంజయ్ కోరినట్లు సమాచారం. ఈ నెలాఖరు వరకు రాష్ట్రంలో చేపట్టబోయే కార్యక్రమాలు, సభలు, సమావేశాల వంటి వాటికి కేంద్ర మంత్రులు, జాతీయ నేతలు పాల్గొనేలా కార్యాచరణ ఖరారు చేయాలని కోరినట్టు తెలిసింది.

ఈటల, రాజగోపాల్‌రెడ్డిలకు నడ్డా ఫోన్?

బీజేపీ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలతో జేపీ నడ్డా మంగళవారం ఫోన్లో మాట్లాడినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రస్తుతం చోటుచేసుకుంటున్న రాజకీయ పరిస్థితులు, పరిణామాలపై వారి నుంచి నడ్డా ఆరా తీసినట్లు తెలుస్తోంది. ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన కొందరు ముఖ్యనేతలు అసంతృప్తితో ఉన్నారని కొంతకాలంగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. బీఆర్ఎస్‌పై పార్టీ నాయకత్వం ఒకింత మెతక వైఖరి ప్రదర్శిస్తోందనే భావనకు గురైన కొందరు నేతలు అసంతృప్తితో ఉన్న తీరుపై 'వలస నేతల ఉక్కపోత' శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన వార్త చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలోనే నడ్డా వారికి ఫోన్ చేసి ఉంటారని భావిస్తున్నారు. కాగా, ఈటల ఎన్నికల కమిటీ చైర్మన్ పదవి తీసుకొనేందుకు విముఖత ప్రదర్శిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ పరిణామాల మధ్య నడ్డా ఫోన్ చేసి ఈటల, రాజగోపాల్‌రెడ్డిలకు వివిధ అంశాలు వివరించి, నచ్చజెప్పినట్లు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ ఏడాది చివర్లో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలు ఉన్నందున నాయకత్వం ఆయా అంశాలపై దృష్టి సారించేందుకు, నిర్ణయాలు తీసుకొనేందుకు మరికొంత సమయం పడుతుందని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

సాయం సరే..దరఖాస్తెలా?

- కుల, ఆదాయం సర్టిఫికెట్లు అందని బీసీల ఆవేదన
- పగలంతా తహసీల్దార్ ఆఫీసుల వద్ద పడిగాపులు
- మంగళవారంతో ముగిసిన 'రూ.లక్ష సాయం' గడువు
- రాత్రి 12 వరకు మీ సేవా సెంటర్ల వద్ద దరఖాస్తుదారులు
- సర్వర్ల డౌన్‌తో ఇబ్బందులు.. గడువు పెంచాలని విజ్ఞప్తులు



సాక్షి, హైదరాబాద్/కుత్బుల్లాపూర్: వెనుకబడిన వర్గాల్లోని కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం..బీసీ కులాల వారు కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద రోజంతా పడిగాపులు కాశారు. దరఖాస్తుకు గడువు మంగళవారం ముగియనుండటంతో అధిక సంఖ్యలో బీసీలు అక్కడికి వచ్చారు. సాయంత్రం 6 గంటల సమయంలో కార్యాలయం గేటుకు తాళం వేయడంతో సర్టిఫికెట్లు అందనివారు సిబ్బంది కాళ్లావేళ్లా పడ్డారు. విధులు ముగించుకుని వెళ్తున్న తహసీల్దార్ సంజీవరావుకు తమ గోడు చెప్పుకున్నారు. సర్టిఫికెట్లు లేకపోతే లక్ష సాయం అందకుండా పోతుందని వాపోయారు. చింతల్‌కు చెందిన మంగలి సంగమేశ్వర్ చొక్కా విప్పి గేటు ముందు బైఠాయించారు. ఈ నెల 8న ఆదాయ పత్రం కోసం మీ సేవలో దరఖాస్తు చేశానని, మూడు రోజులుగా ఉదయం నుంచి సాయంత్రం వరకు కార్యాలయం చుట్టూ తిరిగినా పని అవలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్టిఫికెట్ల కోసం ఇక్కడ 12,240 దరఖాస్తులు అందగా కేవలం 4 వేలు మాత్రమే పరిష్కారమయ్యాయి. కాగా సర్వర్ డౌన్ కారణంగా ఈ పరిస్థితి నెలకొందని తహసీల్దార్ చెప్పారు. సిబ్బంది పగలు, రాత్రి పనిచేస్తున్నారని వివరించారు. ఒక్క కుత్బుల్లాపూర్ మండలంలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉన్నట్టు తెలుస్తోంది. చాలామంది ఎప్పుడో దరఖాస్తు చేసుకున్నా మంగళవారం కూడా సర్టిఫికెట్లు అందలేదు. మరోవైపు సర్టిఫికెట్లు అందినవారు దరఖాస్తు చేసుకునేందుకు కూడా ఇబ్బందులెదురయ్యాయి.

5 లక్షలకు పైగానే దరఖాస్తులు


లక్ష రూపాయల సాయానికి దరఖాస్తు చేసుకునే గడువు మంగళవారం అర్ధరాత్రి 12 గంటలతో ముగుస్తుండడం, గడువు పెంచేది లేదని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ స్పష్టం చేయడంతో ఉదయం నుంచి రాత్రి వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మీసేవా సెంటర్లు, ఇతర కంప్యూటర్ సెంటర్లు దరఖాస్తుదారులతో కిటకిటలాడాయి. మరోవైపు కుల, ఆదాయం సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ కార్యాలయాల వద్ద భారీగా క్యూలు కనిపించాయి. సర్టిఫికెట్లు పొందలేని వారు నిరాశతో వెనుదిరిగారు. ఇక దరఖాస్తులు ఒక్కసారిగా పోటెత్తడంతో చాలా ప్రాంతాల్లో సర్వర్ మొరాయించింది. రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల దరఖాస్తులు మాత్రమే వస్తాయని ప్రభుత్వం భావించినప్పటికీ, భారీ స్పందన నేపథ్యంలో మంగళవారం రాత్రి 8 గంటల వరకే 5 లక్షల దరఖాస్తులు వచ్చినట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారులు తెలిపారు. అయితే రాత్రి పొద్దుపోయే వరకు అందిన సమాచారం మేరకు 5 లక్షల మందికి పైగానే దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అర్హులను ఎంపిక చేసి జూలై 15 నుంచి దశల వారీగా ఆర్థిక సాయం చెక్కుల రూపంలో అందజేస్తారు.

దరఖాస్తు గడువు తేదీ పొడిగించాలి



రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు గౌడ కులస్తులకు మొన్ననే అవకాశం ఇచ్చారు. దరఖాస్తు చేసుకుందామని మీ సేవా కేంద్రానికి వెళితే సర్వర్ డౌన్ అయిందని చెప్పారు. దీంతో ఏం చేయాలో తెలియక ఇంటికొచ్చా. ప్రభుత్వం దరఖాస్తు గడువు పొడిగించాలి. లేకపోతే మాలాంటి నిరుపేద చేతి వృత్తుల వారికి ఆర్థిక సాయం అందకుండా పోతుంది.
–ముత్తంగి ఇందిర, కొల్లాపూర్, సంగారెడ్డి జిల్లా

వారం క్రితం దరఖాస్తు చేసినా సర్టిఫికెట్లు రాలేదు



లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకోవాలంటే కుల, ఆదాయ సర్టిఫికెట్లు అవసరం. వాటికోసం ఈనెల 14వ తేదీన దరఖాస్తు ఇస్తే ఇప్పటికీ ఇవ్వలేదు. తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయా. మంగళవారం చివరి రోజు కావడంతో నల్లగొండ ఆర్డీవో కార్యాలయంలో సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్నారని తెలిసి ఇక్కడికి వచ్చా. సర్టిఫికెట్లు ఎప్పుడు వస్తాయో, దరఖాస్తు చేస్తానో లేదో తెలియడం లేదు.
– బొద్దుపల్లి నరసింహ, నల్లగొండ టౌన్

అదను దాటలేదు... ఆందోళన వద్దు

సాక్షి, హైదరాబాద్: ఈ వానాకాలం సీజన్ అదను దాటలేదని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు భరోసా ఇచ్చింది. పంటలను విత్తుకోవడానికి సమయం దాటిపోలేదని విశ్వవిద్యాలయం పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన జారీచేశారు. ఈ సంవత్సరం సాధారణ వర్షపాతం నమోదు కావచ్చని తెలిపారు. ఈ నెల ఒకటిన కేరళను తాకవలసిన రుతుపవనాలు 8వ తేదీకి వచ్చాయని, ఈ సమయంలో గుజరాత్ తీరంలో ఏర్పడిన తుపాను వల్ల మన రాష్ట్రానికి రుతుపవనాల రాక ఆలస్యమైందని పేర్కొన్నారు. రెండు, మూడు రోజుల్లో వర్షాలు పడతాయన్న ఆయన.. పంటలవారీగా రైతులకు కొన్ని సలహాలు ఇచ్చారు.

ఏ పంట? ఎప్పటివరకు ?

వరి: ఇప్పుడు నార్లు పోసుకోవాలనుకునే రైతులు కేవలం స్వల్పకాలిక (125 రోజుల కన్నా తక్కువ) వరి రకాలను మాత్రమే విత్తుకోవాలి. నేరుగా విత్తే పద్ధతులపై (దమ్ముచేసి లేదా దమ్ము చేయకుండా) రైతాంగం శ్రద్ధ పెట్టాలి.

రైతాంగానికి వ్యవసాయ వర్సిటీ భరోసా



పత్తి: జూలై 20 వరకు విత్తుకోవచ్చు. తేలిక నేలల్లో 50–60 మిల్లీమీటర్లు, బరువు నేలల్లో 60–75 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత మాత్రమే పత్తిని విత్తుకోవాలి. పత్తిలో అంతరపంటగా కంది మంచి లాభాలు ఇస్తుంది. కాబట్టి అంతర పంటగా కందిని సాగు చేపట్టాలి.

కంది పంట: సరైన యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా ఆగష్టు 15 వరకు కందిని విత్తుకోవచ్చు. పెసర, మినుము, వేరుశనగ, పత్తి, ఆముదం సహా ఇతర పంటలతో అంతర పంటగానూ విత్తుకోవచ్చు.

సోయాచిక్కుడు: జూన్ నెల చివరి వరకు విత్తుకోవచ్చు. సరైన సస్యరక్షణ చర్యలు చేపడితే జూలై మొదటి వారంలో విత్తినా సోయాలో మంచి దిగుబడులు సాధించవచ్చు.

మొక్కజొన్న: జూలై 15 వరకు విత్తుకోవచ్చు. నీటి ఎద్దడిని మొక్కజొన్న తట్టుకోలేదు. కాబట్టి బోదె, సాళ్ళ పద్ధతి ఆచరించడం ద్వారా పంటకు ఎక్కువ కాలం తేమ అందుబాటులో ఉంచవచ్చు.

పెసర, మినుము: ఈ పంటలను జూలై 15 వరకు విత్తుకోవచ్చు. సరైన మొక్కల సంఖ్యను పాటించడం ద్వారా ఆశించిన దిగుబడులు పొందవచ్చు. ఇతర ఆరుతడి పంటలైన ఆముదం, పొద్దు తిరుగుడు, ఉలువలను జూలై 31 వరకు సాగు చేసుకోవచ్చు. కాబట్టి రైతాంగం ఆందోళన పడవలసిన అవసరం లేదు.



జస్టిస్ సంతోష్‌రెడ్డి దంపతులను సన్మానిస్తున్న ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ దంపతులు

జస్టిస్ సంతోష్‌రెడ్డి సేవలు మరువలేనివి

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ సంతోష్‌రెడ్డి పలు కీలక తీర్పులు ఇచ్చారని.. ఆయన సేవలు మరువలేనివని ప్రధాన న్యాయమూర్తి ఉజ్జల్ భూయాన్ ప్రశంసించారు. ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా జస్టిస్ సంతోష్‌రెడ్డిని ఫుల్ కోర్ట్ మంగళవారం ఘనంగా సన్మానించింది. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఏ.నరసింహారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జస్టిస్ సంతోష్‌రెడ్డి దంపతులను సన్మానించారు.

సీఐసీ, ఐసీ నియామకానికి చర్యలు చేపట్టారా?

- ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ప్రధాన సమాచార కమిషనర్(సీఐసీ), సమాచార కమిషనర్ల (ఐసీ)ల నియామకపు చర్యలు ప్రారంభించారా? లేదా?.. స్పష్టమైన సమాచారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. తదుపరి విచారణ రోజున అడ్వొకేట్ జనరల్ లేదా అడిషనల్ అడ్వొకేట్ జనరల్ హాజరై వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దాఖలు చేసిన అఫిడవిట్ అస్పష్టంగా ఉందని చెప్పింది. సీఐసీ, ఐసీ నియామక ఫైల్ అత్యున్నత వర్గాల పరిశీలనలో ఉందనడం అసమగ్రంగా ఉందని అభిప్రాయపడింది. కొన్ని నెలలుగా సీఐసీ, ఐసీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ప్రభుత్వం నియామకం చేపట్టడం లేదంటూ హైకోర్టులో ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేసింది. ప్రజల దరఖాస్తులు పేరుకుపోతున్నాయని, సమస్యలు పరిష్కారం కాక ఇబ్బంది పడుతున్నారని పిటిషన్‌లో పేర్కొంది. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం మరోసారి విచారణ చేపట్టింది. సమాచార కమిషన్‌లో పనిచేస్తున్న ఇతర సిబ్బంది సమస్యల పరిష్కారంలో పాల్గొంటున్నారని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు. అసలు ముఖ్యమైన ప్రధాన సమాచార కమిషనర్, సమాచార కమిషనర్లే లేనప్పుడు వ్యాజ్యాలపై ఎవరు ఉత్తర్వులు జారీ చేస్తున్నారని సీజే ప్రశ్నించారు. తదుపరి విచారణను జూలై 5కు వాయిదా వేశారు.

పారా మెడికల్ పరిధిలోకి ఫార్మసీ వృత్తి రాదు

ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: ఫార్మసీ వృత్తి పారా మెడికల్ కోర్సు పరిధిలోకి రాదని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(పీసీఐ) స్పష్టం చేసింది. ఈ విషయాన్ని తెలంగాణ ఫార్మా సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు ఆకుల సంజయ్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఫార్మసీ స్వతంత్ర వృత్తి అని స్పష్టం చేశారు. దేశంలో ఫార్మసీ వృత్తిని పీసీఐ నియంత్రిస్తుందని తెలిపారు. ఆరోగ్య కుటుంబ మంత్రిత్వ శాఖ కింద పీసీఐ ఒక చట్టబద్ధమైన సంస్థగా పనిచేస్తుందన్నారు. ఫార్మసిస్ట్‌గా నమోదు చేసుకోవడానికి.. పీసీఐ ఫార్మసీ విద్యను నియంత్రిస్తుందని తెలిపారు. ఈనేపథ్యంలో ఫార్మసీ విద్యను పారా–మెడికల్ విద్యతో అనుసంధానం చేయకూడదని ఆయన స్పష్టం చేశారు.

ఏఎంవీఐ అభ్యర్థుల హాల్‌టికెట్లు సిద్ధం

సాక్షి, హైదరాబాద్: రవాణా శాఖలో అసిస్టెంట్ మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ) ఉద్యోగాల భర్తీ అర్హత పరీక్ష ఈనెల 28న సీబీటీ పద్ధతిలో ఉదయం, మధ్యాహ్నం 2 సెషన్లలో జరగనుంది. హాల్‌టిక్కెట్లు కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు వెంటనే హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, చివరి నిమిషంలో ఇబ్బంది పడొద్దని కార్యదర్శి సూచించారు.



జీవితంలో నిజమైన వైఫల్యం ఏమిటంటే, తనకు బాగా తెలిసినదానికి సత్యంగా ఉండకపోవడం మాత్రమే.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, 21 జూన్ 2023

ఆశలు మోసులెత్తుతున్న వేళ..

భారత ప్రధాని మోదీ మంగళవారం 3 రోజుల అధికారిక పర్యటనకు అమెరికా పయనమవడంతో ఒక చరిత్రాత్మక ఘటనకు తెర లేచింది. ఇది భారత, అమెరికాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను సమూలంగా మార్చివేసే ఘట్టమని విశ్లేషణ. అమెరికాలో వ్యక్తమవుతున్న ఆసక్తి, జరుగుతున్న హంగామా, అధికారిక విందు, చివరకు అమెరికన్ పార్లమెంట్‌లో మోదీ ప్రసంగం – ఇలా పర్యటన అంశాల్ని గమనిస్తే ఆతిథ్యదేశం దీన్ని ఎంతో ప్రత్యేకంగా భావిస్తున్నట్టు అర్థమవుతోంది. ఈ పర్యటనలో రక్షణ, స్వచ్ఛ ఇంధనం, అంతరిక్షం సహా పలు రంగాల్లో భాగస్వామ్యాలపై చర్చలు జరగనున్నాయి. సెప్టెంబర్‌లో జీ20 సదస్సుకు భారత్ ఆతిథ్యమివ్వనున్నందున ఇది ప్రాముఖ్యం సంతరించుకుంది.

నిజానికి, 2014 మేలో తొలిసారి ప్రధానిగా పగ్గాలు చేపట్టిన నాటి నుంచి గడచిన తొమ్మిదేళ్ళలో మోదీ అనేకసార్లు అమెరికాలో విస్తృతంగా పర్యటించారు. అయితే, ఇప్పుడు స్నేహపూర్వక ద్వైపాక్షిక సంబంధానికి ఉన్నతస్థాయి వ్యక్తీకరణగా భావించే 'స్టేట్ విజిట్'గా ఈ పర్యటన సాగుతోంది. ఇలా వెళ్ళడం మోదీకీ ఇదే మొదటిసారి. ఒక దేశ ప్రభుత్వాధినేత ఆహ్వానం మేరకు మరో దేశ ప్రభుత్వాధినేత సాగించే ఈ సాదర ఆహ్వానయుత పర్యటనకు సహజంగానే సాధారణ అధికారిక పర్యటనకు మించిన హంగూ, ఆర్భాటం ఉంటాయి. అమెరికా అధ్యక్ష దంపతులు స్వయంగా వైట్‌హౌస్‌లో కళ్ళు మిరుమిట్లుగొలిపే అధికారిక విందుకు ఆతిథ్యమిస్తారు. గతంలో రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ (1963 జూన్), ప్రధాని మన్మోహన్ (2009 నవంబర్)ల తర్వాత ఈ తరహా పర్యటనకు సాదర ఆహ్వానం అందుకున్న మూడో భారత నేత – మోదీయే. అత్యంత సన్నిహితులకూ, మిత్రపక్షాలకే అందించే ఈ ఆహ్వానం భారత, అమెరికాల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యానికి ప్రతీక.

ప్రపంచ దృశ్యం సంక్లిష్టమవుతున్న వేళ అమెరికా – భారత సంబంధాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. చైనా అనుసరిస్తున్న ఇండో – పసిఫిక్ వ్యూహం, ఆధునిక రక్షణ పరిజ్ఞానం పంచుకోవడం, జీఈ–414 టర్బోఫ్యాన్ జెట్ ఇంజన్ల ఉత్పత్తి లాంటివి ఇరు దేశాల చర్చల అజెండాలో ఉన్నాయి. వ్యూహాత్మక సాంకేతిక విజ్ఞాన భాగస్వామ్యం అటుంచితే, రెండుచోట్లా రాజకీయం వేడెక్కివున్న పరిస్థితులివి. రానున్న ఎన్నికల్లో మళ్ళీ అధికారం చేపట్టేందుకు ఇరువురు నేతలూ సిద్ధమవుతున్న వేళ ఈ పర్యటన ద్వారా వారు ఏ మేరకు ఇమేజ్ పెంచుకొని, సమర్థ నేతగా కనిపిస్తారన్నదీ కీలకమే. స్టేట్ విజిట్లలో అసలే హడావిడి ఎక్కువనుకుంటే, ఎన్నికల సీజన్ ఈ హంగామాను మరింత పెంచేస్తోంది. ప్రవాసీయులు అధికంగా ఉండడం మోదీ పర్యటనకు ఎక్కడ లేని ఈ ఆర్భాటానికొక కారణం కావచ్చు. జనంలో స్వచ్ఛంద స్పందన వస్తే తప్పు లేదు. ముందస్తు వ్యూహంతో, పద్ధతిగా ప్రతిచోటా జాతర సృష్టించడమే అతి అనిపిస్తోంది. రకరకాల సభలతో 'ప్రవాసీ దౌత్యం'లో మోదీ సిద్ధహస్తుడు గనకనే అనుమానించాల్సి వస్తోందని విమర్శకుల మాట.

అమెరికా పర్యటనలో పలువురు వ్యాపారవేత్తలు, నోబెల్ బహుమతి గ్రహీతలు, ఆర్థికవేత్తలను మోదీ కలవనున్నారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, శాస్త్రీయ అంశాలను ప్రాచుర్యంలోకి తెచ్చిన నీల్ డిగ్రాస్ టైసన్, రాజకీయ శాస్త్రజ్ఞుడు జెఫ్ స్మిత్ తదితరులు సైతం ఆ జాబితాలో ఉండడం విశేషం. గతంలో నెహ్రూ, రాజీవ్, పీవీ నరసింహారావు, వాజ్‌పేయి, మన్మోహన్‌ల అడుగుజాడల్లో అమెరికన్ పార్లమెంట్ ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. ఆ వరుసలో ఆరో భారత ప్రధానైన మోదీకి ఈ ప్రసంగ ఘనత దక్కడం ఇది రెండోసారి. 1949లో ప్రపంచ శాంతి, మానవ స్వాతంత్ర్య విస్తరణల పరిరక్షణే భారత విదేశాంగ విధాన దృష్టి అన్న నెహ్రూ నాటికీ, 2005లో కీలక సాంకేతిక విజ్ఞానాల అడ్డగోలు వ్యాప్తికి భారత్ కేంద్రస్థానం కాదన్న మన్మోహన్ నాటికీ... ఇప్పటికీ తేడా చూస్తే అగ్రరాజ్యంతో ఢిల్లీ బాంధవ్యం సుదూరం సాగింది. ఇండో–పసిఫిక్‌లో, అలాగే విశాల విశ్వవేదికపై భారత ప్రభావశీల పాత్రను అమెరికా గుర్తించింది.

ఉక్రెయిన్ సంక్షోభం నేపథ్యంలో ఆయుధ సరఫరా వ్యవస్థలు సంక్షోభంలో పడడంతో రక్షణ రంగంలో ఆత్మనిర్భరత కీలకమని భారత్ గుర్తించింది. అందుకు పాశ్చాత్య ప్రపంచం నుంచి సాంకేతికత అవసరం. ఇప్పుడు అమెరికా ముందుకొచ్చింది గనక మిగతా దేశాలూ ఆ బాటలో నడ వచ్చు. మరోపక్క ఉక్రెయిన్ వ్యవహారంలో రష్యాపై దూకుడుగా వ్యవహరించడం లేదంటూ భారత్ పట్ల అసహనంగా ఉన్న పాశ్చాత్య ప్రపంచం చమురు తదితర అంశాల్లో మన అనివార్యతల్ని అర్థం చేసుకొన్నాయి. కొన్ని అంశాల్లో పరస్పర ఏకాభిప్రాయం లేకున్నా, పరిణతితో కూడిన ఆ అవగాహన సాక్షిగా భారత్, అమెరికాలు పరస్పర గౌరవం, ఉమ్మడి లక్ష్యాలతో నవశకంలోకి నడుస్తున్నాయి.

ప్రచ్ఛన్న యుద్ధం నాటి అలీన విధానం నుంచి భారత్ పక్కకు రాకున్నా, ప్రస్తుత ప్రపంచ అధికార క్రమంలో మార్పులను బట్టి పరస్పర విరుద్ధ వర్గాల్లోని దేశాలతో సైతం దోస్తీకి వెనుకాడదనే సంకేతాలిస్తోంది. అలాగే, 'అబ్‌కీ బార్... ట్రంప్ సర్కార్' అంటూ భారీ సభ సాక్షిగా ట్రంప్‌ను మోదీ సమర్థించారు. చివరకు ఆయన ఓడి బైడెన్ వచ్చినా బంధం బలపడిందే తప్ప మార్పు లేదు. ప్రపంచంలోని అతి ప్రాచీన ప్రజాస్వామ్యం, అతి పెద్ద ప్రజాస్వామ్యం – రెండూ సమైక్యంగా ప్రపంచం ముందున్న సవాళ్ళను ఎదుర్కొనేందుకు సిద్ధమయ్యాయి. ఇది సుసంపన్న, సురక్షిత భవితవ్యానికి బాటలు వేస్తుందని ఆశ. ప్రపంచ వేదికపై భారత్‌కు సమున్నత, కీలక పాత్ర ఉందని పాలకులు ప్రకటిస్తున్న వేళ ద్వైపాక్షిక బంధంలో ఇది కొత్త అధ్యాయం.

అర్ధ వార్షిక పరీక్షలో భేష్!

విశ్లేషణ



రాజీవ్ భాటియా

జీ20 అధ్యక్ష స్థానాన్ని భారతదేశం చేపట్టి మే 31తో సరిగ్గా ఆరు నెలలు అయ్యింది. ఉక్రెయిన్ ఘర్షణ వల్ల సభ్యదేశాలు స్పష్టంగా చీలిపోవడంతో అధ్యక్ష బాధ్యత మరింత క్లిష్టంగా మారింది. ఈ నేపథ్యంలోనూ భారత్ చక్కగా పనిచేసిందనే చెప్పాలి. అంతర్జాతీయ రంగంలో బాధ్యతాయుతమైన కీలక భాగస్వామిగా, ప్రస్తుత సవాళ్లను గుర్తించి స్పష్టంగా ప్రకటించడమే కాకుండా పరిష్కారాలను రూపొందించడంలో కూడా నాయకత్వం వహించింది. దీనిగురించే జీ20 యంత్రాంగం ఇంతవరకూ 120 సమావేశాలు నిర్వహించింది. అసలు సవాల్ ఏమిటంటే, సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సదస్సులో విభిన్నమైన పాత్రధారులతో ఘర్షణ పడటమే. అలాంటప్పుడు 'ఢిల్లీ డిక్లరేషన్'పై ఒక ఏకాభిప్రాయ రూపకల్పన చేయగలరా?

సంవత్సరం పాటు కొనసాగే భారత్ జీ20 (గ్రూప్ ఆఫ్ 20) అధ్యక్ష పదవి మే 31తో దాని మధ్య బిందువును దాటేసింది. అంటే దాని పదవీ కాలంలో ఆరు నెలలు గడిచిపోయాయి. సెప్టెంబర్ 9, 10 తేదీలలో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సదస్సుపై దృష్టి సారించడంతో తదుపరి సగం కాలం ఇప్పుడు ఆవిష్కృతమవుతుంది. జీ20 అధ్యక్షత గత పనితీరు, దాని అవకాశాలపై భావోద్వేగ రహితంగా మూల్యాంకనం చేసుకోవడానికి ఇదే సరైన తరుణం.

భారత్ జీ20 అధ్యక్ష స్థానం... కోవిడ్ మహమ్మారి, ఆర్థిక మందగమనం, పదునెక్కుతున్న భౌగోళిక, రాజకీయ పోటీ ప్రభావాన్ని అధిగమించలేకపోయింది. జీ20 దుర్బలత్వాన్ని బహిర్గతపర్చేలా, ఉక్రెయిన్ ఘర్షణ ద్వారా ప్రేరేపితమైన ధ్రువీకరణ కూడా దీనికి తోడయింది. తీవ్రమైన సవాళ్లతో పోరాడుతున్న సమయంలో ఈ గ్రూప్ చీలిపోయింది. అందుకే, జీ20 అధ్యక్ష బాధ్యత ఇప్పుడు మరింత క్లిష్టంగా మారింది.

ఈ నేపథ్యంలో గ్రూపు కీలక లక్ష్యాలను పరిరక్షించుకోడానికి జీ20 అధ్యక్ష స్థానాన్ని సమతుల్యం చేయడంలో భారత్ చక్కగా పనిచేసిందనే చెప్పాలి. మొదటగా, అంతర్జాతీయ రంగంలో బాధ్యతాయుతమైన కీలక భాగస్వామిగా, భారతదేశం ప్రస్తుత సవాళ్లను గుర్తించి స్పష్టంగా ప్రకటించడమే కాకుండా పరిష్కారాలను రూపొందించడంలో కూడా నాయకత్వం వహించింది. దీనిగురించే జీ20 యంత్రాంగం ఇంతవరకూ 120 సమావేశాలు నిర్వహించింది. రాబోయే నెలలు మంత్రుల స్థాయిలో, చివరకు నాయకుల స్థాయిలో జరిగే చర్చలకు సాక్షీభూతంగా నిలుస్తాయి.

రెండవది, భారతదేశ ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని, దాని వైవిధ్యం, విజయాలను, ప్రజాస్వామ్య నమూనాతో సాధించిన అభివృద్ధి, రాజకీయ సుస్థిరత ఫలాలను, బలమైన నాయకత్వాన్ని, సమీకృత ఆర్థిక పురోగతిని ప్రదర్శించడమే లక్ష్యం. పర్యాటక రంగాన్ని, వాణిజ్యాన్ని, టెక్నాలజీని, ప్రపంచంతో పెట్టుబడి ఆధార సంబంధాలను బలోపేతం చేసుకోవడంలో భారత్‌కు ఇది ఉపకరిస్తుందన్న అంచనా దీని వెనుక ఉంది.

మూడవది, ప్రపంచరంగంలో న్యూఢిల్లీ నాయకత్వ పాత్రను నొక్కి చెప్పడానికి మరింత సంక్లిష్టమైన ప్రేరణ ఉంది. పశ్చిమ దేశాలతో వ్యవహరించడంలో (తేడాలు ఉన్నప్పటికీ) భారత్ సౌకర్యవంతమైన దేశంగా ఉంటుందనీ, రష్యాతో, చివరకు చైనాతో కూడా (విభేదాలు కొనసాగుతున్నప్పటికీ) పొత్తులు నిర్వహిస్తుందనీ, ప్రపంచ దక్షిణ దేశాలకు సలహాదారుగా పనిచేస్తుందనీ ఇది చూపుతుంది. ఈ కత్తి మీద సాము చేయడానికి తెలివైన దౌత్యం, చురుకుదనం, సృజనాత్మకతతో పాటు కాస్త అదృష్టానికి చెందిన సమ్మేళనం కూడా అవసరం.



ప్రభుత్వ, ప్రభుత్వేతర స్థాయిల్లో జరిగిన చర్చలతో సహా జీ20 సంబంధిత పరిణామాలకు భారత మీడియా విస్తృతంగా ప్రచారం కల్పించింది. ఈ క్రమంలో ప్రజలకు దీనిగురించి చక్కటి అవగాహన కలిగేలా చేసింది.

అయితే అసలు సవాల్ ఏమిటంటే, సెప్టెంబర్‌లో ఢిల్లీలో జరగనున్న శిఖరాగ్ర సదస్సులో విభిన్నమైన పాత్రధారులతో ఘర్షణ పడటమే. ఈ ఢిల్లీ సదస్సు ఫలితాలను న్యాయబద్ధంగా అంచనా వేయడానికి ఏకాభిప్రాయం, జోడింపు, ఆచరణ అనే త్రిముఖ కోణాలను ఉపయోగించడం మంచిది.

మొదటగా, భారతీయ అతిథేయులు ఢిల్లీ శిఖరాగ్ర సదస్సు ముగింపులో 'ఢిల్లీ డిక్లరేషన్'పై ఒక ఏకాభిప్రాయ రూపకల్పన చేయగలరా? లేదా మార్చి నెలలో 20 మంది విదేశాంగ మంత్రుల సమావేశంలో, ఉక్రెయిన్ సమస్యకు చెందిన పేరాలతో మిగిలిన 18 మంది సభ్యులతో కలిసి వెళ్లడానికి రష్యా, చైనాలు తిరస్కరించిన విధంగానే దీని ఫలితం ఉంటుందా? పైగా, ఢిల్లీలో జీ20 దేశాల నాయకులందరూ కనబడటంపై కూడా అనిశ్చితి నెలకొంది. నాయకులు భౌతికంగా హాజరు కాలేకపోవడంతో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్(ఎస్సీఓ) ఢిల్లీలో సదస్సు నిర్వహణకు అశక్తత వ్యక్తం చేయడం దీన్ని మరింత పెంచింది.

రెండు, జోడింపు అనేది ఢిల్లీ డిక్లరేషన్ ప్రతిపాదించే విషయాలను సూచిస్తుంది. మునుపటి సదస్సుకు సంబంధించిన 'బాలి డిక్లరేషన్'తో పోల్చినప్పుడు, ఢిల్లీ సదస్సులో ప్రత్యేకించి ప్రపంచ పరిష్కారాలకు సంబంధించిన విషయాలు మరింత దృఢంగా, కొత్తగా ఉంటాయా? చివరగా, ప్రధాన ఒప్పందాల ఆచరణకు సంబంధించి: ఏకాభిప్రాయ ప్రాతిపదికన మాత్రమే నిర్ణయాలను అమలు చేయడానికి రాజకీయ సంకల్పంతో కూడిన ఆచరణ జీ20ని ఒక సమర్థమైన నిర్దేశక కార్యాలయంగా చూపిస్తుందా లేక చర్చల దుకాణంగా మాత్రమే చూపుతుందా?

బహువిధ ఆర్థిక వ్యవస్థల్లో సంస్కరణల కోసం నినాదాలు ఇస్తున్నట్టుగా, జీ20 తనను తాను కూడా సంస్కరించుకోగల సమర్థురాలనే సూచన ఢిల్లీ సదస్సులో వెలువడవచ్చు. అలా అయితే తమ కొత్త సభ్యురాలిగా ఆఫ్రికన్ యూనియన్ (ఏయూ)ను చేర్చుకోవడంలో కొంచెం కూడా సందేహం ఉండకూడదు. అలాగే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి విస్తరణ, ప్రజాస్వామికీకరణను వేగవంతం చేయడం కోసం పిలుపునిస్తుందా అన్నది కూడా ప్రత్యేక శ్రద్ధతో గమనించాల్సి ఉంది.

చర్చల్లో పురోగతిని నమోదు చేయడానికి జీ20 అధ్యక్ష పదవి ప్రాధాన్యతలలో రెండు అంశాలు తప్పనిసరి. అవి వాతావరణం, శక్తి పరివర్తిత ఆర్థికం. వీటికి సంబంధించి జీ20 నిబద్ధత నిర్దిష్టంగా ఉండవచ్చు. దీనికి మరిన్ని జోడింపులు చేర్చవచ్చు. ప్రపంచంలో భారతీయ డిజిటల్ పబ్లిక్ గూడ్స్ (డీపీజీ) ప్రాసంగికతను నొక్కి చెప్పడంలో, భారత ప్రభుత్వం అసాధారణ క్రియాశీలతను ప్రదర్శించింది. కాబట్టి ఢిల్లీ సదస్సు తుది ప్రకటనలో ఒక బలమైన సూత్రీకరణ ఖాయంగా కనిపిస్తోంది. అయితే ఈ పరిధిలో సహకారం పొందడం కోసం బంగ్లాదేశ్, ఈజిప్ట్, మారిషస్ వంటి ఎనిమిది అధ్యక్ష అతిథి దేశాలతో ద్వైపాక్షిక చర్చల దిశగా అధికారులు పని చేస్తే బాగుంటుంది.

ప్రజాస్వామ్య స్ఫూర్తితో, విమర్శకుల అభిప్రాయాలను, భిన్నాభిప్రాయాలను గమనించాలి. ఒక మాజీ సీనియర్ అధికారి ఇటీవల ప్రపంచం అంతర్జాతీయ ఘర్షణకు 'ప్రమాదకరంగా దగ్గరవుతోంది'ని పేర్కొంటూ– జీ20, 'ఎస్సీఓ' శిఖరాగ్ర సదస్సుల నుంచి గరిష్ఠ ప్రయోజనాలు పొందాలన్న ఆశలను తగ్గించుకుంటే మంచిదని సలహా ఇచ్చారు. ప్రజాస్వామ్యం, వైవిధ్యం గురించిన అధికారిక సిద్ధాంతం దేశీయ రాజకీయాలకు అనుగుణంగా లేదని వాదిస్తూ ఒక సీనియర్ ప్రతిపక్ష నాయకుడు 'జీ20 కపటత్వం' గురించి మాట్లాడారు. ఇకపోతే మూడో విమర్శకుడు జీ20 పౌర సమాజ వేదిక హైజాక్ కావడం గురించి రాశారు. కొంతమంది విదేశీ పరిశీలకులు 'థింక్20' ప్రక్రియ గురించి ఫిర్యాదు చేశారు.

భారతదేశ జీ20 అధ్యక్షతకు సంబంధించి బహుముఖ ప్రయాణ క్రమంలో కొన్ని చికాకులు సమానంగా ఉంటాయి. వస్తుగతంగా చెప్పాలంటే, జీ20 అధ్యక్ష పదవీకాలంలో భారత్ ఇప్పటివరకూ బాగా పనిచేసింది. ప్రత్యేకించి ప్రపంచంలో భారత్ పాత్ర గురించి విశ్వవ్యాప్తంగా అపూర్వ సందడిని సృష్టించింది. శ్రద్ధ, దౌత్య చతురత, రాజకీయ దృష్టి, కాస్త అదృష్టంతో ఈ బిడారు విజయవంతంగా తన గమ్యాన్ని చేరుకోవాలి. భారతదేశానికీ, జీ20కీ గొప్ప కీర్తిని తెచ్చిపెట్టాలి.

వ్యాసకర్త మాజీ రాయబారి; డిస్టింగ్విష్డ్ ఫెలో, గేట్‌వే హౌజ్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కపట వాదం



కాంగ్రెస్ తొత్తులు ఎలాంటి కపటులంటే: ఏ రోడ్డు, ఫ్లైఓవర్, నిర్మాణానికో సావర్కర్ పేరు పెడితే వాళ్లు కన్నడిగుడి పేరు పెట్టాలని డిమాండ్ చేస్తారు. కానీ అదే కన్నడిగులు ఈ నెహ్రూ–గాంధీ– ఇందిరా పేర్ల ముఖస్తుతి పట్టింపును ప్రశ్నిస్తే 'పేరుకు అంత ప్రాధాన్యత ఏముంది?' అంటారు.

– చేతన్ కుమార్ అహింస, నటుడు

నది అందరిది!



గంగానదిలోకి శవాలను విసిరేస్తే ఫర్లేదా? మురుగు నీటిని అందులోకి వదిలితే ఫర్లేదా? జలవనరుల్లో అత్యంత మురికికూపాల్లో ఒకటిగా మిగిలిపోతే ఫర్లేదా? కానీ ఒక ముస్లిం మాత్రం అందులోకి దిగకూడదా? అదీ మంచిదే మోలే... ఏదైనా జబ్బుపడితే?

– పూనమ్, వ్యాఖ్యాత

రోడ్డెక్కడం దేనికి?



చట్టం అంటే చట్టమే. ప్రతి ఒక్కరూ తాము పనిచేస్తున్న, దర్శిస్తున్న దేశాల చట్టాలనూ, నియమ నిబంధనలనూ పాటించాలి. యూఏఈలో పదివేల కంటే ఎక్కువ అధికారిక మసీదులున్నాయి, గ్యాస్ స్టేషన్లు, హైవేల్లో ఉన్నవి సహా. రోడ్డు పక్కన ప్రార్థించే అవసరమే లేదు. (రోడ్డుపక్కన ప్రార్థిస్తే యూఏఈలో 1000 దిర్హామ్‌ల జరిమానా కథనానికి స్పందనగా.)

– ఒమర్ అలీ ఘమడీ, సౌదీ వ్యాఖ్యాత

చిరు కానుక



ఐఐటీ బాంబేతో నాకున్న 50 ఏళ్ల అనుబంధానికి గుర్తుగా, నా విద్యాసంస్థకు 315 కోట్ల రూపాయలు విరాళంగా ఇస్తున్నాను. ఇది చేయగలుగుతున్నందుకు కృతజ్ఞుడిని.

– నందన్ నీలేకని, పారిశ్రామికవేత్త

మన గౌరవం



భారత ప్రధానమంత్రికి అమెరికా ప్రభుత్వం (ఇవ్వనున్న) ఘన స్వాగతం పట్ల సంతోషంగా ఉన్నాను. ఇది ఇండియాకు సంబంధించినది, వ్యక్తులు ముఖ్యం కాదు.

– హేపీమాన్ జాకబ్, ప్రొఫెసర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్‌బాక్స్

మన అపురూప సంజీవని

ఈ ప్రపంచంలో మనిషి మనుగడకు, అతడు చేసే పనులకు శరీరమే ఆధారభూతం. అందుకనే దానిని జాగ్రత్తగా, ఆరోగ్యంగా కాపాడుకొనే బాధ్యతను ఎవరికి వారే గుర్తెరగాలి. భారతీయ సంప్రదాయ జీవనంలో ఒకప్పుడు యోగాసనాలు భాగంగా ఉండేవి. ఇవి మన పూర్వుల శారీరక, మానసిక ఆరోగ్యాలను కాపాడుతూ ఉండేవి. రాజ్యాలు, యుగాలు మారడంతో మన యోగా ప్రాముఖ్యాన్ని మరచిపోయి కాలంతోపాటు పరుగిడుతూ జీవితాన్ని యాంత్రికత్వంతో నింపేసుకుంటున్నాం. ఇవ్వాళ ఒత్తిడి ప్రతి ఒక్కరి జీవితాన్నీ వేధిస్తోంది. ఫలితంగా అనేక శారీరక, మానసిక రుగ్మతలతో జీవితం నరకప్రాయమైపోతున్నది. ఈ స్థితి నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉండటానికి యోగాసనాలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఇటీవలి కాలంలో యోగా ప్రాముఖ్యాన్ని భారతీయులతో పాటూ ప్రపంచ ప్రజలందరూ గుర్తించారు. ఇందుకు జూన్ 21 తేదీన 'అంతర్జాతీయ యోగా దినోత్సవం'గా జరుపుకోవడమే నిదర్శనం.



నరేంద్ర మోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత నుంచి యోగా విద్యకు అధిక ప్రాధాన్యత ఇచ్చారనే చెప్పాలి. అందుచేతనే గడచిన 8 ఏళ్లలో యోగా ప్రాచుర్యం పొందుతోంది. కోవిడ్–19 తరువాత అనేక మంది యోగ సాధనపై మక్కువ కనబరుస్తున్నారు. సీజనల్‌గా సంభవించే వ్యాధులతోపాటు అనేక దీర్ఘకాలిక వ్యాధులను కూడా నయం చేసే శక్తి యోగ సాధనకు ఉంది. పిల్లల నుంచి పెద్దల వరకు... స్త్రీ, పురుష భేదం లేకుండా అందరూ చక్కని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికీ, ఆయుష్షును పెంచుకోవడానికీ యోగా తిరుగులేని సాధనం అని చెప్పాలి. రోగ నిరోధకశక్తిని పెంచుకోవడానికీ, వ్యాధులను జయించడానికీ ఉన్న చక్కని అవకాశం యోగాసనాలు వేయడం.

కేవలం రోజుకు గంట లేదా గంటన్నర సేపు యోగాసనాలు, ధ్యానం వంటి వాటికి సమయం కేటాయిస్తే... అజీర్తి, ఊబకాయం, జలుబు, తలనొప్పి, కీళ్ల నొప్పులు, నిద్రలేమి, షుగర్, బీపీ, కండరాల బలహీనత వంటి వాటికి దూరం కావచ్చు. మనసు ప్రశాంతతను సంతరించుకుంటుంది. పిల్లల్లో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెంచేందుకు యోగా శిక్షణ ఇవ్వాలి. ఇందుకుగాను ప్రతి పాఠశాలలో కనీసం ఒక గంట యోగా శిక్షణ పొందేలా విద్యాశాఖ నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పలువురు తల్లిదండ్రులు భావిస్తున్నారు. అనేక రుగ్మతలకు సంజీవనిగా పనిచేసే యోగాను ప్రోత్సహిద్దాం. ఆచరిద్దాం. ఆరోగ్యంగా ఉందాం.

– దవరసింగి రాంబాబు, యోగా టీచర్
(నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం)

తొమ్మిదేళ్లుగా దేశం దూసుకుపోతోంది!


అభిప్రాయం



పురిఘళ్ల రఘురాం

ప్రస్తుతాన్ని దృష్టిలో పెట్టుకొని పనిచేయడం కాదు... కనీసం వచ్చే వందేళ్ల అవసరాలను గమనంలో ఉంచుకొని పని చేయడమే అసలైన ప్రజా ప్రభుత్వాల విధి. ఈ పనిని నరేంద్ర మోదీ ప్రభుత్వం చక్కగా నిర్వహిస్తోంది. మోదీ తొమ్మిదేళ్ల పాలనలో యువశక్తి, సాంకేతికతలను వినియోగిస్తూ ప్రపంచ ఆర్థిక రంగంలో దేశాన్ని మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిపారు. అవిశ్రాంతంగా, అవినీతి రహితంగా పరిపాలన అందిస్తూ మూడోసారి విజయాన్ని సాధించాలని మోదీ తలపోస్తున్నారు. అందరికీ తాగునీరును 'జల్‌జీవన్ మిషన్' కింద అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి పేదలకు గూడు కల్పించాలని నిర్ణయించారు. మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి 'స్వచ్ఛ భారత్'ను సాకారం చేయాలని తపిస్తున్నారు. ప్రజలకు ప్రత్యక్ష నగదు బదిలీ (డీబీటీ) ద్వారా, వివిధ ప్రభుత్వ ప్రాయోజిత పథకాల ఫలితాలను నేరుగా వారి ఖాతాలోనే చేరేలా ఏర్పాటు చేశారు. గ్రామీణ రైతులకు ఎరువులను సబ్సిడీతో అందిస్తున్నారు. 'పీఎం కిసాన్ యోజన' ద్వారా ఏటా ఆరువేల రూపాయల పెట్టుబడి సాయాన్ని అందిస్తూ రైతులకు దన్నుగా నిలిచారు. రైతులు ఆరుగాలం పండించిన పంటను దేశంలో ఎక్కడైనా సరే అమ్మే అవకాశాన్ని కల్పించే నూతన విధానాన్ని ఆరంభించి, వారి ఆదాయాన్ని మరింతగా పెంచారు.

దళిత యువతకు 70 శాతం పైగా సబ్సిడీ కింద పెట్టుబడి సాయం అందిస్తూ పారిశ్రామిక రంగంలో ప్రోత్సాహకాలను మునుపెన్నడూ లేని విధంగా మోదీ సర్కారు అందిస్తోంది. 2014లో కేవలం 400 ఉన్న స్టార్టప్‌లు 2022 నాటికి 85 వేలకి చేరాయి. ఒక దశాబ్దం కంటే తక్కువ కాలంలోనే చైనా, యూఎస్‌ల తర్వాత ప్రపంచంలో భారత్ స్టార్టప్‌ల పరంగా మూడో స్థానాన్ని ఆక్రమించింది. రక్షణ రంగంలోనూ 'మేకిన్ ఇండియా' లాభసాటిగా దూసుకెళ్తోంది. ఎమ్ఎస్ఎమ్ఈలకు ప్రోత్సాహకాలు అందిస్తూ భారతీయ ఉత్పత్తులను పెంచేందుకు మోదీ సర్కారు చర్యలు చేపట్టింది. నూతన విద్యా విధానాన్ని దేశంలో అమలుకు తెరలేపింది. హెల్త్ మిషన్ ద్వారా



'ఆయుష్మాన్ భారత్' తీసుకొచ్చి... పేదలకు 5 లక్షల రూపాయల విలువైన వైద్య ఖర్చులను ఉచితంగా అందిస్తోంది. జనరిక్ మందుల షాపులను ఏర్పాటు చేసి పౌరులకు అందుబాటు ధరలో మందులు ఉంచుతోంది.

ఉపాధి హామీ పథకంలో వేతనాలను పెంచి బడుగులకు బతుకు భరోసా ఇచ్చింది. కేవలం వేతనాలు పెంచడమే కాదు, లక్షలాది మంది కూలీలకు ఉపయుక్తమైన 'పని దినాలను పెంచే' నిర్ణయం తీసుకొంది. దేశంలో 150కి పైగా ఎయిర్ పోర్టుల అభివృద్ధి చేపట్టింది. సామాన్యులకు విమాన ప్రయాణ సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చింది. రైల్వే స్టేషన్‌లను ఆధునికీకరిస్తోంది. కొత్తగా రైల్వే లైన్లు నిర్మిస్తోంది. 'వందే భారత్' రైళ్లను ప్రవేశపెట్టి, వేగవంతమైన, సుఖవంతమైన ప్రయాణాన్ని అందుబాటులోకి తెచ్చింది. హైవేల విస్తరణ దేశంలో మునుపెన్నడూ లేని విధంగా శరవేగంగా సాగుతోంది. నాలుగు, ఆరు లేన్‌ల జాతీయ రహదారులను పూర్తిచేసి బైపాస్‌ల నిర్మాణం ద్వారా సులభ ప్రయాణాన్ని అందించింది.

కరోనా సమయంలో ఉచిత టీకాలందించి దేశానికి ఆరోగ్య భద్రత కల్పించారు మోదీ. ప్రపంచంలో ఇంత మందికి వ్యాక్సీన్ వేయగలమని రుజువు చేసి, చాలా దేశాలకు ఇండియా నుంచి వ్యాక్సీన్ ఎగుమతయ్యేలా సైతం చొరవ చూపించారు. ఉచిత రేషన్ ద్వారా సామాన్య ప్రజల ఆకలి తీర్చారు. సంక్షోభ సమయంలో ఒక ప్రభుత్వం ఏం చేయాలో అన్ని రకాల చర్యలూ చేపట్టి, సరిలేరు మీకెవ్వరు అనిపించుకొన్నారు మోదీ.

సోషల్ ఇంజినీరింగ్ ఫార్ములా ద్వారా పేదలకు, ప్రభుత్వం నుంచి మద్దతు అందించారు. రాజకీయంగా ఎన్నో సవాళ్లను అధిగమించి, రాచపుండులా ఉన్న ఎన్నో సమస్యలకు పరిష్కారాలు చూపించారు. అందులో జమ్ము–కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తి రద్దు ఒకటి. రామ మందిర నిర్మాణానికి సంబంధించిన అడ్డంకులను తొలగించారు. 'ట్రిపుల్ తలాక్' కారణంగా ముస్లిం మహిళలు పడుతున్న నరకయాతనకు చరమగీతం పాడారు. ప్రపంచానికి భారతదేశాన్ని ఒక శక్తిమంతమైన దేశంగా చూపించడంలో మోదీ నూటికి నూరుపాళ్ళు విజయం సాధించారు. ఇప్పుడు దేశంలోనే కాదు మోదీ ప్రభంజనం అనేక ప్రపంచ దేశాల్లోనూ కనిపిస్తోంది. 'ద బాస్ మోదీ' అంటూ అగ్రదేశాల అధినేతలు సైతం ఆయన పేరును జపిస్తున్నారు. ఇండియా విశ్వ గురువుగా అవతరించడానికి మోదీ బాటలు వేస్తున్నారు.

వ్యాసకర్త బీజేపీ నాయకులు

మాయా ప్రపంచం

జీవమూర్తి అనే ఒక నటుడున్నాడు. ఆయన హరిశ్చంద్ర నాటకంలో నటిస్తున్నంతసేపూ తను హరిశ్చంద్రుడు అయినట్టూ, చంద్రమతి తన భార్య అయినట్టూ, లోహితాస్యుడు తన కుమారుడే అయినట్టూ వ్యవహరిస్తాడు. నాటకంలో హరిశ్చంద్రుడు రాజ్యం పోగొట్టుకొంటే తనే రాజ్యం పోగొట్టుకొన్నట్టు అభినయిస్తాడు. హరిశ్చంద్రుడి పుత్రుడు మరణిస్తే, తన పుత్రుడే మరణించినట్టు పుట్టెడు దుఃఖం ప్రదర్శిస్తాడు. నటించేప్పుడు ఆయనకు తను హరిశ్చంద్రుడిని కాననీ, జీవమూర్తి అనే మనిషిననీ, తనకు ఉన్న రాజ్యాలూ, పోయే రాజ్యాలూ ఏవీ లేవనీ ధ్యాసే ఉండదు.

అందుకు కారణం ఆ నాటకం దర్శకుడు పరమేశ్వర రావు. ఆయన దర్శకత్వమొక ఇంద్రజాలమే! ఆయన సూత్రధారిత్వంలో నటులందరూ తమ పాత్రలలో లీనమై, పూర్తి 'తాదాత్మ్యత'తో నటిస్తారు. తన అద్భుత శక్తితో ఆయన ఆ నటులందరి మీదా ఒక గారడీ పన్నేస్తాడు. ఆ గారడీలో ఉన్నప్పుడు జీవమూర్తి తను నటుడినని మరిచిపోతాడు. హరిశ్చంద్రుడి కష్టాలన్నీ తనవిగా భావించి శోకిస్తాడు. 'ఊరుకోవయ్యా! నీకెందుకీ దుఃఖం, నువ్వేమన్నా హరిశ్చంద్రుడివా? ఇదంతా వట్టి తాత్కాలికమైన కల్లబొల్లి వ్యవహారం కదా?' అని ఎవరయినా చెప్పినా గ్రహించలేడు. 'నా భార్య అష్టకష్టాలు పడుతుంటే, నా కొడుకు చనిపోయి నేను ఇంత బాధపడుతుంటే, ఇదంతా నాటకమంటావా? నీకు బుద్ధీ, హృదయమూ – రెండూ లేవు. నువ్వు మూర్ఖుడివి. అంధుడివి. కళ్ళకు కనిపించేదాన్నే కల్ల అని మభ్య పెట్టే మోసగాడివి' అంటాడు. ఇది కూడా ఆ దర్శకుడి ఇంద్రజాల ఫలితమే.

జగన్నాటకాన్ని నడిపే సూత్రధారి, ఆ నాటకంలో నటించే మనలాంటి నటీనటులందరి మీద చేసే ఈ ఇంద్రజాలాన్ని 'మాయ' అని ప్రస్తావిస్తుంది గీత . '**ఇది దైవీ మాయ. దైవీ హి ఏషా గుణమయీ, మమ మాయా దురత్యయా.** ఇది లోకాతీతమైన నా దివ్యమాయ. సత్వరజస్తమో గుణాలన్న దినుసులతో ఏర్పడింది. ఇది చాలా బలవత్తరమైంది. **మాం ఏవ యే ప్రపద్యంతే, మాయాం ఏతాం తరన్తి తే.** నన్ను ఎవరయితే ఆశ్రయిస్తారో, వాళ్ళు ఈ మాయను అధిగమించ గలుగుతారు' అంటాడు గీతాచార్యుడు. మాయ ఏదో, సత్యమేదో చక్కగా చూడగలిగిన జ్ఞాని అన్ని దుఃఖాలకూ అతీతుడవుతాడు.

– ఎం. మారుతి శాస్త్రి

జ్యోతిర్మయం

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.తదియ ప.12.53 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** పుష్యమి రా.11.44 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** ఉ.6.07 నుండి 7.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.34 నుండి 12.26 వరకు, **అమృతఘడియలు:** సా.4.41నుండి 6.28 వరకు ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.30, **సూర్యాస్తమయం:** 6.33.

బీసీ విద్యార్థులకు పూర్తి ఫీజు చెల్లించాలి: జాజుల

సాక్షి, హైదరాబాద్: పోస్టుమెట్రిక్ కోర్సులు చదువుతున్న బీసీ విద్యార్థులకు పూర్తి స్థాయి ఫీజును ప్రభుత్వం చెల్లించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ T.S. లిమిటెడ్
ఆపరేషన్: సైబర్ సిటీ సర్కిల్
టెండరు ప్రకటన సం.04/23-24

దిగువ తెలిపిన పనుల కోసం అర్హత గల బిడ్డర్ల నుండి బిడ్లు కోరబడుచున్నవి. అవి 1) గచ్చిబౌలి డివిజన్‌లోని ఖాజాగూడ లింక్ రోడ్, గచ్చిబౌలి సెక్షన్‌కు కారిడార్ నం.26, ESCI వద్ద డిప్యూటీ కమిషనర్‌కు ఐఈ-VI క్రింద 1 నం.3-Ø 54KW స్ట్రీట్ లైట్ లోడ్‌కు LT సప్లయ్ పెంపుదల. 2) సైబర్ సిటీ సర్కిల్ కార్యాలయంలో హౌస్‌కీపింగ్ మరియు మెయింటెనెన్స్ ఏర్పాటు చేయుట. 3) కొండాపూర్ డివిజన్‌లోని కొండాపూర్ సెక్షన్‌లో 11 KV లైన్ వర్క్స్ ఇంటర్ లింకింగ్. తదుపరి వివరాల కోసం దర్శించండి: **www.tssouthernpower.com.gov.in**

సం/- SE/OP/ సైబర్‌సిటీ, రేతిబౌలి, నానల్‌నగర్ X రోడ్, హైదరాబాద్-28
DIPR RO No.3390-PP/CL/Advt/1/2023-24, Dt. 20.06.2023

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, మాసబ్‌ట్యాంక్, హైదరాబాద్.
R.C.No.2785/OSD/OPE/2023 **ప్రకటన** తేది: 20.06.2023

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్రవ్యాప్తంగా షెడ్యూల్ కులాల బాలబాలికలకు NEET-2024 కొరకు లాంగ్ టర్మ్ కోచింగ్‌ను TSWR COE గౌలిదొడ్డి, చిలుకూరు మరియు నార్సింగి యందు ఉచితంగా శిక్షణ ఇచ్చుటకు గాను నిర్ణయించడమైనది. సీట్ల వివరాలు: SC-290, BC-05, OC-05. ఆసక్తిగల విద్యార్థిని, విద్యార్థులు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత పొంది, NEET-2023 విధిగా రాసి యుండవలెను. ఆసక్తి గల బాల బాలికలు **www.tswreis.ac.in** వెబ్‌సైట్‌ను సంప్రదించి Rs. 200.00 చెల్లించి ఆన్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొనగలరు. దరఖాస్తు చేసుకొనుటకు ఆఖరి తేది: 30-06-2023 నోటిఫికేషన్ మరియు ఇతర వివరాలకు ఈ వెబ్ సైట్‌ను దర్శించగలరు. **https://www.tswreis.ac.in**

సం/- (డి.రోనాల్డ్ రోస్) కార్యదర్శి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ, హైదరాబాద్
DIPR RO No.3430-PP/CL/Advt/1/2023-24, Dt. 20.06.2023

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
స్వర్ణజయంతి కాంప్లెక్స్, అమీర్‌పేట్, హైదరాబాద్ - 500 038
ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ - బహిరంగ ప్రకటన
No.004692/BP/HMDA/0980/MED/2023

శ్రీ వరకాంతం ఆర్కేష్ గారు 3 బ్లాక్‌లతో గ్రూప్ హౌసింగ్ స్కీమ్‌లో మార్పులు/ చేర్పుల కోసం దరఖాస్తు దాఖలు చేశారని తెలియచేయడమైనది. గుండ్లపోచంపల్లి గ్రామం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మేడ్చల్ మండలం & మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సర్వే నం.691/1లోని 12557.27 చ.మీ. విస్తీర్ణంలో బ్లాక్ B (ఇంతకు ముందు G+3)లో 2 అదనపు అంతస్తులు, బ్లాక్ C (ఇంతకు ముందు G+1)లో 4 అదనపు అంతస్తులు మరియు బ్లాక్ E (ఇంతకు ముందు G+1)లో 4 అదనపు అంతస్తుల కోసం ప్రస్తుతం ప్రతిపాదిస్తున్నారు. అందువలన గుండ్లపోచంపల్లి గ్రామం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మేడ్చల్ మండలం, & మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సర్వే నం.691/1లోని 12557.27 చ.మీటర్ల విస్తీర్ణంలో బ్లాక్ B (ఇంతకు ముందు G+3)లో 2 అదనపు అంతస్తులు, బ్లాక్ C (ఇంతకు ముందు G+1)లో 4 అదనపు అంతస్తులు మరియు బ్లాక్ E (ఇంతకు ముందు G+1)లో 4 అదనపు అంతస్తుల ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న దానికి 3 బ్లాక్‌లతో గ్రూప్ హౌసింగ్ స్కీమ్‌లోని ఫ్లాట్ల యజమానులు/కొనుగోలుదార్లు / అగ్రిమెంట్ హోల్డర్లు అందరూ లిఖిత పూర్వకంగా మార్పులు మరియు కొత్త ప్లాన్లు చేర్పులకు సంబంధించి ఈ నోటీసు ప్రచురించబడిన తేదీ నుండి ఈ కార్యాలయానికి 15 రోజులలోగా వ్రాతపూర్వకంగా తమ అభ్యంతరాలు/ సూచనలు దాఖలు చేయవచ్చును. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు/ సూచనలు ఏవీ అందనట్లయితే, 3 బ్లాక్‌లతో గ్రూప్ హౌసింగ్ స్కీమ్‌లో మార్పులు/చేర్పుల ఆమోదం కోసం దరఖాస్తుదారుని అభ్యర్థనను సంబంధించి గుండ్ల పోచంపల్లి గ్రామం, గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ, మేడ్చల్ మండలం & మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని సర్వే నం. 691/1లో 12557.27 చదరపు మీటర్ల విస్తీర్ణంలో బ్లాక్ B (ఇంతకు ముందు G+3) పైన 2 అదనపు అంతస్తులు, బ్లాక్ C (ఇంతకు ముందు G+1) పైన 4 అదనపు అంతస్తులు, మరియు బ్లాక్ E (ఇంతకుముందు G+1) పైన 4 అదనపు అంతస్తుల కోసం ప్రస్తుతం ప్రతిపాదించిన దానికి సంబంధించి ఈ కార్యాలయంలో లభ్యమైన మెరిట్‌ల పైన ఆధారపడి పరిశీలించబడును.

సం/- మెట్రోపాలిటన్ కమిషనర్ తరఫున
DIPR RO No.3423-PP/CL/Advt/1/2023-24, Dt. 20.06.2023

The Andhra Pradesh Mineral Development Corporation Limited
APMDC
Door No. 294/1D, 100 feet Road, Kanuru, Vijayawada- 521137, Andhra Pradesh. Tel: + 91-866-2429999 Fax: +91-866-2429977
Email: contracts-ho@apmdc.in

NOTICE INVITING TENDER
E-TENDERS FOR SELECTION OF AGENCY FOR AUGMENTATION OF EXISTING MONITORING & AUTOMATION SYSTEM AT MANGAMPETA BARYTES MINE

Tender No.: APMDC/MANGAMPETA/MONITORING SYSTEM AUGMENTATION/2023-24 **Dt:21.06.2023**

APMDC Ltd. invites tenders from reputed agencies for augmentation of existing monitoring & automation system at Mangampeta Barytes Mine. For more information on the tender, eligibility criteria, tender fees. timelines, and other details, please visit the e-procurement portal of GoAP **(www.tender.apeprocurement.gov.in)** or APMDC website **www.apmdc.ap.gov.in.** The tender document is available for download from 21.06.2023 and last date for bid submission is 12.07.2023.

Place: Vijayawada — **Sd/- Vice Chairman and Managing Director**
Date: 21st June 2023 — **The A.P. Mineral Development Corporation Limited**

భారత ప్రభుత్వం - రైల్వేస్ మంత్రిత్వ శాఖ
ఇండియన్ రైల్వేస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీరింగ్ అండ్ టెలికమ్యూనికేషన్స్, తార్నాక రోడ్, సికింద్రాబాద్ – 500 017 (ఇండియా)

EOI Notice No. CoE/IRISET/02/23, Dt. : 16.06.2023
PUB/0673

రైల్వేస్ మంత్రిత్వ శాఖ పరిధిలో పని చేస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (CoE)/IRISET వారు నేషనల్ ATP సిస్టమ్ కవచ్‌తో మూవింగ్ బ్లాక్ ఉపయోగిస్తూ హెడ్ వే ఇంప్రూవ్‌మెంట్ కోసం ఫీల్డ్ ట్రైల్స్ మరియు ఇండిపెండెంట్ సేఫ్టీ అసెసర్ సర్టిఫికేషన్‌తో సహా ప్రొడక్ట్ ప్రోటో టైప్ యొక్క టెక్నికల్ స్పెసిఫికేషన్, డిజైన్ అభివృద్ధి, ఫంక్షనల్ రిక్వైర్‌మెంట్ స్పెసిఫికేషన్ అభివృద్ధి (FRS) కోసం కాగోరు అసోసియేట్స్ నుండి ప్రతిస్పందన కోరుతున్నారు.

ఆసక్తి గల పార్టీలు పైన తెలిపిన EoI నోటీసుకు సంబంధించి దిగువ తెలిపిన వైబ్‌సైట్స్‌లో అన్ని అప్‌డేట్స్‌ను చూసి మరియు నిరంతరం గమనించవలసిందిగా సూచించబడుతున్నారు.

వెబ్‌సైట్స్ : **https://iriset.indianrailways.gov.in and https://iriset.railnet.gov.in**

A0948 — **OSD/CoE/IRISET**

The Singareni Collieries Company Limited
(A Government Company)
Regd. Office: Kothagudem - 507101, Telangana.
E-PROCUREMENT TENDER NOTICE

Tenders have been published for the following Services/Material Procurement through e-Procurement Platform For details, Please visit https://tender.telangana.gov.in - or - https://www.scclmines.com

NIT/Enquiry No. Description / Subject / Estimated Contract Value - Last Date and time.

CRP/CVL MMR/TN-15/2023-24, Dt. 14.06.2023- Renewal coat to existing asphalt roads at II and III Zone of Mandamarri area, Mancherial Dist., Telangana State- Rs. 1,61,21,640.00- 30.06.2023-4.30 PM.

CRP/CVL/SRP/TN-16/2023-24, Dt. 16.06.2023- Supply, Installation, testing and commissioning of required machinery i.e., Waste Segregation Machine, Wet Waste Shredder Machine, Compost Turner, Coconut Shredder, Fatka Machine. Baling Machine, Agglomerator and Extruder for 25T capacity Municipal Solid Waste Treatment. Plant including comprehensive operation & maintenance for a period of 1 year (after successful trial run of 2 months) on EPC basis at CISF Complex, Srirampur Area, Mancherial Dist., Telangana State - EPC Mode Tender - 03.07.2023 - 4.30 PM.

CWKGM/e-18/2023-24, Dt 15.06.2023- Providing APP membrane for arresting roof leakages to workmen quarters at Babu Camp, Burma Camp & Hospital area, Kothagudem Corporate for the year 2023-24, Bhadradri Kothagudem District, Telangana State - Rs. 25,37,161.00- 23.06.2023 - 4.00 PM.

CWKGM/e-20/2023-24, Dt. 15.06.2023 - Repair works to veranda including providing tiles and other connected works etc., in-front of Male Medical ward to Maty ward & up to Operation Theatre, Staff rooms of CMO Office and ACMO Office etc., at Main Hospital, Kothagudem Corporate, Bhadradri Kothagudem District, Telangana State - Rs. 49,06,372.00 - 03.07.2023 - 4.00 PM. **General Manager (Civil)**

RG1/CVL/ET-29(42)/2023-24, Dt. 15.06.2023 - Construction of switch station at GDK Coal Mine (2,2A&5) in RG I Area GDK (Defect liability period two years) ("Invited under earmarked work - for SC Community Contractors only") - Rs. 32,14,421/- - 10.07.2023 - 4.00 PM. **General Manager (RGI)**

DIPR RO No.3422-PP/CL/Advt/1/2023-24, Dt. 20.06.2023

డా॥ బి.ఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ
(U.G.C., న్యూఢిల్లీచే గుర్తించబడింది)
ప్రొ.ఫ్రొ. జి. రామ్‌రెడ్డి మార్గ్, రోడ్ నం.46, జూబ్లీహిల్స్, హైదరాబాద్ - 500033

MBA & MBA (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్)లో ప్రవేశం కోసం ప్రవేశ ప్రకటన

2023–24 విద్యా సంవత్సరం కోసం MBA & MBA (హాస్పిటల్ అండ్ హెల్త్ కేర్ మేనేజ్‌మెంట్) ప్రోగ్రామ్‌లలోకి ప్రవేశం కోసం BRAOUMBA ఎంట్రన్స్ టెస్ట్–2023 కోసం అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుతున్నవి. రిజిస్ట్రేషన్, చెల్లింపు మరియు ఆన్‌లైన్ దరఖాస్తు దాఖలు ప్రారంభ తేది: 21–06–2023 నుండి.

అర్హతా ప్రమాణాలు మరియు ఇతర వివరాల కోసం వెబ్ పోర్టల్ www.braouonline.in చూడండి.

దరఖాస్తు చేయు విధానం: అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్ పోర్టల్ **www.braouonline.in** ద్వారా మాత్రమే BRAOUMBAET-2023 కోసం దరఖాస్తు చేయవలెను మరియు నెట్ బ్యాంకింగ్/డెబిట్/క్రెడిట్ కార్డ్ లేదా AP/TS ఆన్‌లైన్ సెంటర్స్ ద్వారా మాత్రమే రూ.1500/– (జనరల్ కేటగిరీ కోసం) మరియు రూ.1000/– (SC/ST/దివ్యాంగులకు)ల రిజిస్ట్రేషన్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలి.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ కోసం ఆఖరి తేది: 30–07–2023

ఎంట్రన్స్ టెస్ట్ తేది, సమయం: 31–08–2023న మ.12:30 గం.ల నుండి మ.2:00 గం. వరకు.

అభ్యర్థులు తమ హాల్ టికెట్లను యూనివర్సిటీ వెబ్‌సైట్లు **www.braou.ac.in** లేదా **www.braouonline.in** లో **25 ఆగస్ట్, 2023** నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

గమనిక: TSICET-2023 / APICET-2023 లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ BRAOUMBAET-2023 కోసం హాజరు కానవసరం లేదు.

DIPR RO No.3387-PP/CL/Advt/1/2023-24, Dt: 20.06.2023 — సం/- రిజిస్ట్రార్

OFFICE OF THE PRINCIPAL,
JAWAHAR NAVODAYA VIDYALAYA,
GOPANPALLY, RANGAREDDY DISTRICT,
TELANGANA- 500 046
Phone: 040-29700559 Email: jnvrangareddy@gmail.com
Website: https://www.navodaya.gov.in/nvs/nvs-school/RANGAREDDY/en/home/

SHORT TENDER NOTICE

The sealed quotations are invited from the authorized firms for the supply of 1) Non-Veg Items, 2) Electrical and Plumping Materials, 3) M & R Materials, 4) AMC for Computers and Printers, 5) AMC for Konica Minolta Model DIZHUB 458, 6) AMC for RO Plant, 7) AMC for Maintenance of CCTV Cameras, 8) Hair Cutting, 9) Washing & Ironing, 10) Hiring Charges of Vehicle to this Vidyalaya for the session 2023-24. The Tender can be downloaded from the website https://www.navodaya.gov.in/nvs/nvs-school/RANGAREDDY/en/home/ or can be had from the office of the undersigned.

The tender form can be obtained from the office of the undersigned by submitting an application on any working day from 21.06.2023 to 29.06.2023 between 1000 hrs and 1700 hrs on 30.06.2023 upto 1400 hrs on payment of Rs.200/- in cash/DD (non refundable) for Sl.No. 01 to 10. The quotations will be received till 1600 hrs on 30.06.2023 and the same will be opened by the PASC of the Vidyalaya on 01.07.2023 at 1130 hrs in the Vidyalaya office. An amount of Rs.200/- must be submitted in the form of Demand Draft in favour of "The Principal, JNV, Rangareddy" by those firms downloaded the tender form from the website of the vidyalaya.

This office reserves the right to accept or to reject any tender paper or application without assigning reasons.

Sd/- **R. Daniel Retnakumar, Principal**

27 మిల్లులు | రూ. 2వేల కోట్లు

ఈ సంవత్సరమే సర్కారీ రైస్ మిల్లుల నిర్మాణం

- గంటకు 60 నుంచి 120 టన్నుల ధాన్యాన్ని మరాడించే భారీ కెపాసిటీతో మిల్లుల ఏర్పాటు
- పౌరసరఫరాల సంస్థ ద్వారా నిర్వహణ
- సీఎంతో జరిగిన సమావేశంలో కీలక నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మిల్లింగ్ సమస్యను పరిష్కరించేందుకు సర్కారీ రైస్ మిల్లుల నిర్మాణం ఈ సంవత్సరంలోనే ప్రారంభం కానుంది. సోమవారం సీఎం కేసీఆర్ పౌరసరఫరాల శాఖకు సంబంధించి నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు వచ్చే ఏడాదికల్లా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ద్వారానే జిల్లాకో మిల్లును ఏర్పాటు చేయనున్నారు. మొదటి దశలో రాష్ట్ర వ్యాప్తంగా 27 జిల్లాల్లో ప్రతి జిల్లాకూ ఒకటి చొప్పున 27 మిల్లును ఏర్పాటు చేయబోతున్నారు. ఇందుకోసం సుమా రు రూ. 2వేల కోట్లు వెచ్చించాలని ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. గంటకు 60 నుంచి 120 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మరాడించే కెపాసిటీతో ఈ మిల్లులను ఏర్పాటు కానున్నాయి. ప్రైవేటు మిల్లులపై భారాన్ని తగ్గించడంతో పాటు మిల్లర్లపై బాధ్యతను పెంచేందుకు ఈ నిర్ణయం తోడ్పడుతుందని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది.

పెరిగిన ధాన్యం దిగుబడికి అనుగుణంగా...

రాష్ట్రంలో ధాన్యం దిగుబడి అనూహ్యంగా పెరిగింది. ఏటా వానాకాలం, యాసంగి సీజన్లు కలిపి 3 కోట్ల టన్నుల వరకు దిగుబడి వస్తోంది. ఈ పరిస్థితుల్లో తెలంగాణలో మిల్లింగ్ ప్రధాన సమస్యగా మారింది. రైతుల నుంచి ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసి, బియ్యం(సీఎంఆర్)గా మార్చి ఎఫ్‌సీఐకి అప్పగించాలి. ఎఫ్‌సీఐ సెంట్రల్ పూల్ కింద బియ్యాన్ని కొనుగోలు చేసి రాష్ట్ర ప్రభుత్వానికి డబ్బులు చెల్లిస్తుంది. ఈ క్రమంలో ఎక్కడ ఆలస్యమైనా రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం నుంచి రావలసిన డబ్బులు ఆగిపోతాయి. గత మూడేళ్లుగా ప్రతి ఏటా సకాలంలో మిల్లింగ్ ప్రక్రియ పూర్తికాక కేంద్రం నుంచి సహకారం అందక రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బంది పడుతోంది. గత యాసంగిలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇప్పటికి కూడా మిల్లర్లు మర పట్టించి ఇవ్వలేని పరిస్థితి.

రాష్ట్రంలో 1,773 మిల్లులు...

రాష్ట్రంలో ప్రస్తుతం 1,773 మిల్లుల్లో ధాన్యం మిల్లింగ్ జరుగుతోంది. ఇందులో రా మిల్లులు 859 కాగా, బాయిల్డ్ మిల్లులు 914. ఒక్కో మిల్లులో ప్రస్తుతం గంటకు 8 నుంచి 10 మెట్రిక్ టన్నుల ధాన్యం చొప్పున ప్రతి రోజు రెండు షిఫ్టుల్లో 100 నుంచి 150 మెట్రిక్ టన్నుల వరకు మిల్లింగ్ కెపాసిటీ మాత్రమే ఉంది. అంటే రాష్ట్రంలోని అన్ని మిల్లుల్లో పూర్తిస్థాయిలో మిల్లింగ్ జరిగితే రోజుకు లక్ష నుంచి 2 లక్షల టన్నులకు పైగా ధాన్యం మిల్లింగ్ జరిగే అవకాశం ఉంది. అయితే మిల్లర్లు తమ ప్రైవేటు దందాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుండడంతో సర్కారుకు ఇచ్చే సీఎంఆర్ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గంటకు 60 నుంచి 120 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మరాడించే భారీ మిల్లులను పౌరసరఫరాల సంస్థ ద్వారా నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించడం గమనార్హం. మిల్లులతో పాటు బియ్యం ఆధారిత పరిశ్రమలను కూడా అక్కడే ఉండేలా ప్రణాళికలు తయారు చేయాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు సీఎం ఆదేశించారు.

సీఎం సూచన మేరకు నిర్మాణాలు: మంత్రి గంగుల

సీఎం సూచన మేరకు ప్రభుత్వమే పౌరసరఫరాల సంస్థ ద్వారా రైస్ మిల్లులను నిర్మించాలని నిర్ణయించింది. గంటకు 60 నుంచి 120 టన్నుల కెపాసిటీ గల మిల్లులను తీసుకొస్తాం. వచ్చే ఏడాదికల్లా నిర్మాణాలు పూర్తి చేయాలనేది ఆలోచన. మిల్లులతో పాటు బియ్యం ఆధారిత ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలను కూడా కార్పొరేషన్ ద్వారా నిర్వహించే ఆలోచనలో ఉన్నాం.

ఆరోపణలు అవాస్తవమని బాండ్ రాసివ్వమంటుండు

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే రాజయ్య ఒత్తిళ్లకు పాల్పడుతున్నాడు

- త్వరలో అన్ని ఆధారాలు బయటపెడతా
- జానకీపురం సర్పంచ్ నవ్య మరోసారి ఆరోపణలు



ధర్మసాగర్: జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య తనపై ఒత్తిళ్లకు పాల్పడుతున్నారని హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం జానకీపురం గ్రామ సర్పంచ్ కురసపల్లి నవ్య మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. గ్రామంలో మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గతంలో తాను ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు అవాస్తవమని బాండ్ రాసివ్వాలని ఆయన తీవ్ర ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పంపిన బాండ్ పేపర్లపై సంతకాలు పెట్టాలని తన భర్త కూడా ఇబ్బందులు పెడుతున్నారని ఆమె చెప్పారు. ఆ బాండ్ పేపర్‌లో తనకు రూ.20లక్షల అప్పు ఇస్తున్నట్లు రాశారని పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యే వద్ద డబ్బులు తీసుకోవడం పూర్తిగా అవాస్తవమని నవ్య చెప్పారు.

నా భర్త టార్చర్ చేస్తున్నాడు..

'గతంలో ఎమ్మెల్యే రాజయ్యపై నేను చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నా వెనక ఓ బడా నాయకుడు ఉండి నాతో ఇదంతా మాట్లాడించాడని అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు పెడితే అప్పుగా రూ.20 లక్షలు ఇస్తామని ఎమ్మెల్యే పీఏ నా భర్తతో మాట్లాడాడు. అప్పటినుంచి ఆ అగ్రిమెంట్ పేపర్లపై సంతకాలు పెట్టాలని నా భర్త నన్ను టార్చర్ చేస్తున్నాడు' అని నవ్య ఆరోపించారు. గతంలో జరిగిన గొడవలో ఎమ్మెల్యే వద్ద సెటిల్‌మెంట్ చేస్తానని చెప్పి మండలానికి చెందిన ఓ వ్యక్తి రూ.5లక్షలు తీసుకున్నాడని ఆమె ఆరోపించారు. తన వద్ద ఆడియోలు, ఆధారాలు ఉన్నాయని, త్వరలో అన్ని బయటపెడతానని ఆమె వెల్లడించారు.

భిక్కనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్మహత్య



భిక్కనూరు: కామారెడ్డి జిల్లా భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిట్టెడి భగవంత్‌రెడ్డి (54) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఆయన స్వగ్రామం అంతంపల్లిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భగవంత్‌రెడ్డి రాత్రి 8.30 గంటల సమయంలో ఇంటినుంచి బయటకు వెళ్లాడు. తన సోదరుడికి చెందిన వ్యవసాయ భూమి వద్ద ఉన్న రేకుల షెడ్‌లో ఉరివేసుకున్నారు. రాత్రి 10.30 గంటలకు అది గమనించిన అక్కడ పనిచేసే సాగర్ భగవంత్‌రెడ్డి కుటుంబీకులకు, గ్రామస్తులకు సమా చారం అందించారు. ఆత్మహత్యకు గల కారణాలేవీ తెలియరాలేదు.

సాయం చేస్తానంటూ మాటలు కలిపి..

- రాత్రివేళల్లో చాటింగ్, వీడియో కాల్స్
- బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడిపై ఆరోపణలు
- పోలీసులను ఆశ్రయించిన బాధిత మహిళ

మంచిర్యాల టౌన్: మంచిర్యాల పట్టణ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు బింగి ప్రవీణ్ సాయం చేస్తానంటూ మాటలు కలిపి మోసం చేసేందుకు ప్రయత్నించాడని ఓ మహిళ మంగళవారం మంచిర్యాల పోలీసులను ఆశ్రయించింది. ప్రవీణ్ నివాసం ఉంటున్న కాలనీలోనే తాను భర్తతో కలసి ఉంటున్నట్లు పేర్కొంది. తమ మధ్య ఉన్న గొడవను ప్రవీణ్ అనుకూలంగా మలుచుకునేందుకు ఓవైపు తన భర్తతో, మరోవైపు తనతో సన్నిహితంగా ఉంటూ పోలీసులు తెలుసంటూ మోసం చేసేందుకు ప్రయత్నించినట్లు ఆరోపించింది. అధికార పార్టీ నేత కావడంతోనే పోలీసులు సైతం ప్రవీణ్ చెప్పినట్లు చేయడం, దీనిని ఆసరాగా చేసుకొని తనకు అర్ధరాత్రి వరకు వాట్సాప్‌లో చాటింగ్, వీడియో కాల్స్ చేస్తున్నాడని ఆరోపణలు చేసింది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారని మహిళ వివరించింది. ఈ విషయమై బింగి ప్రవీణ్‌ను సంప్రదించగా తన ఇంటి సమీపంలోనే భార్యాభర్తలు ఉంటారని, సాయం చేయాలని కోరితేనే భార్యాభర్తలకు తన వంతు సాయం చేసేందుకు ప్రయత్నించానన్నారు. మహిళ లేనిపోని ఆరోపణలు చేస్తోందన్నారు.

ఇద్దరు కూతుళ్లతో తల్లి బలవన్మరణం

ముగ్గురి ప్రాణాలు తీసిన కుటుంబ కలహాలు



మెదక్ జోన్: దంపతుల మధ్య ఘర్షణ మూడు నిండు ప్రాణాలను బలి తీసుకుంది. భర్త విషం తాగి మృత్యువుతో పోరాడుతుండగా, కలత చెందిన భార్య నాలుగేళ్లలోపు ఇద్దరు కూతుళ్లతో సహా చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. మెదక్ మండలం కోంటూరులో మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. మెదక్ మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మిని రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన కొక్కుల ఎల్లం (30)కి ఇచ్చి ఏడేళ్ల క్రితం వివాహం చేశారు. వారికి శరణ్య (4) శ్రావ్య(3) ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కాగా 9 రోజుల క్రితం ఏదో విషయమై భార్యభర్త మధ్య గొడవ జరిగింది. దీంతో ఎల్లం విషం తాగాడు. వెంటనే అతన్ని కుటుంబ సభ్యులు మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. బంధువులతో పాటు ఇతరులు కూడా ఎల్లం మందు తాగటానికి లక్ష్మి కారకురాలంటూ ఆమెను మందలించినట్టు తెలిసింది. దీంతో మనస్తాపం చెందిన లక్ష్మి తన ఇద్దరు కూతుళ్లతో మంగళవారం మధ్యాహ్నం కోంటూరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తుల ఫిర్యాదుపై పోలీసులు మృతదేహాలను బయటకు తీసి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెంటపడిన కుక్కలు.. ట్రాక్టర్ కిందపడి విద్యార్థి దుర్మరణం

- విద్యా దినోత్సవంలో చోటుచేసుకున్న విషాదం
- హనుమకొండ జిల్లా మద్రిపల్లిగూడెంలో దుర్ఘటన



ధనుష్ (ఫైల్)

కమలాపూర్: వీధి కుక్కలు వెంటపడటంతో తప్పించుకునే ప్రయత్నంలో ఓ బాలుడు ట్రాక్టర్ కిందపడి దుర్మరణం పాలైన విషాదకర ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని మద్రిపల్లిగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మద్రిపల్లిగూడేనికి చెందిన ఇనుగాల జయపాల్–స్వప్న దంపతుల ఒక్కగానొక్క కుమారుడు ధనుష్ (10) ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 6వ తరగతిలో చదువుతున్నాడు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ధనుష్ ఈ ర్యాలీలో పాల్గొనేందుకు వెళ్తున్న క్రమంలో వీధి కుక్కలు వెంటపడ్డాయి. వాటినుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తుండగా అదే గ్రామంలోని రిక్కల నారాయణరెడ్డికి చెందిన ట్రాక్టర్‌ను డ్రైవర్ తోట విజయేందర్ అతివేగంగా, అజాగ్రత్తగా నడుపుతూ వచ్చి బాలుడిని ఢీకొట్టాడు. ప్రమాదంలో ధనుష్ ట్రాక్టర్ కింద పడిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే కమలాపూర్ ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలే తమ కుమారుడిని బలి తీసుకున్నాయని, ఈ ఉత్సవాలు లేకుంటే తమ కుమారుడు బతికేవాడని ధనుష్ తల్లిదండ్రులు విలపించారు. ధనుష్ తండ్రి జయపాల్ ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమాని నారాయణరెడ్డి, డ్రైవర్ తోట విజయేందర్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి: ఈటల

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ విద్యార్థి ధనుష్ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. ధనుష్ కుటుంబానికి ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి కమలాపూర్ ప్రభుత్వాస్పత్రికి చేరుకుని విద్యార్థి మృతదేహాన్ని పరిశీలించారు. బాధిత కుటుంబీకులను ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రిన్సిపాల్ కార్యాలయం,
జవహర్ నవోదయ విద్యాలయ,
గోపన్‌పల్లి, రంగారెడ్డి జిల్లా, తెలంగాణ-500046
ఫోన్: 040-29700559, ఇ-మెయిల్: jnvrangareddy@gmail.com
వెబ్‌సైట్: https://www.navodaya.gov.in/nvs/nvs-school/RANGAREDDY/en/home/

ప్రకటన

పూర్తిగా కాంట్రాక్చువల్ ప్రాతిపదికన మేట్రన్ ఉద్యోగాన్ని భర్తీ చేసేందుకు జవహర్ నవోదయ విద్యాలయ, HCU క్యాంపస్, నల్లగండ్ల రోడ్, గోపన్‌పల్లి, రంగారెడ్డి జిల్లా - 500046 వద్ద **03.07.2023న ఉ.10.00 గం.ల నుండి సా.5.00 గం.ల వరకు** వాక్-ఇన్-ఇంటర్వ్యూ నిర్వహించబడును. అవశ్యక అర్హతలతో దాని వివరమైన ప్రకటన కోసం విద్యాలయ వెబ్‌సైట్‌ను రిఫర్ చేయవలెను. అభ్యర్థులు విద్యాలయ వెబ్‌సైట్ నుండి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకొని, పరిశీలన కోసం అన్ని అవశ్యక ఒరిజినల్ డాక్యుమెంట్లతో వాక్-ఇన్-ఇంటర్వ్యూకు హాజరు కావలసిందిగా కోరబడుతున్నారు.

సం/- ఆర్.డానియేల్ రత్నకుమార్, ప్రిన్సిపాల్

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ
భారత ప్రభుత్వం
రాజీవ్ గాంధీ భవన్, న్యూ ఢిల్లీ

ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (AERA) మెంబర్ ఉద్యోగానికి ప్రకటన

పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వ పరిపాలన నియంత్రణ క్రింద విమానాశ్రయాలలో అందించబడుతున్న ఏరోనాటికల్ సర్వీసెస్ కోసం ట్రాఫిక్ క్రమబద్ధీకరించుటకు మరియు ఇతర చార్జెస్ కోసం అథారిటీ అయిన ఎయిర్‌పోర్ట్స్ ఎకనామిక్ రెగ్యులేటరీ అథారిటీ (AERA) మెంబర్ ఉద్యోగానికి ఎంపిక కోసం దరఖాస్తులు కోరబడినవి.

2. దరఖాస్తు కోసం నిర్ణీత ఫార్మేట్‌తో పాటు వయోపరిమితి, అవశ్యకమైన క్వాలిఫికేషన్ మరియు అనుభవం మొ॥ వాటి వివరాలు మినిస్ట్రీ ఆఫ్ సివిల్ ఏవియేషన్ వెబ్‌సైట్ www.civilaviation.gov.in లో లభిస్తాయి. వివరాలను AERA వెబ్‌సైట్ (www.aera.gov.in) నుండి కూడా పొందవచ్చును.

3. అర్హత కలిగి, ఆసక్తి ఉన్న వ్యక్తులు నిర్ణీత ఫార్మేట్‌లో తమ దరఖాస్తులను 18 జూలై, 2023 లోగా పంపవచ్చును.

సం/-
(రుబీనా అలీ)
CBC 03112/12/0007/2324 — జాయింట్ సెక్రటరీ

హైదరాబాద్ వద్ద నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్
హైదరాబాద్ సమక్షంలో
కాంటినెంటల్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్
(CCPL లేదా విడదీయబడిన కంపెనీ)
మరియు
CCL ప్రొడక్ట్స్ (ఇండియా) లిమిటెడ్
(CCL ప్రొడక్ట్స్ లేదా పరిణామ కంపెనీ)
మరియు
వారి సంబంధిత షేర్‌హోల్డర్లు మరియు క్రెడిటార్ల మధ్య
కంపెనీల చట్టం, 2013 విషయంలో
మరియు
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్స్ 230 నుండి 232 విషయంలో
మరియు
సదరు చట్టంలోని అన్ని ఇతర వర్తించు నిబంధనలు మరియు అరేంజ్‌మెంట్ స్కీమ్ విషయంలో
C.A. (CAA) నం. 9/230/HDB/2023
కి అనుబంధంగా ఉన్న
C.P. (CAA) నం. 23/230/HDB/2023

కాంటినెంటల్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్, CIN: U15492TG2011PTC074429 కలిగి ఉండి కంపెనీల చట్టం, 1956లోని నిబంధనల క్రింద ఇన్‌కార్పొరేట్ అయిన కంపెనీ మరియు 7-1-24/2/D, గ్రీన్‌ల్యాండ్స్, అమీర్‌పేట్, హైదరాబాద్-500016, తెలంగాణ, ఇండియాలో తమ నమోదిత కార్యాలయాన్ని కలిగి ఉంది, ప్రాతినిధ్యం వహించు దాని డైరెక్టర్, బండి మోహన్ కృష్ణ, ఇ-మెయిల్: mohan.b@continental.coffee, ఫోన్: 040–23732455

పిటిషనర్ / విడదీయబడిన కంపెనీ

కంపెనీస్ (కాంప్రమైజెస్, అరేంజ్‌మెంట్స్ మరియు అమాల్గమేషన్స్) రూల్స్, 2016లోని రూల్ 16 క్రింద పిటిషన్ విచారణ నోటీసు

కాంటినెంటల్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ ("విడదీయబడిన కంపెనీ") మరియు CCL ప్రొడక్ట్స్ (ఇండియా) లిమిటెడ్ ("పరిణామ కంపెనీ") మరియు వారి సంబంధిత షేర్‌హోల్డర్లు మరియు క్రెడిటార్ల మధ్య అరేంజ్‌మెంట్ స్కీమ్‌కు గాను అనుమతి పొందేందుకు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 230 నుండి 232 క్రింద ఒక కంపెనీ పిటిషన్ హైదరాబాద్ వద్ద గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ సమక్షంలో 04 మే, 2023న కాంటినెంటల్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ (విడదీయబడిన కంపెనీ)చే సమర్పించబడింది. సదరు కంపెనీ పిటిషన్ 31 మే, 2023 న గౌరవనీయ ట్రిబ్యునల్‌చే ఆమోదించబడింది మరియు గౌరవనీయ ట్రిబ్యునల్ యొక్క 31 మే, 2023 తేది గల ఉత్తర్వు ప్రకారం, సదరు కంపెనీ పిటిషన్‌ను 11 జూలై, 2023న హైదరాబాద్ వద్ద గౌరవనీయ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్ సమక్షంలో విచారించేందుకు నిర్ణయించడమైనది. సదరు పిటిషన్‌కు మద్దతు తెలుపగోరు లేదా వ్యతిరేకించగోరు ఏ వ్యక్తి అయినా తమ పేరు మరియు చిరునామాతో అతను లేదా అతని అడ్వకేట్‌చే సంతకం చేయబడిన అతని ఉద్దేశ్య ప్రకటనను పిటిషనర్ యొక్క అడ్వకేట్‌కు పంపవలెను అవి పిటిషన్ విచారణ కోసం నిర్ణయించిన తేదీకి ముందు రెండు రోజుల తర్వాత కాకుండా (అనగా 08 జూలై, 2023న లేదా ఆలోగా) పిటిషనర్ అడ్వకేట్‌కు చేరేలా పంపవలెను. అతను పిటిషన్‌ను వ్యతిరేకించగోరితే, వ్యతిరేకించడానికి గల కారణాలను లేదా అతని అఫిడవిట్ కాపీని అట్టి నోటీసుతో జతపరచవలెను. పిటిషన్ కాపీ దాని కోసం నిర్ణయించిన ఛార్జీల చెల్లింపుపై అది కావలసిన ఏ వ్యక్తికైనా క్రింది సంతకందారుచే దాఖలు చేయబడును.

సం/-
వై. సూర్యనారాయణ
పిటిషనర్ కంపెనీల తరఫు అడ్వకేట్
నిర్మల్ టవర్స్ 200, ఫ్లాట్ నం. 106, సాయి బాబా టెంపుల్, దగ్గర, ద్వారకాపురి కాలనీ, పంజాగుట్ట, హైదరాబాద్-500082
తేది: 20-06-2023
ప్రదేశం: హైదరాబాద్

SECUNDERABAD CANTONMENT BOARD
Sardar Patel Road, Court Compound, Secunderabad-500 003

PUBLIC NOTICE

This is for the information of the general public that the following transferees have applied for transfer of property as mentioned against their names. Their requests have been processed and the names of the transferees are to be recorded in the tax register as maintained by this office, as per Section 81 of the Cantonments Act., 2006.

Sr. No.	Name of the existing owner as per the tax records. Shri/Smt.	Name of the Transferee. Shri/ Smt.	Locality	Sale Deed Doc.No. & Date
1	KOLLANA KRUPAVATHI	SRI CUNCHANAKOTA GOPAL S/O SRI CUNCHANAKOTA BHEEMAIAH	PNO 100/GF/FF, VAHANI NAGAR, SIKH ROAD	SALE DEED NO 2003/2022, DT. 07/11/2022
2	KHAJA MOHIUDDIN, ANIRUNNISA BEGUM	1. KHAJA MOHIUDDIN 2. MR SOHAIL MOHIUDDIN	PNO 6/GF/FF, A P GOVT CHS, KARKHANA	SETTLEMENT DEED NO 1135/2022, DT. 29/06/2022 SALE DEED NO 151/1980, DT. 01/01/1980
3	D SRAVAN KUMAR	SRI S LAXMIKANTH S/O LATE S JEEVAN RAO	PNO 156/GF/FF/SF, NEW VASAVI COLONY, KAKAGUDA	SALE DEED NO 2270/2004, DT. 03/12/2004
4	S SULOCHANA	SRI SOPPADHANDI NAVEEN	PNO 27/GF/FF, BALAJI NAGAR, KAKAGUDA	GIFT DEED NO 420/2023, DT. 06/03/2023
	SRI SOPPADHANDI NAVEEN	SRI DHARVATH BHASKAR S/O SRI DHARVATH DEVA		SALE DEED NO 689/2023, DT. 28/03/2023
5	SHRI PANABAKA KRISHNAIAH	DR VENKAT RAM THYALAPALLI S/O SRI T GURUCHARANAM	PNO 49/GF, RAVI COLONY, MAHENDRA HILLS, EAST MARREDPALLY	SALE DEED NO 894/2023, DT. 19/05/2023
6	SRI C SUBBA REDDY THROUGH HIS LEGAL HEIRS 1. MRS C LALITHA 2. MRS M SIRISHA 3. MR C SATYANARAYANA REDDY	MRS C SREELATHA D/O LATE MR C SUBBA REDDY	FNO 33, R & D DEFENCE CHS, CHANDULAL BOWLI	DEATH CERTIFICATE OF LATE C SUBBA REDDY RELEASE DEED NO 2211/2022, DT. 08/12/2022
7	T ALLI MUTHU	SMT A SHOBHA RANI W/O SRI THAMBU ALLIMUTHU	PNO 26, BALAJI NAGAR, KAKAGUDA	DEATH CERTIFICATE OF LATE T ALLI MUTHU SETTLEMENT DEED NO 267/2020, DT. 13/02/2020
8	SRI GOPINATH SHINDE	SMT DAMAYANTHI SHINDE W/O LATE GOPINATH SHINDE	PNO 15/GF/FF/SF, SARVASUKHI COLONY, MARREDPALLY	DEATH CERTIFICATE OF LATE GOPINATH SHINDE LEGAL HEIRS CUM FAMILY MEMBERS AFFIDAVIT DATED. 12/10/2022 NO OBJECTION AFFIDAVIT DATED. 01/04/2023
9	DR MUJEEBUNNISA BAIG	MR MOHAMMED KHURRAM ALI KHAN S/O MR MOHAMMED MUKARRAM ALI KHAN	HNO 1-20-0208, RASOOLPURA VILLAGE	SETTLEMENT DEED NO 644/2023, DT. 13/04/2023
10	DR BHAGAVATULA JAYASREE, B SOMAYAJI SARMA	SMT KODURI GAYATHRI W/O SRI K NAGARAJ	PNO A-4/FNO 3/GF, STATE BANK COLONY, MARREDPALLY	SALE DEED NO 896/2019, DT. 03/05/2019
11	SRI M E MALLESH	1. SRI M MURALIDHAR 2. MASTER M KAUSHAL RAJ 3. SMT A RAMA DEVI	PNO 17, M.E.S COLONY, PICKET	GIFT SETTLEMENT DEED NO 320/2013, DT. 06/02/2013 GIFT SETTLEMENT DEED NO 319/2013, DT. 06/02/2013 GIFT SETTLEMENT DEED NO 321/2013, DT. 06/02/2013
12	SHRI NARAYAN NANDEO GAWADE, B PURUSHOTHAM NAGARAJ	1. SMT KONDALA ANURADHA 2. SRI KONDALA AKSHAY	PNO 32/GF/FF, SRI SWAMY AYYAPA CHS, BOWENPALLY	SALE DEED NO 138/2021, DT. 08/01/2021
13	RAJESH M MORJARIA, BHARAT M MORJARIA	SOW AMITA SURESH JARIWALA W/O SURESH JARIWALA	PNO 19/FNO G-2/GF, LAXMI GUNTI COLONY, RASOOLPURA	SALE DEED NO 1010/2013, DT. 15/05/2013
14	ANJANMA	1. VIVEK RAJU P 2. PUSHPA P	PNO B-3/SF, SRI SAIRAJ APRTS, TRIMULGHERY	SALE DEED NO 686/2006, DT. 25/03/2006
	1. VIVEK RAJU P 2. PUSHPA P	1. SMT KAVITHA 2. MR V S VISHAL		SALE DEED NO 2276/2021, DT. 01/12/2021
15	KOPPISETTY CHAKRADHAR, KOPPISETTY RAMESH	SRI VINOD KUMAR SHARMA S/O LATE SRI HARI KRISHAN SHARMA	FNO S-1, (PNO 3), BHAVANA CHS, RISALA BAZAR	DEATH CERTIFICATE OF LATE K RAMESH LEGAL HEIR DATED. 15/02/2023 SALE DEED NO 760/2023, DT. 28/04/2023
16	SRI Y SESHAGIRI RAO	SMT YADLAPALLI SURYA KUMARI W/O LATE SRI Y SESHAGIRI RAO	PNO 18/B, AKULA NARAYANA COLONY, MARREDPALLY	DEATH CERTIFICATE OF LATE SRI Y SESHAGIRI RAO FAMILY MEMBER CERTIFICATE DATED. 08/03/2006 SALE DEED NO 3387/1981, DT. 07/12/1981
17	PRIYA KHANNA AND VIJAY KUMAR KHANNA	1. MR MURTUZA N GANDHI 2. MRS KHADIJA M GANDHI	PNO 120/P/GF/FF, RAVI CHS, TRIMULGHERY	SALE DEED NO 1284/2008, DT. 05/09/2008
18	M LAKSHMI NARAYANA THROUGH HIS LEGAL HEIRS 1. SMT M SHANTHA RUKMINI 2. SRI UMESH MALLUGARI 3. NAGESH MALLUGARI	1. MR SYED GULAM MAHMOOD HUSSAIN 2. MRS ARJUMAN ZAINEB	PNO 10/FNO 302/SF, H.A.C.P STAFF COLONY, KARKHANA	DEATH CERTIFICATE OF LATE M LAKSHMI NARAYANA FAMILY MEMBER CERTICATE DATED. 22/06/2022 SALE DEED NO 773/2023, DT. 29/04/2023
19	M LAKSHMI NARAYANA THROUGH HIS LEGAL HEIRS 1. SMT M SHANTHA RUKMINI 2. SRI UMESH MALLUGARI 3.NAGESH MALLUGARI	1. MR SYED GULAM MAHMOOD HUSSAIN 2. MRS ARJUMAN ZAINEB	PNO 19/FNO 102/GF, H.A.C.P STAFF COLONY, KARKHANA	DEATH CERTIFICATE OF LATE M LAKSHMI NARAYANA FAMILY MEMBER CERTICATE DATED 22/06/2022 SALE DEED NO 772/2023, DT. 29/04/2023
20	M LAKSHMI NARAYANA THROUGH HIS LEGAL HEIRS 1. SMT M SHANTHA RUKMINI 2. SRI UMESH MALLUGARI 3.NAGESH MALLUGARI	1. MR SYED GULAM MAHMOOD HUSSAIN 2. MRS ARJUMAN ZAINEB	PNO 19/FNO 101/GF, H.A.C.P STAFF COLONY, KARKHANA	DEATH CERTIFICATE OF LATE M LAKSHMI NARAYANA FAMILY MEMBER CERTICATE DATED. 22/06/2022 SALE DEED NO 771/2023, DT. 29/04/2023

Any person having any objection to the above transfer/mutation in the name of the transferee in tax records of this office are required to inform this office in writing within (21) twenty one days of publication of this notice. If no objection is received within this stipulated time, this office will take necessary decision to enter the name of transferee in the tax register of this office.

No. SCB/TS/1371, Office of the Cantonment Board,
Court House Compound, S.P. Road, Secunderabad - 500 003.
Date : 20-06-2023

Sd/-
Chief Executive Officer,
Secunderabad Cantonment Board

క్లుప్తంగా...

జనవరి 14న అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపన

న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం చకచకా సాగుతోంది. వచ్చే ఏడాది జనవరి 14న మకర సంక్రాంతి రోజు ఆలయ ప్రతిష్ఠాపన జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానిస్తామని రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా చెప్పారు. ప్రతిష్ఠాపన వేడుకలు 10 రోజులపాటు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ వేడుకలను దేశ విదేశాల్లో ప్రత్యక్ష ప్రసారం చేసేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. కనీసం వెయ్యి సంవత్సరాలపాటు పటిష్ఠంగా ఉండేలా రామాలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు.

ఎన్నికల నిర్వహణ... హింసకు లైసెన్స్ కాదు

మమతకు సుప్రీంలో ఎదురు దెబ్బ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లో జులై 8న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో కేంద్ర బలగాలను మోహరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలను మోహరించాలని కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, రాష్ట్ర ఎన్నికల సంఘం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లను అత్యున్నత న్యాయస్థానం మంగళవారం కొట్టేసింది. ఎన్నికలు నిర్వహించడమంటే హింసను రాజేయడానికి లైసెన్స్ ఇవ్వడం కాదంటూ మమత ప్రభుత్వంపై మండిపడింది. రాష్ట్రంలో ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా సాగడానికే హైకోర్టు ఈ ఆదేశాలు ఇచ్చిందని జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన సుప్రీం బెంచ్ ఆదేశించింది. పంచాయతీ ఎన్నికల నామినేషన్ల సమయంలోనే ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల్లో పలువురు మరణించడంతో హైకోర్టు కేంద్ర బలగాలను మోహరించాలని ఆదేశాలు జారీ చేసింది.

పాక్‌లో అణు విద్యుత్కేంద్రం ఏర్పాటుకు చైనా సాయం

ఇస్లామాబాద్: పాకిస్తాన్‌-చైనాల వ్యూహాత్మక మైత్రి బలోపేతం అవుతోందనేందుకు మరో ఉదాహరణ. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న పాక్‌లో రూ.39 వేల కోట్లతో 1,200 మెగావాట్ల సామర్థ్యం కలిగిన అణువిద్యుత్ కేంద్రం ఏర్పాటుకు చైనా ముందుకు వచ్చింది. పంజాబ్‌లోని మియాన్‌వలి జిల్లా చస్మా వద్ద చేపట్టే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఒప్పందంపై పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సమక్షంలో మంగళవారం బీజింగ్‌లో రెండు దేశాల మధ్య సంతకాలు జరిగాయి. ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను ఎటువంటి ఆలస్యం లేకుండా తక్షణమే ప్రారంభిస్తామని షరీఫ్ ప్రకటించారు.



రాజకీయ వేడి!

పట్నా సమావేశంలో విపక్ష పార్టీలు ఐక్యతను సాధించగలవా ?

ఎన్డీయే పార్టీలను కలిపే వ్యూహాల్లో మోదీ, షా విజయం సాధిస్తారా?

దేశంలో ఇప్పుడు అందరి దృష్టి రెండు మెగా ఈవెంట్స్ మీదే ఉంది.

మొదటిది ప్రధాని మోదీ అధికారిక హోదాలో అమెరికా పర్యటన

రెండోది బిహార్ సీఎం నితీశ్ కుమార్ చొరవతో పట్నాలో జరిగే విపక్షాల భేటీ

అమెరికాలో మోదీ ప్రవాస భారతీయులతో ఆత్మీయ సమావేశంలో మన దేశ పురోగతిపై మాట్లాడే రోజే ఇక్కడ మోదీని గద్దె నుంచి దింపాలన్న ఉమ్మడి ఎజెండాతో విపక్షాలు మంత్రాంగం రచిస్తున్నాయి.

విపక్షాలు ఎంతవరకు ఐక్యరాగం ఆలపిస్తాయి ? దానిని ఎదుర్కొనే వ్యూహాలు ఎన్డీయే దగ్గర ఏమున్నాయి ?



వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఎదుర్కోవడానికి విపక్షాలంతా చేయి చేయి కలిపి తమ బలం చాటనున్నారు. కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ సహా 20 జాతీయ, ప్రాంతీయ పార్టీలు ఈ నెల 23న పట్నాలో సమావేశమై మోదీని ఎదుర్కోవడానికి అవసరమైన వ్యూహాలను రచించనున్నారు. దేశంలో అత్యంత బలవంతుడైన నాయకుడు మోదీని ఎదిరించి నిలబడుతున్న రాహుల్ గాంధీ, అరవింద్ కేజ్రివాల్; మమతా బెనర్జీ వంటి వారు ఈ సమావేశానికి హాజరై వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీని గద్దె దింపడమే లక్ష్యంగా మంత్రాంగం నడపనున్నారు. పాట్నా సమావేశంలో ప్రతిపక్ష పార్టీలందరూ ఒకే తాటిపైకి రాగలరా అన్న ఉత్కంఠ సర్వత్రా నెలకొంది. పార్టీల్లో ఎవరికి వారికే ప్రధానమంత్రి పదవి తమకే దక్కాలన్న ఆశ ఉండడంతో చెట్టుకొకరు పుట్టకొకరుగా ఉన్నారు. ప్రధాని మోదీని ఎదుర్కోవాలంటే విపక్షాల ఓట్లు చీలకుండా ఉండడానికి బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ విపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి తీసుకురావడానికి చొరవ చూపించారు. ప్రతీ నియోజకవర్గంలోనూ బీజేపీకి దీటుగా ప్రతిపక్షాల ఉమ్మడి అభ్యర్థిని బరిలో దింపుదామని ఆయన ప్రతిపాదించారు. కానీ ఇదెంతవరకు కార్యరూపం దాలుస్తోందన్న అనుమానాలున్నాయి.

- ప్రాంతీయ పార్టీల మధ్య నెలకొన్న రాజకీయ శత్రుత్వం విపక్షాల ఐక్యతకు అసలు సిసలైన సవాల్‌గా నిలుస్తోంది. పశ్చిమ బెంగాల్‌లో ఉప్పు నిప్పుగా ఉన్న టీఎంసీ, లెఫ్ట్ పార్టీలను ఒకే తాటిపైకి తీసుకురావడం కష్టమనే అభిప్రాయాలున్నాయి. జమ్మూ కశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వంటి వాటితో కాంగ్రెస్ కలిసే అవకాశం లేదు
- సీట్ల సర్దుబాటు అన్నది లెక్కకు మించిన పార్టీల మధ్య సవ్యంగా జరగడం అతి పెద్ద సవాల్. పశ్చిమ బెంగాల్, అస్సాం, జార్ఖండ్, కేరళ, త్రిపుర, ఉత్తరప్రదేశ్‌లో పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు అంత సులభంగా కనిపించడం లేదు. ఈ రాష్ట్రాల్లోనే 172 లోక్‌సభ స్థానాలున్నాయి.
- ఆమ్ ఆద్మీ పార్టీ మధ్యప్రదేశ్ , రాజస్తాన్‌లలో తాము పోటీకి దిగమని హామీ ఇస్తోంది కానీ తమకు గట్టి పట్టున్న న్యూఢిల్లీ, పంజాబ్‌లో కాంగ్రెస్ పార్టీ పోటీపడకూడదని షరతు విధిస్తోంది. అదే విధంగా పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అధిక సంఖ్యలో సీట్లు కాంగ్రెస్‌కు కేటాయించడానికి సిద్ధంగా లేరు.
- బీజేపీపై ఉమ్మడి అభ్యర్థిని నిలపకపోతే మోదీని ఎదుర్కోవడం కష్టసాధ్యమని నితీశ్ కుమార్ అభిప్రాయంగా ఉంది. ఆ దిశగా ఆయన ఎంతవరకు ఒప్పించగలరన్నది సందేహమే.
- ప్రధాని మోదీకున్న చరిష్మాను తట్టుకొని నిలబడాలంటే చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ రాజీపడి ఇతర పార్టీలకు దగ్గరవాలని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయంగా ఉంది.
- ఈ సవాళ్లన్నింటిని అధిగమించడం ఇప్పుడే సాధ్యం కాదు కాబట్టి ప్రస్తుత సమావేశం దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలైన ధరాభారం, నిరుద్యోగంతో పాటు మతం పేరుతో సమాజాన్ని చీల్చే చర్యలకి వ్యతిరేకంగా ఉమ్మడి పోరాట వ్యూహాన్ని చర్చించడానికి పరిమితమయ్యే అవకాశాలున్నాయి

ఒకవైపు విపక్ష పార్టీలన్నీ ఏకం కావడానికి సర్వశక్తులు ఒడ్డుతూ ఉంటే అధికార ఎన్డీయే నుంచి ఇప్పటికే ఎన్నో పార్టీలు దూరమయ్యాయి. మళ్లీ వారందరితోనూ జత కట్టడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ద్వయం దృష్టి పెట్టారు. మహారాష్ట్రలో శివసేన దూరమయ్యాక ఆ పార్టీని చీల్చి ఏక్‌నాథ్ షిండేని సీఎంను చేసిన బీజేపీకి ఇప్పుడు ఆయన వైఖరి కూడా కొరుకుడు పడడం లేదు. మహారాష్ట్రలో బీజేపీకి చెందిన ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కంటే ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండేకి జనాదరణ అధికంగా ఉందని పేపర్‌లో ప్రకటన ఇవ్వడం బీజేపీకి మింగుడు పడడం లేదు. తమిళనాడులో మిత్రపక్షమైన ఏఐఏడీఎంకే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై జయలలితపై చేసిన వ్యాఖ్యల్ని వ్యతిరేకిస్తూ ఒక తీర్మానం చేసింది. ఇక బిహార్‌లో నితీశ్ కుమార్ జేడీ (యూ) దూరమయ్యాక ఎన్నికల్లో బీజేపీ నష్టపోతుందని పార్టీ అంతర్గత సర్వేల్లో వెల్లడైంది. ఇటీవల ప్రధాని మోదీ బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎం, డిప్యూటీ సీఎంలతో జరిగిన సమావేశంలో తమతో కలిసే మిత్రపక్షాలను కలుపుకొని పోవాలని మోదీ ఆదేశాలిచ్చినట్టు తెలుస్తోంది.

- కేంద్రం తీసుకువచ్చిన వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ 2020లో ఎన్డీయేకి గుడ్‌బై కొట్టేసిన పంజాబ్‌లోని శిరోమణి అకాలీదళ్‌ను కూడా తిరిగి ఎన్డీయే గూటికి తీసుకువచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు.
- ఇక కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడిన మాజీ ప్రధాని దేవెగౌడకు చెందిన జేడీ(ఎస్) ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో చేతులు కలపాలని కలిసి పోటీ చేయడం దాదాపుగా ఖరారైంది. బీహార్‌లో కులప్రాతిపదికన చిన్న పార్టీలను కలుపుకొని వెళితే మేలన్న యోచనలో బీజేపీ ఉంది. లోక్‌జనశక్తి పార్టీ (చిరాగ్ చీలిక వర్గం) ఎన్డీయేకి దూరమవకుండా చర్యలు తీసుకుంటూనే హిందూస్తాన్ అవామ్ మోర్చా (హెచ్ఏఎం) దగ్గరకు తీసుకునే చర్యలు చేపడుతోంది. నితీశ్ ప్రభుత్వంలో మంత్రిగా ఉండే ఇటీవల విభేదాల కారణంగా బయటకు వచ్చిన వికాశ్ శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ) చీఫ్ ముకేశ్ సాహ్నితో కూడా మంతనాలు సాగిస్తోంది.
- ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీతో కలిసి పోటీ చేసిన ఓం ప్రకాశ్ రాజ్‌బహార్‌కు చెందిన సుహెల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీతో మంతనాలు సాగిస్తోంది. బీజేపీ యూపీ అధ్యక్షుడు చౌదరి భూపేంద్ర సింగ్ వారణాసిలో జరిగిన రాజ్‌బహార్ వ్యక్తిగత కార్యక్రమానికి హాజరయ్యారు. ఇలా అన్ని వైపుల నుంచి ఎన్డీయేని బలోపేతం చేయడానికి బీజేపీ వ్యూహాలు పన్నుతోంది.

సాక్షి, నేషనల్ డెస్క్

భార్యపై కోపంతో బస్తాలకొద్దీ నాణేలు..

జైపూర్: భార్యకు భరణంగా ఇవ్వాల్సిన రూ.55 వేలను రూపాయి, రెండు రూపాయల నాణేల రూపంలో తెచ్చిన ఓ భర్తకు కోర్టు షాకిచ్చింది. వాటిని తీసుకోవాలని భార్యను కోరుతూనే, ఆ మొత్తాన్ని రూ.వెయ్యి వంతున స్వయంగా లెక్కించి ఇవ్వాలంటూ భర్తను ఆదేశించింది. రాజస్తాన్‌లోని జైపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. హర్మదా ప్రాంతానికి చెందిన దశరథ్ కుమావత్, భార్య సీమ విభేదాలు రావడంతో విడాకుల కోసం కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అక్కడ ఈ కేసు పెండింగ్‌లో ఉంది. అప్పటి వరకు సీమకు నెలకు రూ.5 వేల చొప్పున నిర్వహణ ఖర్చుల కింద ఇవ్వాలని దశరథ్‌ను న్యాయస్థానం ఆదేశించింది. అయితే, అతడు 11 నెలలుగా ఆ సొమ్మును ఇవ్వడం లేదు. దీంతో, సీమ మళ్లీ కుటుంబ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అతడిపై కోర్టు రికవరీ వారెంట్ జారీ చేసింది. డబ్బు చెల్లించేందుకు అతడు నిరాకరించడంతో పోలీసులు జూన్ 17న అరెస్ట్ చేశారు. ప్రస్తుతం ఫ్యామిలీ కోర్టు సెలవులో ఉండటంతో పోలీసులు దశరథ్‌ను అదనపు జిల్లా న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. దశరథ్ అరెస్ట్ కావడంతో సీమకు చెల్లించాల్సిన డబ్బును అతడి కుటుంబసభ్యులు ఏడు బస్తాల్లో కోర్టుకు తీసుకువచ్చారు. రూ.55 వేలకు సమానమైన రూ.1, రూ.2 నాణేలు వాటిలో ఉన్నాయి. ఆ డబ్బును తీసుకునేందుకు సీమ నిరాకరించారు. తనను మానసికంగా వేధించాలని ఉద్దేశపూర్వకంగానే ఇలా తీసుకువచ్చారని ఆరోపించారు. న్యాయమూర్తి మాత్రం నాణేల రూపంలో దశరథ్ డబ్బు చెల్లించవచ్చని తెలిపారు. అయితే, ఆ నాణేలన్నిటినీ అతడే స్వయంగా లెక్కించాలని స్పష్టం చేశారు. ఈ కేసు విచారణను ఈ నెల 26వ తేదీకి వాయిదా వేశారు. అప్పటి వరకు డబ్బు కోర్టు అధీనంలోనే ఉంటుందని తెలిపారు. విచారణ తేదీ రోజున డబ్బును దశరథ్ లెక్కించి రూ.వెయ్యి చొప్పున ప్యాకెట్లుగా విభజించి, కోర్టులో వాటిని భార్యకు అప్పగించాలని తేల్చి చెప్పారు.

ఐఐటీ-బాంబేకు మరో రూ.315 కోట్ల విరాళం

రూ.400 కోట్లకు చేరిన నందన్ నీలేకని విరాళం

ముంబై: ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు, చైర్మన్ నందన్ నీలేకని(68) ప్రఖ్యాత ఇంజనీరింగ్ విద్యాసంస్థ ఐఐటీ-బాంబేకు మరో రూ.315 కోట్ల విరాళం అందజేశారు. దీంతో ఈ సంస్థకు ఆయన ఇప్పటిదాకా ఇచ్చిన విరాళం రూ.400 కోట్లకు చేరుకుంది. నందన్ నీలేకని 1973లో ఐఐటీ-బాంబేలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీలో చేరారు. ఈ సంస్థతో తన అనుబంధానికి 50 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా రూ.315 కోట్ల విరాళం ఇచ్చినట్లు నీలేకని చెప్పారు. ఐఐటీ-బాంబేకు పూర్వ విద్యార్థులు ఇచ్చిన అతిపెద్ద విరాళాల్లో ఇది కూడా ఒకటిగా రికార్డుకెక్కింది. ఆయన గతంలో ఇదే సంస్థకు రూ.85 కోట్ల విరాళం అందజేశారు. ఐఐటీ-బాంబే 1958లో ఏర్పాటయ్యింది. దేశంలో ఇది రెండో ఐఐటీ.

శారీరక బంధం నిరాకరణ నేరం కాదు

సాక్షి బెంగళూరు: వివాహం అనంతరం శారీరక సంబంధాన్ని నిరాకరించడం నేరం కాదని కర్ణాటక రాష్ట్ర హైకోర్టు అభిప్రాయపడింది. ఇదే సమయంలో హిందూ వివాహ చట్టం–1955 ప్రకారం లైంగిక చర్యకు నిరాకరించడం క్రూరత్వంతో సమానమని తెలిపింది. శారీరక సంబంధం నిరాకరించిన ఘటనలో ఒక భర్తపై భార్య, ఆమె తల్లిదండ్రులు దాఖలు చేసిన క్రిమినల్ కేసుపై విచారించిన హైకోర్టు ఈమేరకు వ్యాఖ్యానించింది. శారీరక సంబంధాన్ని నిరాకరించడం ఐపీసీ సెక్షన్ 489ఏ కిందికి రాదని, అది నేరం కాదని స్పష్టం చేసింది. ఐపీసీ సెక్షన్ 498ఏ, వరకట్న నిరోధక చట్టం–1961 సెక్షన్ 4 కింద దాఖలైన కేసులు, పోలీసు చార్జిషీట్‌ను వ్యతిరేకిస్తూ భర్త హైకోర్టును ఆశ్రయించాడు. అతడి పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న విచారించారు. 'పిటిషనర్ ధార్మికుడు. అతని దృష్టిలో ప్రేమ అంటే శారీరక సంబంధం కాదు. అది ఆత్మల కలయిక. అందుకే భార్యతో శారీరక సంబంధాన్ని నిరాకరించాడు'అని జడ్జి తెలిపారు. ఇలా శారీరక సంబంధం కలిగి ఉండకపోవడం హిందూ వివాహ చట్టం సెక్షన్ 12 (1) (ఏ) కింద క్రూరమైన చర్య, అయితే ఐపీసీ 498 (ఏ) కింద నేరం కాదంటూ భర్త, అతని తల్లిదండ్రులపై పెట్టిన కేసులను కొట్టివేశారు.

శాంతి వైపే భారత్

ఉక్రెయిన్-రష్యా యుద్ధంపై మా వైఖరి తటస్థం కాదు

ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని అందరూ గౌరవించాల్సిందే

వాల్‌స్ట్రీట్ జర్నల్ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌-రష్యా యుద్ధంపై భారత్ తటస్థంగా వ్యవహరిస్తోందని కొందరు చెబుతున్నారని, అందులో ఎంతమాత్రం నిజం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తేల్చిచెప్పారు. తాము తటస్థంగా లేమని, శాంతి వైపే ఉన్నామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలు, ఇతర దేశాల సార్వభౌమత్వాన్ని ప్రపంచదేశాలన్నీ గౌరవించాల్సిందేనని అన్నారు. అంతర్జాతీయ వేదికపై మరింత సమున్నత పాత్ర పోషించే అర్హత భారత్‌కు ఉందని వ్యాఖ్యానించారు. అగ్రరాజ్యం అమెరికాతో భారత్ సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంత బలంగా ఇప్పుడు ఉన్నాయని చెప్పారు. అమెరికా పర్యటన సందర్భంగా మోదీ మంగళవారం ప్రఖ్యాత 'వాల్‌స్ట్రీట్ జర్నల్' పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. పలు కీలక అంశాలను ప్రస్తావించారు. ఇతర ఏ దేశానికీ భారత్ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేశారు. ప్రపంచంలో తమకు దక్కాల్సిన సరైన స్థానం సంపాదించడానికి కృషి చేస్తున్నామని అన్నారు. భారత్-చైనా సంబంధాలపై మాట్లాడుతూ.. ఇరుదేశాల మధ్య సాధారణ సంబంధాలు కొనసాగాలంటే సరిహద్దుల్లో శాంతియుత పరిస్థితులు నెలకొనడం తప్పనిసరన్నారు. ఇతర దేశాల సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రతను గౌరవిస్తామన్నారు. భేదాభిప్రాయాలను, వివాదాలను చట్టబద్ధ పాలన ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నదే తమ అభిమతమని ఉద్ఘాటించారు. అదేసమయంలో తమ సార్వభౌమత్వం, గౌరవాన్ని కాపాడుకోవడంలో రాజీపడే ప్రసక్తే లేదని తెలియజేశారు. ఉక్రెయిన్‌-రష్యా ఘర్షణ నివారణకు తాము చేయాల్సిందంతా చేస్తామన్నారు. ఉక్రెయిన్‌-రష్యా విషయంలో భారత్ వైఖరిని ప్రపంచం అర్థం చేసుకుందన్నారు. భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రధాని నొక్కిచెప్పారు.

న్యూయార్క్ చేరుకున్న మోదీ

భారత ప్రధాని మోదీ మంగళవారం న్యూయార్క్‌కు చేరుకున్నారు. అమెరికా ప్రభుత్వ ప్రతినిధులు ఘనంగా స్వాగతం పలికారు. మోదీకి స్వాగతం పలకడానికి భారతీయ-అమెరికన్లు సైతం భారీగా తరలివచ్చారు.


న్యూయార్క్ ఎయిర్‌పోర్ట్‌లో భారతీయులతో మోదీ..

భారత్-అమెరికా బంధం సుసంపన్నం

భారత్‌-అమెరికా సంబంధాల్లోని వైవిధ్యం, గాఢతను మరింత సుసంపన్నం చేయడానికి తన పర్యటన దోహదపడుతుందని ఆశిస్తున్నట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. అమెరికా ప్రభుత్వ పెద్దలతో భేటీ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని చెప్పారు. ఆయన మంగళవారం ఉదయం అమెరికా పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్, అమెరికా కలిసికట్టుగా పని చేస్తున్నాయని తెలిపారు. అమెరికాలో పర్యటించాల్సిందిగా అధ్యక్షుడు జో బైడెన్, ప్రథమ పౌరురాలు జిల్ బైడెన్ నుంచి తనకు ప్రత్యేక ఆహ్వానం అందిందని పేర్కొన్నారు. రెండు బలమైన ప్రజాస్వామ్య దేశాలైన భారత్‌-అమెరికా భాగస్వామ్య బలానికి, శక్తికి, తేజస్సుకు తన పర్యటన ఒక ప్రతిబింబమన్నారు.

అమెరికా పార్లమెంట్ అండదండలు

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తోపాటు అక్కడి ఉన్నతాధికారులతో సమావేశం కాబోతున్నామని ప్రధాని మోదీ వివరించారు. ఇరుదేశాల నడుమ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి ఈ చర్చలు తోడ్పడుతాయని చెప్పారు. న్యూయార్క్ నుంచే తన పర్యటన ప్రారంభం కాబోతోందని, ఈ నెల 21న ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో యోగా దినోత్సవంలో పాల్గొంటానని తెలిపారు. అమెరికా పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో మాట్లాడబోతున్నానని వివరించారు. అమెరికా పర్యటన అనంతరం 24న ఈజిప్టుకు పయనమవుతానని మోదీ తెలిపారు.

ప్రధాని మోదీ అమెరికాలో నోబెల్ బహుమతి గ్రహీతలు, ఆర్థికవేత్తలు, కళాకారులు, సైంటిస్టులు,వ్యాపారవేత్తలు, విద్యావేత్తలతో సమావేశం కానున్నారు. టెస్లా అధినేత ఎలాన్ మస్క్, రచయిత నీల్ డిగ్రాస్ టైసన్‌లను కలుసుకుంటారు.

నేరాంగీకారానికి సిద్ధమైన బైడెన్ తనయుడు



వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుమారుడు హంటర్ బైడెన్ తనపై నమోదైన రెండు కేసుల్లో నేరం అంగీకరించేందుకు ముందుకు వచ్చారు. ఆయనపై ఆదాయ పన్ను ఎగవేతతోపాటు అక్రమంగా ఆయుధాన్ని కలిగి ఉన్నారనే అభియోగాలు నమోదయ్యాయి. ఇందుకు సంబంధించిన కేసుల్లో న్యాయశాఖతో ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆయన సిద్ధంగా ఉన్నారంటూ డెలావెర్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ఫెడరల్ జడ్జి ఆమోదం తెలపాల్సి ఉంది. అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ హంటర్ బైడెన్ తాజా నిర్ణయం తీసుకోవడం గమనార్హం. ఫలితంగా ఆయన జైలు శిక్ష నుంచి తప్పించుకునేందుకు అవకాశాలున్నాయి.

పర్యావరణహిత పర్యాటకం లక్ష్యంగా పనిచేద్దాం

సాక్షి, న్యూఢిల్లీ: పర్యావరణహిత పర్యాటక విధానాన్ని జీ20 సభ్యదేశాలు, ఆతిథ్య దేశాలు అవలంబించినపుడే సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోగలమని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పణజిలో జరిగిన జీ20 చివరి (4వ) వర్కింగ్ గ్రూప్ సమావేశంలో మంత్రి మాట్లాడారు. గుజరాత్‌లోని కచ్, బెంగాల్‌లోని సిలిగురి, కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జరిగిన మొదటి మూడు పర్యాటక వర్కింగ్ గ్రూప్ సమావేశాల్లో సభ్య దేశాల ప్రతినిధుల మధ్య కీలకమైన అంశాలపై లోతైన చర్చ జరిగిందన్నారు. అప్పటి నిర్ణయాలపై గోవాలో బుధవారం జరిగే పర్యాటక మంత్రుల సమావేశంలో చర్చిస్తామన్నారు. వాటిని 'గోవా రోడ్ మ్యాప్'పేరుతో తదుపరి కార్యాచరణకు ముందుకు తీసుకెళ్తామని కిషన్ రెడ్డి వెల్లడించారు.

యూపీ, బిహార్‌లకు కేంద్ర బృందాలు

న్యూఢిల్లీ: దేశంలో అత్యధిక రాష్ట్రాలలో ఇంకా వేసవి వడగాడ్పులు కొనసాగుతూ ఉండడంతో కేంద్ర ఆరోగ్య శాఖ మంగళవారం అత్యున్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించింది. వడగాడ్పుల నుంచి ప్రజారోగ్యాన్ని కాపాడే విషయంలో అధికారుల సన్నద్ధతపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ సమీక్షించారు. వడగాడ్పులతో 100 మంది వరకు మరణించిన ఉత్తరప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లో కేంద్ర బృందాలు పర్యటించాలని మాండవీయ ఆదేశించారు. కేంద్ర ఆరోగ్య శాఖలో నిపుణులు, ఐసీఎంఆర్, ఐఎండీ, ఎన్‌డీఎంఏకు చెందిన బృందాలు త్వరలో ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించి వడదెబ్బ తగిలిన వారికి, ఎండాకాలం వచ్చే వ్యాధుల బారిన పడిన నిరుపేదలకు సాయం అందించనున్నారు. ఇక వడదెబ్బ తగలకుండా ప్రజలే జాగ్రత్త వహించేలా అవగాహన పెంచే చర్యలు కూడా చేపట్టాలని కేంద్ర మంత్రి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. వడదెబ్బ ప్రభావం శరీరంపై పడకుండా తగ్గించుకోవడానికి ఏం చెయ్యాలనే అంశాలపై స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)ను ఆదేశించారు. దీనికి సంబంధించి విస్తృతంగా అధ్యయనాలు, పరిశోధనలు చెయ్యాలన్నారు. వేసవికాలంలో ఎండ తీవ్రతను ఎదుర్కోవడానికి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జాతీయ స్థాయిలో రచించిన ప్రణాళికను ఇప్పటికే అన్ని రాష్ట్రాలతో ప్రధాని పంచుకున్నారని, దీనిపై ప్రజల్లో అవగాహన పెంచడం అవసరమని మాండవీయ వివరించారు.



వైభవంగా జగన్నాథుని రథయాత్ర

పూరి: ఒడిశాలోని పూరి జగన్నాథుడి రథయాత్ర మంగళవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఏడాదికొకసారి జరిగే ఈ యాత్రలో సుభద్ర, బలభద్రసమేతుడైన జగన్నాథుడి రథయాత్రని కళ్లారా వీక్షించడానికి పూరికి ప్రపంచం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. 45 అడుగుల ఎత్తైన జగన్నాథుడు, బలరాముడు, సుభద్ర కొలువు దీరిన రథాలను జై జగన్నాథ్ అంటూ భక్త జన సందోహం నినాదాలు, పూజారులు మంత్రోచ్ఛటనాల మధ్య యువకులు రథాలను లాగుతూ 2.5 కి.మీ. దూరంలో ఉన్న గుండిచా మందిరంలో భక్తుల సందర్శనార్థం ఉంచారు. తొమ్మిది రోజుల పాటు ఈ మందిరంలోనే భక్తులకు దర్శనమిస్తారు. జూన్ 28న జరిగే తిరుగు రథయాత్రలో పూరి మందిరానికి జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర తిరిగి చేరుకుంటారు. రాష్ట్ర గవర్నర్ గణేశ్ లాల్, ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ జగన్నాథుడి రథాన్ని లాగి లాంఛనంగా యాత్రను ప్రారంభించారు. అంతకు ముందు గజపతి మహరాజ్ దివ్యసింగ్ దేవ్ మూడు రథాలను బంగారం చీపురుతో శుభ్రం చేసి రథయాత్రకు వాటిని సిద్ధం చేశారు.

టైటానిక్ వీక్షణకు వెళ్లి..

మినీ జలాంతర్గామి 'టైటాన్'గల్లంతు • యాత్రికుల్లో ముగ్గురు కుబేరులు • అట్లాంటిక్ సముద్రంలో గాలింపు

బోస్టన్: అట్లాంటిక్ సముద్రంలో శతాబ్దం క్రితం మునిగిపోయిన టైటానిక్ నౌక శకలాల సందర్శనకు నలుగురు యాత్రికులతో వెళ్లిన మినీ జలాంతర్గామి 'టైటాన్'జాడ తెలియకుండా పోయింది. ఈ మినీ జలాంతర్గామిలోని యాత్రికుల్లో ముగ్గురు కుబేరులున్నారు. కెనడాలోని న్యూఫౌండ్‌లాండ్ రాష్ట్రం సెంట్ జాన్స్‌కు 700 కిలోమీటర్ల దూరంలోని అట్లాంటిక్ సముద్రంలోని టైటానిక్ శకలాల వద్దకు ఆదివారం దిగుతూ 1.45 గంటల తర్వాత సంబంధాలు తెగిపోయినట్లు యాత్ర నిర్వహిస్తున్న ఓషన్ గేట్ సంస్థ తెలిపింది. యాత్రికుల్లో ఒకరు దుబాయ్‌లో ఉంటున్న బ్రిటిష్ వాణిజ్యవేత్త, యాక్షన్ ఏవియేషన్ చైర్మన్ హమిష్ హార్డింగ్ కాగా. మిగతా ఇద్దరు లండన్‌లో ఉంటున్న పాక్ జాతీయుడైన వాణిజ్యవేత్త షహజాదా దావూద్, ఆయన కొడుకు సులేమాన్.

తెగిన సంబంధాలు..

టైటాన్‌కు పోలార్‌బేర్ అనే ఐస్‌బ్రేకర్ నౌక మార్గదర్శిగా వ్యవహరిస్తుంది. ఆదివారం ఉదయం సముద్రం లోపలికి వెళ్లిన 1.45 గంటల తర్వాత టైటాన్‌తో సంబంధాలు తెగిపోయినట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం 6 గంటల సమయంలో బయలుదేరే సమయానికి అందులో 96 గంటలకు సరిపోను ఆక్సిజన్ ఉందని ఓషన్ గేట్‌కు చెందిన డేవిడ్ కాన్‌కానన్ చెప్పారు.



ఒక్కొక్కరి ఫీజు రూ.2 కోట్లు


హమిష్


సులేమాన్, దావూద్

1912లో అట్లాంటిక్ సముద్రంలో టైటానిక్ ఓడ ఐస్‌బర్గ్‌ను ఢీకొని మునిగిపోగా అందులోని మొత్తం 2,200 మందిలో 700 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఈ నౌక శిథిలాలను సందర్శించాలనుకునే వారి కోసం ఓషన్ గేట్ సంస్థ మినీ సబ్‌మెరీన్‌ను నడుపుతోంది. ఇందులో ముగ్గురిని తీసుకెళుతుంది. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.2 కోట్లు ఫీజుగా వసూలు చేసింది. టైటానిక్ ఓడ సముద్ర గర్భంలో 3.8 కిలోమీటర్ల అడుగున ఉండగా, టైటాన్ 6 కిలోమీటర్ల వరకు వెళ్లగలుగుతుంది.

చైనా దుష్టబుద్ధి

ఐక్యరాజ్యసమితి: డ్రాగన్ దేశం చైనా మరోసారి తన దుష్టబుద్ధిని చాటుకుంది. పాక్‌కు చెందిన లష్కరే తోయిబా సభ్యుడు, 26/11 ముంబై ఉగ్ర దాడుల్లో పాల్గొన్న సాజిద్ మీర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా పరిగణిస్తూ ఐరాస బ్లాక్‌లిస్టులో చేర్చాలంటూ భారత్, అమెరికా ప్రతిపాదించగా చైనా మంగళవారం అడ్డుకుంది. భద్రతా మండలికి సంబంధించిన '1267 అల్‌ఖైదా శాంక్షన్స్ కమిటీ' ప్రకారం సాజిద్ మీర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించాలని, అతడి ఆస్తులను స్తంభింపజేయాలని, ప్రయాణ నిషేధం విధించాలని భారత్, అమెరికా ప్రతిపాదించాయి. ఈ ప్రతిపాదన ఆమోదం పొందకుండా చైనా అడ్డుపడింది. సాజిద్ మీర్ భారత్‌లో మోస్ట్ వాంటెడ్ జాబితాలో కొనసాగుతున్నాడు. అతడి తలపై అమెరికా ప్రభుత్వం 5 మిలియన్ డాలర్ల బహుమానం ప్రకటించింది. సాజిద్ మీర్ గతంలోనే చనిపోయాడని పాకిస్తాన్ ప్రభుత్వం వాదిస్తోంది.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 21 । జూన్ । 2023



పోయిన సెల్‌ఫోన్లు.. దొరుకుతున్నాయి

ప్రస్తుతం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) సాంకేతికతతో పోయిన ఫోన్లు తిరిగి బాధితులు చేతికి చేరుతున్నాయి. -8లో



చలాన్లు కట్టమన్నారని..

ట్రాఫిక్ పోలీసులు చల్లాన్లు కట్టాలని చెప్పడంతో ఆగ్రహానికి లోనైన ఓ వ్యక్తి తన వాహనానికి నిప్పు పెట్టేందుకు యత్నించిన ఘటన శంషాబాద్‌లో చోటు చేసుకుంది. -8లో

ఉష్ణోగ్రత

గరిష్టం	కనిష్టం
38.8°	28.9°

న్యూస్‌రీల్

'అమరుల కుటుంబాలకు ఆహ్వానం లేకపోవడం దారుణం'

పంజగుట్ట: నగరంలో అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవానికి అమరుల కుటుంబాలకు ఆహ్వానం లేకపోవడం బాధాకరమని తెలంగాణ అమర వీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు నరేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 1,200 మంది త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో అమరుల కుటుంబాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అమరుల కుటుంబాలను గుర్తించి వారిని ప్రారంభోత్సవానికి ఆహ్వానించాలని విజ్ఞప్తి చేశారు.

ప్లేస్కూల్‌లో మంటలు

- తరగతి గదుల్లో చిన్నారులు లేకపోవటంతో తప్పిన ముప్పు



మణికొండ: విద్యుత్ హెచ్చు తగ్గులుగా సరఫరా కావటంతో ఓ ప్లేస్కూల్ ఏసీల్లో మంటలు చెలరేగాయి. స్థానికుల కథనం ప్రకారం.. మణికొండ మున్సిపాలిటీ సెక్రటేరియట్ కాలనీలో శ్రీగాయత్రి టెక్నో స్కూల్ ఆధ్వర్యంలో జాలీ కిడ్స్ ప్లే స్కూల్‌ను నిర్వహిస్తున్నారు. మంగళవారం మధ్యాహ్నం మొదటి అంతస్తులోని రెండు ఏసీల నుంచి మంటలు వచ్చాయి. దట్టమైన పొగ తరగతి గదుల నిండా వ్యాపించింది. ఆ సమయంలో విద్యార్థులు సెల్లార్‌లో ఆడుకుంటున్నారు. గమనించిన ఉపాధ్యాయులు మున్సిపాలిటీ వారికి విషయం చెప్పటంతో వెంటనే అక్కడకు డిజాస్టర్ సిబ్బంది చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం తరగతి గదుల్లో వస్తున్న మంటలను ఆర్పివేశారు. విద్యుత్ సరఫరా, వైరింగ్ సమస్యతోనే మంటలు వచ్చాయని మున్సిపల్ సిబ్బంది చెప్పారు.

రేపు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

- నెక్లెస్ రోడ్డు, లుంబినీ పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, ట్యాంక్‌బండ్ మూసివేత

ఖైరతాబాద్: తెలంగాణ అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22న సాయంత్రం 3 నుంచి రాత్రి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని ట్రాఫిక్ పోలీస్ అడిషనల్ కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపారు. ఖైరతాబాద్ చౌరస్తా నుంచి నెక్లెస్ రోడ్డు రోటరీ, ఎన్టీఆర్ మార్గ్, తెలుగు తల్లి జంక్షన్ల మధ్య ట్రాఫిక్‌కు అనుమతి లేదు. పంజగుట్ట, సోమాజిగూడ నుంచి వచ్చే వాహనాలను నెక్లెస్ రోడ్డు రోటరీ వైపు వెళ్లేందుకు అనుమతించరు. ఈ వాహనాలను షాదాన్ కళాశాల నుంచి నిరంకారి వైపు మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి వచ్చే వాహనాలకు రోటరీ చౌరస్తా వైపునకు అనుమతి ఉండదు. బుద్ధ భవన్ నుంచి వచ్చే ట్రాఫిక్ నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్‌వైపు వెళ్లడానికి నల్లకుంట చౌరస్తా నుంచి మళ్లిస్తారు. లిబర్టీ, అంబేడ్కర్ విగ్రహం నుంచి వచ్చే ట్రాఫిక్ ఎన్టీఆర్ మార్గ్ వైపునకు వెళ్లడానికి అనుమతి లేదు. రాణీగంజ్, కవాడిగూడల నుంచి వచ్చే వాహనాలను ట్యాంక్‌బండ్ వైపు అనుమతించరు. బడా గణేష్ నుంచి ఐమాక్స్, నెక్లెస్ రోటరీ వైపు, మింట్ లేన్ వైపు వచ్చే ట్రాఫిక్ బడా గణేష్ వద్ద నుంచి రాజ్‌దూత్ లేన్ వైపు మళ్లింపు ఉంటుంది. తెలంగాణ అమరవీరుల స్మారక ప్రారంభోత్సవం దృష్ట్యా 22న ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డు, లుంబినీపార్క్ మూసి ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి ఎగువ ట్యాంక్‌బండ్ వైపు వచ్చే ట్రాఫిక్‌కు అనుమతి లేదు. వాహనదారులు, ప్రజలు ట్రాఫిక్ డైవర్షన్లను గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని సుధీర్‌బాబు సూచించారు.



ఎల్లమ్మ కల్యాణోత్సవ దృశ్యం



అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి తలసాని దంపతులు







ఎల్లమ్మ తల్లికి మొక్కుతున్న యువతి

ఎల్లమ్మ కల్యాణం.. ఎల్లెడలా భక్తిభావం

భక్తజన తరంగం మధ్య మంగళవారం బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం వైభవోపేతంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ పునర్వసు నక్షత్రయుక్త అభిజిత్ లగ్న సుముహూర్తమున ఉదయం 11.55 గంటల సమయంలో అమ్మవారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దంపతులు రాష్ట్ర ప్రభుత్వం తరఫున పుస్తె, మెట్టెలు, తలంబ్రాలు, పట్టువస్త్రాలను, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పూలు, పసుపు, కుంకుమలను సమర్పించారు. – అమీర్‌పేట



తలంబ్రాలు పోస్తున్న మేయర్ విజయలక్ష్మి



పూజల్లో పాల్గొన్న సీఎస్ శాంతి కుమారి

కేసీఆర్ నగర్.. సూపర్!

దేశంలోనే అతిపెద్ద డిగ్నిటీ హౌసింగ్ కాలనీగా కొల్లూరు

సాక్షి, సిటీబ్యూరో: గతంలో పేదల కోసం నిర్మించే ఇళ్లంటే ఇరుకు ఇరుకుగా అగ్గిపెట్టెల్లా ఉండేవి. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లతో వాటి పరిస్థితి మారింది. కొల్లూరులోని భారీ డబుల్ బెడ్రూం హౌసింగ్ కాలనీ 'కేసీఆర్ నగర్'ను సకల సదుపాయాలతో నిర్మించారు. ఇళ్లతోపాటే కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, డ్రైనేజీ వంటి వాటితో పాటు భవిష్యత్ అవసరాలకనుగుణంగా తగిన స్థలాలు కేటాయించారు. కొల్లూరు-2 ప్రాజెక్టు కింద నిర్మించిన ఈ డిగ్నిటీ హౌసింగ్ కాలనీలో ఇళ్లు, సదుపాయాలు ఇలా ఉన్నాయి.

కాలనీ విస్తీర్ణం : 145.50 ఎకరాలు
ప్రాజెక్టు వ్యయం: రూ. 1489.29 కోట్లు
ఒక్కో ఇంటి వ్యయం మౌలిక సదుపాయాలతో : రూ.8.65 లక్షలు (ఇంటికి రూ.7.90 లక్షలు, మౌలిక సదుపాయాలకు రూ.0.75 లక్షలు)
కేంద్ర ప్రభుత్వ సబ్సిడీ ఒక్కో ఇంటికి రూ.1.50 లక్షలు
ఇప్పటి వరకు చేసిన ఖర్చు: రూ.1474.75 కోట్లు
మొత్తం బ్లాకులు: 117
డబుల్ బెడ్రూం ఇళ్లు: 15,660
బిల్టప్ ఏరియా: 660 చదరపు అడుగులు
కార్పెట్ ఏరియా: 398 చదరపు అడుగులు
నిర్మాణం: స్టిల్ట్+ 9, 10, 11 అంతస్తులుగా.
భూ వినియోగం: నిర్మాణ స్థలం 37 శాతం, పచ్చదనం, పార్కులు, ప్లేగ్రౌండ్లు, ఓపెన్ స్పేసెస్‌కు 25 శాతం, భవిష్యత్‌లో ఆయా అవసరాల కోసం 38 శాతం.
నిర్మాణాలు ప్రారంభం: 22-02-2018
నిర్మాణాలు పూర్తి: 26-01-2021

బ్లాకులు ఇలా..

- ప్రతి బ్లాకులో 2 లిఫ్టులు. ఒకేసారి 8 మంది వెళ్లేలా.
- 2 లేదా 3 మెట్ల మార్గాలు.
- స్టిల్ట్‌లో పార్కింగ్ సదుపాయం. వాచ్‌మన్ క్వార్టర్.

- 15,660 ఇళ్లతో టౌన్‌షిప్‌ను తలపించేలా..
- 145 ఎకరాల్లో 117 బ్లాకులుగా నిర్మాణం
- తాగునీరు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు
- పార్కులు, ప్లేగ్రౌండ్లు, పాఠశాలలు, బస్తీ దవాఖానాలకు స్థలాల కేటాయింపు



- టాట్‌లాట్స్
- అగ్నినిరోధకవ్యవస్థ ఏర్పాట్లు
- కారిడార్లలో లైటింగ్ ఏర్పాట్లు

మౌలిక సదుపాయాలు.. ప్రత్యేక ఫీచర్లు

- 13.50 కి.మీ.ల వీడీసీసీ రోడ్లు. రోడ్ల వెడల్పు 6–36 మీటర్లు.
- భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ 10.60 కి.మీ.లు
- 9 ఎంఎల్‌డీ సామర్థ్యంతో ఎస్టీపీ ప్లాంట్లు.

భవిష్యత్ అవసరాల కోసం..

భవిష్యత్‌లో ఆయా సదుపాయాల కోసం అవసరమైన స్థలాల్ని లేఔట్‌లో కేటాయించారు. వివరాలిలా ఉన్నాయి.

- వాకింగ్, సైక్లింగ్ ట్రాక్‌లతో పార్కులు. ప్లే గ్రౌండ్స్, ఓపెన్ ఎయిర్ జిమ్స్, ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఓపెన్ స్పోర్ట్స్ ఎరీనా, పిల్లల కోసం టాట్‌లాట్స్, మల్టీ పర్పస్ గ్రౌండ్, ఆంఫీ థియేటర్, ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, బతుకమ్మ ఘాట్.
- షాపింగ్ సదుపాయాలు, కమ్యూనిటీ సెంటర్లు, వెజ్.. నాన్‌వెజ్ మార్కెట్లు.
- ప్లేస్కూల్స్, అంగన్‌వాడీ సెంటర్లు, ప్రాథమిక పాఠశాలలు, హైస్కూళ్లు.
- బస్ టెర్మినల్, బస్‌స్టాప్స్, పోలీస్‌స్టేషన్, ఫైర్‌స్టేషన్, మిల్క్‌బూత్స్, పెట్రోల్‌బంకులు, బస్తీ దవాఖానాలు, అన్ని సదుపాయాలతో హాస్పిటల్, బ్యాంక్, ఏటీఎంలు, పోస్టాఫీసు.

ఒక టౌన్‌షిప్‌ను తలపించే ఈ హౌసింగ్ కాలనీ దేశంలోనే పెద్దదని, ఈ నెల 22న సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించి కొందరికి ఇళ్లు పంపిణీ చేయనున్నారని అధికారులు పేర్కొన్నారు. ఏర్పాట్లు వడివడిగా జరుగుతున్నాయి. మంగళవారం హౌసింగ్ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మున్సిపల్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అర్వింద్‌కుమార్ పనుల్ని పరిశీలించారు.

- ఎస్టీపీల్లో ట్రీట్ చేసిన నీటిని రీసైక్లింగ్ ద్వారా పార్కుల్లో ఇతరత్రా అవసరాలకు వాడుకునేలా నీటినిల్వ సంపు, తగిన పంపులు, పైప్‌లైన్ నెట్‌వర్క్‌తో.
- ఘనవ్యర్థాల నిర్వహణ యార్డు.
- వర్షపునీటి నిల్వకు ఇంకుడు గుంతలు.
- భవిష్యత్‌లో రోడ్ల కటింగ్ లేకుండా డక్ట్‌ల ఏర్పాటు.
- తాగునీటి సరఫరా ఏర్పాట్లు. 10.05 కి.మీ.ల పైప్ నెట్‌వర్క్. 21,000 కిలోలీటర్ల స్టోరేజీ సామర్థ్యం.
- వరదనీటి బాక్స్ డ్రెయిన్లు 10.55 కి.మీ.
- విద్యుత్ సరఫరా కోసం 137 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్స్, ఆర్‌సీసీ డక్ట్స్, ఎల్‌ఈడీ స్ట్రీట్ లైట్స్.
- 3 షాపింగ్‌కాంప్లెక్స్‌ల్లో 118 దుకాణాలు.

లక్ష్యం చేరని 'లక్ష' చేయూత

సాయానికి నోచుకోని సగానికిపైగా బీసీ కుల, చేతివృత్తిదారులు

- హైదరాబాద్ జిల్లాలో వచ్చిన మొత్తం దరఖాస్తులు 17,552
- సకాలంలో అందని కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు
- దరఖాస్తుల గడువు ముగియడంతో అందరిలోనూ నిరాశ

సాక్షి, సిటీబ్యూరో: ఆశలు నింపిన రూ.లక్ష ఆర్థిక చేయూత కోసం దరఖాస్తు చేసుకునేందుకు సగానికి పైగా బీసీ కుల, చేతివృత్తిదారులు దూరమయ్యారు. ఒకవైపు తక్కువ గడువు మరోవైపు సకాలంలో అందని ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు.. వెరసి.. దరఖాస్తు చేసుకోలేకపోయారు. మంగళవారంతో దరఖాస్తుల గడువు ముగిసింది. హైదరాబాద్ జిల్లాలో సుమారు 17,552 దరఖాస్తులు వచ్చినట్లు ఆన్‌లైన్ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బీసీ చేతి,కుల వృత్తిదారులకు వంద శాతం సబ్సిడీతో కూడిన రూ.లక్ష ఆర్థిక చేయూత కోసం దరఖాస్తులు ఆహ్వానించిన విషయం విదితమే. గడువు కాలం తక్కువగా ఇవ్వడంతో దరఖాస్తు చేసుకునేందుకు కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా మారడంతో ఉరుకులు పరుగులు పెట్టిన సగానికి పైగా వృత్తిదారులకు అందనట్లు తెలుస్తోంది.

పడరాని పాట్లు

బీసీ కుల, చేతి వృత్తిదారులు దరఖాస్తు చేసుకునేందుక పడరాని పాట్లు పడ్డారు. మీ సేవ కేంద్రాల్లో ముందుగా కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నా.. అవి మాత్రం సకాలంలో అందలేదు. మరోవైపు ఒకేసారి సర్వర్‌పై భారం పడి ప్రక్రియ నత్తనడకన సాగింది. ఆ తర్వాత ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకునేందుకు సర్వర్ ముప్పుతిప్పలు పెట్టింది. మీ సేవ కేంద్రాల నిర్వాహకులు ఇష్టానుసారం చార్జీలు బాదేశారు.

ఆసిఫ్‌నగర్ నుంచి అత్యధికం

రూ. లక్ష చేయూత కోసం నగరంలోని ఆసిఫ్‌నగర్ నుంచి అత్యధికంగా 2,576, చార్మినార్ నుంచి అతి తక్కువగా 302 దరఖాస్తులు వచ్చాయి. బండ్లగూడ నుంచి 2,159, అంబర్‌పేట1976, ముషీరాబాద్ 1887, ఖైరతాబాద్ 1532, షేక్‌పేట 1212, సైదాబాద్ 1134, నాంపల్లి 951, హయత్‌నగర్ 901, మారేడుపల్లి 891, సికింద్రాబాద్ 662, బహదూర్‌పురా 515, తిరుమలగిరి 459, గోల్కొండ 302, అమీర్‌పేట నుంచి 291 మంది బీసీ కుల, చేతివృత్తిదారులు దరఖాస్తు చేసుకున్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు..

రూ. లక్ష చేయూత విషయంలో దళారులను నమ్మవద్దు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది దరఖాస్తుదారుడి ఇంటి వద్దకు వచ్చి పరిశీలన చేస్తారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పత్రాలు ఎక్కడా సమర్పించాల్సిన అవసరం లేదు. సిబ్బంది పరిశీలనకు వచ్చినప్పుడు చూపిస్తే సరిపోతుంది. చేయూతకు ఎంపికైన వారికి ఫోన్ లేదా ఎస్‌ఎంఎస్ వస్తుంది.
– ఆశన్న, జిల్లా బీసీ సంక్షేమ అధికారి

ఐ లవ్యూ 'జీజూ'

79 ఏళ్ల వృద్ధుడికి సైబర్ కిలేడీ వీడియో కాల్

- బాత్‌రూమ్‌కు రప్పించి వీడియో రికార్డింగ్
- న్యూడ్ వీడియోను అడ్డుపెట్టి రూ. 15 లక్షలు వసూలు
- న్యాయం చేయాలంటూ సిటీ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

హిమాయత్‌నగర్: 'హాయ్ జీజా (బావ) నేను నీ మరదలు లాంటిదానిని. నేను నచ్చితే నాతో వీడియో కాల్ మాట్లాడు ప్లీజ్' అంటూ 79 ఏళ్ల వృద్ధుడిని నిండా ముంచిందో సైబర్ కిలాడీ. 20 ఏళ్ల అందమైన యువతి ఫోన్ చేసి బావా అని పిలవడంతో అత్యాశకు పోయిన అతను రూ. లక్షలు పోగొట్టుకున్నాడు. మరిన్ని లక్షలు కావాలంటూ డిమాండ్ చేయడంతో పాటు వీడియోను బంధువులకు పంపిస్తానంటూ బెదిరింపులకు దిగడంతో తనకు న్యాయం చేయాలంటూ మంగళవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. నగరానికి చెందిన 79 ఏళ్ల రిటైర్డ్ ఉద్యోగికి ఇటీవల ఓ అమ్మాయి గొంతుతో ఫోన్ కాల్ వచ్చింది. మీరు నా బావ లాంటి వారు, మీతో మాట్లాడాలని ఉందనడంతో అతను ఆమెతో మాటలు కలిపాడు. రెండు గంటల్లోనే వీడియో కాల్ ద్వారా పరిచయమయ్యారు. వృద్ధుడిని బాత్‌రూమ్‌లోకి రప్పించిన కిలాడీ 'ఐ లవ్యూ' అంటూ న్యూడ్ వీడియోను రికార్డ్ చేసింది. పది నిమిషాల తర్వాత డబ్బు ఇస్తావా వీడియోను నీ కుటుంబ సభ్యులు, బంధువులకు పంపమంటావా అని బెదిరింపులకు పాల్పడింది. దీంతో పరువుపోతుందని భావించిన అతను ఆమెకు రూ.15 లక్షలు ముట్టజెప్పాడు. ఇంకా డబ్బులు కావాలని డిమాండ్ చేస్తుండటంతో తనకు న్యాయం చేయాలని కోరుతూ సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ కేవీఎం ప్రసాద్ తెలిపారు.

నకిలీ డాక్టర్ దంపతుల అరెస్ట్

- ఫేక్ సర్టిఫికెట్లతో వైద్యం
- 30 ఏళ్లుగా డాక్టర్లుగా చలామణీ

మేడిపల్లి: నకిలీ డాక్టర్ పట్టాలతో వైద్యులుగా చలామణీ అవుతూ కొన్నేళ్లుగా అమాయకులను మోసం చేస్తున్న దంపతులను ఎస్‌ఓటీ పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. మంగళవారం డీసీపీ జానకి ధరావత్, ఎస్‌ఓటీ గిరిధర్ వివరాలు వెల్లడించారు. వరంగల్‌కు చెందిన గిరిధర్‌లాల్ బీఏఎంఎస్ చదివాడు. తాను జనరల్ ఫిజీషియన్‌నని, అమెరికాలో కార్డియాలజీ చదివానని తప్పుడు సర్టిఫికెట్లు సృష్టించి పలు ప్రాంతాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్నాడు. అతడి భార్య సురేఖ రాణి డిగ్రీ మధ్యలో ఆపేసింది. ఆమె గైనకాలజిస్ట్‌గానని చెబుతూ నల్లకుంట శివం రోడ్డులోని షిరిడీసాయి ట్రస్టులో మెడికల్ కన్సల్టెంట్‌గా పని చేసింది. ప్రస్తుతం వీరు బోడుప్పల్‌లో శ్రీ వెంకటేశ్వర సాయి క్లినిక్, ఉప్పల్‌లో ఎస్‌వీఎస్ క్లినిక్, కాలిబండలో అక్షయ కేబీఆర్ పాలి క్లినిక్ పేరుతో ఆస్పత్రులు ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నారు. దాదాపు 30 ఏళ్లుగా తమపై ఎవరికీ అనుమానం రాకుండా తరచూ క్లినిక్‌లను మారుస్తూ వైద్యులుగా చలామణీ అవుతున్నారు. వీరిపై సమాచారం అందడంతో ఎస్‌ఓటీ పోలీసులు దాడులు నిర్వహించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఇలాంటి వారి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీసీపీ సూచించారు. సమావేశంలో సీఐ గోవర్ధనగిరి, ఎస్‌ఐ రాములు, ఎస్‌ఓటీ ఎస్‌ఐ రఘురాం తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ జానకి



ఆర్టీసీ చౌరస్తా వద్ద..



బంజారాహిల్స్‌లో..



నారాయణగూడలో..

వైభవంగా జగన్నాథ రథయాత్ర

జగన్నాథుని రథయాత్ర మంగళవారం నగరంలో కన్నుల పండువగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి ఈ వేడుకను తిలకించి పులకించారు. బంజారాహిల్స్‌తో పాటు ఫిలింనగర్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాలన్నీ భక్తజన సందోహంతో కిటకిటలాడాయి. – బంజారాహిల్స్

కంటోన్మెంట్‌ల విలీనంపై ముందుకే..



కంటోన్మెంట్: కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం దిశగా మంగళవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ ఏడాది జనవరి మొదటి వారంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్‌ఎంసీ విలీనం చేసేందుకు ఉద్దేశించి కమిటీ ఏర్పాటు చేయగా, తాజాగా దేశ వ్యాప్తంగా పలు కంటోన్మెంట్‌ల విలీనం కోసం కేంద్రం వేర్వేరు కమిటీలను ఏర్పాటు చేసింది. దీంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతం జీహెచ్‌ఎంసీలో విలీనంపై సందిగ్ధతకు తెరపడింది. కేంద్రం వీలైనంత త్వరలోనే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. మహారాష్ట్రలోని ఔరంగాబాద్, దేహూ రోడ్, దేవ్‌లాలీ, ఉత్తరప్రదేశ్‌లోని బబినీ, ఫతేఘర్, మథుర, షాజహాన్‌పూర్, రాజస్థాన్ అజ్మీర్, నసీరాబాద్, మధ్యప్రదేశ్‌లోని మోరార్, ఉత్తరాఖండ్‌లోని అల్మోరా, డెహ్రాడూన్, క్లెమెంట్ టౌన్, రూర్కీ కంటోన్మెంట్‌లను సమీప మున్సిపాలిటీల్లో విలీనం చేసేందుకు కమిటీలు ఏర్పాటు చేస్తూ రక్షణ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. సంబంధిత కమిటీలు రెండు నెలల్లో నివేదిక సమర్పించాలని సూచించారు. సికింద్రాబాద్‌కు సంబంధించి ఏర్పాటైన కమిటీ ఫిబ్రవరిలోనే కేంద్రానికి నివేదిక సమర్పించింది. తదనంతరం దేశ వ్యాప్తంగా 56 కంటోన్మెంట్‌లలో ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేసినప్పటికీ, కేంద్రం అర్ధంతరంగా ఉత్తర్వులను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. నాటి నుంచి కంటోన్మెంట్‌ల భవితవ్యంపై పలు ఊహాగానాలు వెలువడగా, తాజా ఉత్తర్వులతో విలీనం దిశగానే కేంద్రం ముందుకెళ్తోందని తెలుస్తోంది.

పోయిన సెల్‌ఫోన్లు..దొరుకుతున్నాయి!

- రెండు నెలల్లో 34,200 మొబైల్స్ బ్లాక్
- 2,219 ఫోన్లు బాధితులకు అప్పగింత
- రికవరీలో రాష్ట్రంలోనే సైబరాబాద్ తొలి స్థానం
- సీఈఐఆర్‌తో సులువైన సెల్‌ఫోన్ల ట్రాకింగ్



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న సైబరాబాద్ పోలీసులు (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: గతంలో సెల్‌ఫోన్ పోయిందంటే చాలు బాధితులు ఆశలు వదులుకునే వారు. కానీ, ప్రస్తుతం సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) సాంకేతికతతో పోయిన ఫోన్లు తిరిగి బాధితులు చేతికి చేరుతున్నాయి. ఈ ఏడాది ఏప్రిల్ 19న రాష్ట్రంలో సీఈఐఆర్ సేవలు అందుబాటులోకి రాగా.. ఇప్పటివరకు 34,200 సెల్‌ఫోన్లను పోలీసులు బ్లాక్ చేశారు. 5,970 ఫోన్లను గుర్తించగా.. 2,219 మొబైల్స్‌ను రికవరీ చేసి, ధ్రువీకరణ పత్రాల పరిశీలన అనంతరం బాధితులకు అప్పగించారు.

సెల్‌ఫోన్ పోయిందంటే ఎవరికైనా ఇబ్బందే. కాంటాక్ట్ నంబర్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు, ఫొటోలు, వీడియోలు తదితర వ్యక్తిగత సమాచారం మొత్తం ప్రమాదంలో పడుతుంది. కొట్టేసిన ఫోన్ సైబర్ నేరగాళ్ల చేతికో, సంఘ విద్రోహ శక్తుల చేతుల్లోకో చేరిందంటే ఇక అంతే సంగతులు. ఇలాంటి సమస్యలకు సీఈఐఆర్ పరిష్కారం చూపిస్తుంది. గతంలో సెల్‌ఫోన్ పోయిదంటే పోలీసులకు ఫిర్యాదు చేసినా కంటితుడుపు చర్యగానే మిగిలిపోయేది. కొన్ని స్టేషన్లలో సెల్‌ఫోన్ చోరీ కేసులను నమోదు కూడా చేసేవారు కాదు. కానీ సీఈఐఆర్ వెబ్‌సైట్ రాకతో పరిస్థితి మారిపోయింది. పోగొట్టుకున్న ఫోన్ల ఆచూకీ ఇట్టే తెలిసిపోతుంది. రోజుల వ్యవధిలోనే బాధితుల చేతికి తిరిగి తమ సెల్‌ఫోన్లు వచ్చేస్తున్నాయి.

ఏంటీ సీఈఐఆర్?

సీఈఐఆర్ అనేది ఆర్టిఫిషల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారంగా పనిచేసే వెబ్‌పోర్టల్. సెల్‌ఫోన్ దొంగతనాలు, నకిలీ ఫోన్ల తయారీలను అరికట్టేందుకు టెలీ కమ్యూనికేషన్ డిపార్ట్‌మెంట్ సీఈఐఆర్ వెబ్‌సైట్‌ను అభివృద్ధి చేసింది. సీఈఐఆర్ ద్వారా పోయిన సెల్‌ఫోన్ యూనిక్ ఐడెంటిఫికేషన్ నంబర్ (యూఐఎన్)ను పనిచేయకుండా చేయవచ్చు. దీంతో ఒకవేళ నేరస్తుల చేతుల్లోకి మన సెల్‌ఫోన్ చిక్కినా అది పని చేయకుండా ఉండేందుకు ఫోన్ బ్లాక్ చేయవచ్చు.

తొలి స్థానంలో సైబరాబాద్..

రాష్ట్రంలో సీఈఐఆర్ వెబ్‌సైట్ నోడల్ ఆఫీసర్‌గా సీఐడీ అదనపు డీజీపీ మహేశ్ ఎం భగవత్ వ్యవహరిస్తున్నారు. సీఈఐఆర్ వినియోగం, నిర్వహణపై రాష్ట్రంలోని 60 మంది పోలీసు సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రాష్ట్రంలోని 780 పోలీస్ స్టేషన్లకు సీఈఐఆర్ యూజర్ ఐడీలను అందించారు. రాష్ట్రంలో ఎక్కువ సెల్‌ఫోన్లు రికవరీ చేసి సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ తొలి స్థానంలో నిలిచింది. గత రెండు నెలల్లో సైబరాబాద్‌లో 300 ఫోన్లు రికవరీ కాగా.. వరంగల్ కమిషనరేట్‌లో 175, రాచకొండ కమిషనరేట్‌లో 148, కామారెడ్డి జిల్లాలో 131 సెల్‌ఫోన్లు రికవరీ చేసి, బాధితులకు అప్పగించారు.

గతంలో ఇలా...

చోరీకి గురైన సెల్‌ఫోన్ ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫికేషన్ (ఐఎంఈఐ) నంబర్ ఆధారంగా పోలీసులు కాల్ డేటా రికార్డులను పరిశీలించేవారు. ఆ ఫోన్‌లో కొత్త సిమ్ కార్డు వేసిన వ్యక్తుల చిరునామా కోసం నెట్‌వర్క్ ప్రొవైడర్లకు లేఖలు పంపేవారు. కొన్ని సార్లు నెట్‌వర్క్ ప్రొవైడర్లు ఆలస్యంగా స్పందించేవారు. దీంతో రికవరీ ప్రక్రియ ఆలస్యంగా, సంక్లిష్టంగానూ ఉండేది. ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు ఆశలు వదులుకునేవాళ్లు. సుమారు 100 ఫిర్యాదులు అందింతే రికవరీ 20 శాతం లోపు ఉండేది.

ఇప్పుడు ఇలా..

చోరీకి గురైనా లేదా ఫోన్ పోయినా వెంటనే పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. ఐఎంఈఐ నంబర్ ఆధారంగా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి ఫోన్ తయారీ సంస్థ పేరు, మోడల్, ఫోన్ కొన్న బిల్లు, ఏ రోజు ఎక్కడ పోయిందో తదితర సమగ్ర వివరాలు నమోదు చేయాలి. ఫిర్యాదు వివరాలు కూడా ఎంటర్ చేయాలి. బాధితుడి వ్యక్తిగత వివరాలు, ప్రస్తుతం వినియోగించే కొత్త నంబరును నమోదు చేయాలి. కొట్టేసిన వ్యక్తి సిమ్ కార్డు వేయగానే పోలీసులకు తెలిసిపోతుంది. ఆ వివరాల ఆధారంగా ప్రాంతం, ఇతర సాంకేతిక అంశాల ఆధారంగా ఫోన్‌ను పోలీసులు రికవరీ చేస్తారు. ఫిర్యాదు పురోగతిని కూడా ఈ వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చు.

ప్రారంభానికి సిద్ధం







రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన అమరవీరుల స్మారక చిహ్నం ప్రారంభానికి ముస్తాబయ్యింది. గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ దీన్ని ఆవిష్కరించనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి,డీజీపీ అంజనీకుమార్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు ఏర్పాట్లను పరిశీలించారు. ఇందులో భాగంగా సాయుధ బలగాలు, పోలీస్ బ్యాండ్ బృందం రిహార్సల్స్ నిర్వహించాయి.

- సాక్షి, సిటీబ్యూరో



చలాన్లు కట్టమన్నారని..

వాహనానికి నిప్పు పెట్టేందుకు యువకుడి యత్నం

- బైక్‌పై 28 చలాన్లు.. రూ.9150 జరిమానా
- కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న బైక్

శంషాబాద్: ట్రాఫిక్ నింబంధనలను ఉల్లంఘిస్తూ తిరుగుతున్న ఓ వాహన దారుడిని ట్రాఫిక్ పోలీసులు ఆపి చల్లాన్‌లు కట్టమని చెప్పడంతో ఆగ్రహానికి లోనైన అతను వాహనానికి నిప్పు పెట్టేందుకు యత్నించిన సంఘటన శంషాబాద్‌లో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. స్థానిక కిషన్‌గూడ ఫ్లై ఓవర్ వద్ద మంగళవారం మధ్యాహ్నం ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో తొండుపల్లి వైపు నుంచి యాక్టీవాపై వస్తున్న ఫసీయుద్దీన్ ఆపారు. వాహనంపై మొత్తం 28 చలాన్లు ఉండగా మొత్తం రూ.9150 జరిమానా చెల్లించాల్సి ఉంది. జరిమానా చెల్లించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించడంతో ఆగ్రహానికి లోనైన అతను వెంటనే పెట్రోలు ట్యాంక్ తెరిచి అందులో అగ్గిపుల్ల వేశాడు. దీంతో అప్రమత్తమైన పోలీసులు మంటలను ఆర్పివేశారు. ట్రాఫిక్ పోలీసుల ఆధీనంలో ఉన్న వాహనాన్ని తగలబెట్టేందుకు ప్రయత్నించిన అతడిపై ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. వాహనంపై ట్రిబుల్ రైడింగ్, హెల్మెట్ లేకపోవడం, రాంగ్ రూట్ తదితర అనేక ఉల్లంఘనలు ఉన్నట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

పక్కకు జరగమన్నందుకు..

తల్వార్‌తో దాడి...



నిందితుడు మన్‌ప్రీత్‌సింగ్

అత్తాపూర్: దారికి అడ్డంగా ఉన్నావు పక్కకు జరుగు అన్నందుకు ఓ యువకుడు పలువురిపై తల్వార్‌తో దాడి చేసిన సంఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సిక్‌చావనీ నౌనెంబర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ మోహిద్ బాక్రీ చిరువ్యాపారి. సోమవారం రాత్రి అతను సమీపంలోని ఏటీఎంకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. దారికి అడ్డంగా ఉన్న మన్‌ప్రీత్‌సింగ్‌ను పక్కకు జరగమని చెప్పడంతో మద్యం మత్తులో ఉన్న మన్‌ప్రీత్‌సింగ్ తన వద్ద ఉన్న తల్వార్‌తో అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో మోహిద్ బాక్రీ కంటికి తీవ్ర గాయమైంది. అతడికి సర్ది చెప్పేందుకు వచ్చిన మోన్‌సైనీ, అఖిల్‌పై కూడా మన్ ప్రీత్ దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మన్‌ప్రీత్‌సింగ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాస్‌పోర్టులనే వీసాలుగా మార్చి..

- కెనడా విజిట్ వీసా పేరుతో ముగ్గురికి టోకరా
- రూ. 10 లక్షలు స్వాహా

హిమాయత్‌నగర్: వీసా కోసం పంపిన పాస్‌పోర్టుల పైనే వీసా స్టాంప్ గుద్ది ఇవే మీ కెనడా పాస్‌పోర్టులంటూ నగరానికి చెందిన ముగ్గురికి సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. కనీస అవగాహన లేని వారు వాటినే వీసాలుగా భావించి ప్రయాణానికి సైతం సిద్ధపడ్డారు.అయితే వీసా పంపిన వ్యక్తుల మాటల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో అనుమానం వచ్చి ఆస్ట్రేలియా ఎంబసీని సంప్రదించగా ఫేక్ వీసాలని చెప్పారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు మంగళవారం సిటీ సైబర్‌క్రైం ఏసీపీ కేవీఎం ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నగరంలోని ఓల్డ్ సిటీకి చెందిన ముగ్గురు యువకులు కెనడాలో ఉద్యోగాలు చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసుకున్నారు. ముందుగా విజిట్ వీసా కింద కెనడా వెళ్లి అక్కడ అన్నీ సమకూర్చుకున్నాక మరోసారి ఉద్యోగాల కోసం వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తక్కువ ఖర్చులో కెనడా వీసా ప్రాసెస్ చేసే వారిని సోషల్ మీడియా ద్వారా కాంటాక్ట్ అయ్యారు. ఒక్కొక్కరికీ రూ.3లక్షల చొప్పున ఖర్చు అవుతుందని, మొత్తంగా రూ.10లక్షలు ఇస్తే ప్యాకేజీ కింద విమానం టికెట్లు సైతం తామే ఇస్తామని నమ్మించారు. దీంతో వారు రూ.10లక్షలు చెల్లించడంతో వీసాలు ఇచ్చాడు. అయితే ఎయిర్ టికెట్‌లను రెండు పర్యాయాలు బుక్ చేసి క్యాన్సిల్ చేశాడు. ఇందులో ఏదో తిరకాసు ఉందని, తెలిసిన వారు చెప్పడంతో ఆస్ట్రేలియా ఎంబసీలో సంప్రదించారు. మీరు పంపిన పాస్‌పోర్టులపైన వీసా స్టాంప్ వేసి వీసాలంటూ ఇచ్చారని చెప్పడంతో బాధితులు తమకు న్యాయం చేయాలని సైబర్ క్రైంలో ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ తెలిపారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి



గాయపడిన అన్వికి

అల్వాల్: వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన అల్వాల్ బృందావన్ కాలనీలో మంగళవారం చోటు చేసుకుంది. కాలనీకి చెందిన చిన్నారి అన్విక(5) మంగళవారం ఆడుకుంటుండగా వీధి కుక్కలు దాడి చేశాయి.తీవ్రంగా గాయపడిన బాలికను కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నారాయణగూడలోని ఆసుపత్రికి తరలించారు.

ప్రేమ పేరుతో బాలికపై లైంగికదాడి

పంజగుట్ట: మైనర్ బాలికను ప్రేమపేరుతో లొంగదీసుకుని గర్భవతిని చేసిన వ్యక్తిపై పంజగుట్ట పోలీసులు పోక్సో చట్టం కింద కేసునమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఎం.ఎస్.మక్తాకు చెందిన బాలిక పంజగుట్ట, అమీర్‌పేట ప్రాంతాల్లో భిక్షాటన చేస్తూ బతికేది. 2021 నవంబర్‌లో అమీర్‌పేటకు చెందిన షెబాజ్ అనే యువకుడు బాలికను పరిచయం చేసుకున్నాడు. ప్రేమిస్తున్నానని నమ్మించి ఆమెను కాచిగూడ ఎక్స్‌రోడ్డులోని ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత పలుమార్లు అదే లాడ్జికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కొన్ని నెలలుగా షెబాజ్ కనిపించకుండా అదృశ్యమయ్యాడు. అప్పటికే బాలిక గర్భం దాల్చింది, ఇటీవల ఒక బిడ్డకు జన్మనిచ్చింది. పేదరికం, తల్లికి ఆరోగ్యం బాగాలేకపోవడం కారణంగా పోలీసులకు ఫిర్యాదు చేయని బాలిక సోమవారం రాత్రి పంజగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముత్తూట్ ఫైనాన్స్ పేరుతో ఫేక్ జాబ్ ఆఫర్ లెటర్లు

ఇద్దరి నుంచి రూ. 80 వేలు స్వాహా

హిమాయత్‌నగర్: 'ముత్తూట్ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో ఫేక్ జాబ్ ఆఫర్ లెటర్లు ఇచ్చి ఇద్దరు అమ్మాయిలను మోసం చేసినట్లు ముత్తూట్ సంస్థ గుర్తించింది. తమ సంస్థ పేరుపై ఈరకమైన మోసానికి పాల్పడ్డ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ జోనల్ హెచ్‌ఆర్ మేనేజర్ మనోజ్‌కుమార్ నారాయణగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సిటీకి చెందిన ప్రవళిక, జాహ్నవి అనే ఇద్దరు అమ్మాయిలు ఉద్యోగం కోసం గూగుల్లో సెర్చ్ చేశారు. భక్షీస్ సింగ్ అనే వ్యక్తి ఈ ఇద్దరి వాట్సాప్ ద్వారా పరిచయం చేసుకొని ముత్తూట్ ఫైనాన్స్‌లో ఉద్యోగమిస్తానని నమ్మించాడు. ఫైనాన్షియల్ ఎయిడ్ ఎగ్జిక్యూటివ్‌గా ప్రవళిక, ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్‌గా జాహ్నవికి జాబ్ ఆఫర్ లెటర్లు ఇచ్చాడు. ఇందుకుగాను సెక్యూరిటీ డిపాజిట్ కింద ఇద్దరి నుంచి రూ. 80 వేలు కాజేశాడు. ఆ ఆఫర్ లెటర్లతో హిమాయత్‌నగర్‌లోని ముత్తూట్‌కు వచ్చిన ఆ ఇద్దరూ షాక్‌కు గురయ్యారు. ఇవి తాము ఇచ్చిన జాబ్ లెటర్లు కాదంటూ ముత్తూట్ హెచ్‌ఆర్ టీం చెప్పారు. దీంతో తమ కంపెనీ పేరుపై మోసానికి పాల్పడుతున్న భక్షీస్ సింగ్ అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తరచూ వేధిస్తోందని..

భార్యను చంపేశాడు..



మృతురాలు బీనా (ఫైల్)



నిందితుడు లక్ష్మణ్

కంటోన్మెంట్: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య తరచూ వేధిస్తోందని ఆమెను హత్య చేసిన సంఘటన బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రవికుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సికింద్రాబాద్ నల్లగుట్ట ప్రాంతానికి చెందిన కుమ్మరి లక్ష్మణ్ బీనా (49) 29 ఏళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరికి సంతానం లేరు. లక్ష్మణ్ ప్రస్తుతం ఐడీపీఎల్ సమీపంలోని ఓ ప్రింటింగ్ ప్రెస్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. పెళ్లయినప్పటి నుంచి బీనా తరచూ లక్ష్మణ్‌తో గొడవపడుతూ ఉండేది. ఇంటి ఓనర్లతో సైతం తరచూ గొడవ పడుతుండటంతో అతను పలు మార్లు ఇళ్లు మారాల్సి వచ్చింది. కొంత కాలం క్రితం ఓల్డ్ బోయిన్‌పల్లిలోని ఫ్రెండ్స్ కాలనీకి మకాం మార్చారు. ఇటీవల వీరి మధ్య గొడవలు జరగడంతో బేగంపేటలోని మహిళా పోలీస్ స్టేషన్‌లో కౌన్సెలింగ్‌కు సైతం హాజరయ్యారు. ఈ నేపథ్యంలో భార్యపై కోపం పెంచుకున్న లక్ష్మణ్ మంగళవారం ఉదయం ఆమె మెడకు ఎలక్ట్రికల్ వైర్ బిగించి హత్య చేశాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు

క్లుప్తంగా...

ఏసీపీని కలిసిన పదోన్నతి పొందిన ఇన్‌స్పెక్టర్లు



పంజగుట్ట: సబ్ ఇన్‌స్పెక్టర్ల నుంచి ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన ముగ్గురు అధికారులు పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్‌ను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల పోలీస్‌శాఖలో ఇచ్చిన పదోన్నతుల్లో ఇన్‌స్పెక్టర్లుగా పదోన్నతి పొందిన రవీందర్, శ్రీనివాస్, విజయ్‌భాస్కర్‌రెడ్డిలు పంజగుట్ట ఏసీపీని కలిశారు. ఈ సందర్భంగా ఏసీపీ మోహన్ కుమార్ మాట్లాడుతూ... పదోన్నతులతో మరింత బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ, స్టేషన్‌కు వచ్చిన ప్రతి బాధితునికి న్యాయం జరిగేలా విధులు నిర్వహించాలని సూచించారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు అందించిన మల్లేష్

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణా దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని మంగళవారం నిర్వహించిన విద్యా దినోత్సవం కార్యక్రమం ఎర్రగడ్డ డివిజన్‌లోని ఓల్డ్‌సుల్తాన్ ప్రైమరీ స్కూల్‌లో దళితరత్న, బీఆర్‌ఎస్ సీనియర్ నేత గంట మల్లేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఉచితంగా స్కూల్ యూనిఫామ్స్, పుస్తకాలను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ఎమ్మెల్యే మాగంటి కృషితో నియోజకవర్గం సంక్షేమాభివృద్ధి సాధించిందని అన్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు శ్రీనివాస్, భారతి, బీఆర్‌ఎస్ నేత రొంపి ప్రభాకర్ పాల్గొన్నారు.

భక్తులకు మంచినీరు, జ్యూస్ పంపిణీ



భక్తులకు మంచినీరు, జ్యూస్, పాయసం అందజేస్తున్న అమిత్ అగర్వాల్

హిమాయత్‌నగర్: జగన్నాథ యాత్రలో పాల్గొన్న భక్తులకు తమదైన శైలిలో ఆతిథ్యాన్ని ఇచ్చారు 'నారాయణి జ్యూవెలర్స్' కుటుంబ సభ్యులు. ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో నిర్వహించిన 44వ శ్రీ జగన్నాథ యాత్రకు భక్తులు పోటెత్తారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి ప్రారంభమైన ఈ యాత్ర ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, చిక్కడపల్లి, నారాయణగూడ మీదుగా హిమాయత్‌నగర్ లిబర్టీకు చేరుకుని ఇక్కడ నుంచి జలవీహార్ వద్దకు చేరింది. యాత్రలో పాల్గొన్న భక్తులకు జ్యూవెలర్స్ అధినేత అమిత్ అగర్వాల్ తన కుటుంబ సభ్యులతో కలసి మంచినీళ్లు, జ్యూస్, పాయసం (ప్రసాదం)ను అందజేశారు. దాదాపు 5 వేల మందికి అమిత్ అగర్వాల్ ఇలా సేవ చేశారు.

మదర్ ఇండియా ఫౌండేషన్ సేవలు స్ఫూర్తిదాయకం

సినీ నటుడు సుమన్



లోగోను ఆవిష్కరిస్తున్న సినీ నటుడు సుమన్

బంజారాహిల్స్: మాతృమూర్తుల గొప్పతనాన్ని చాటేందుకు మదర్ ఇండియా ఫౌండేషన్‌ను స్థాపించడం గొప్ప విషయమని సినీ నటుడు సుమన్ అన్నారు. ఎరా క్లిక్స్ అధినేత నక్కా వెంకట్‌రావు స్థాపించిన మదర్ ఇండియా సంస్థ లోగోను మంగళవారం ప్రసాద్ ల్యాబ్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ... ప్రస్తుత కాలంలో గ్రామీణ ప్రాంతాల్లో మానవ సంబంధాలు బలంగానే ఉన్నప్పటికీ పట్టణ ప్రాంతాల్లో మాతం నానాటికీ దిగజారిపోతున్నాయని ఇంట్లో ఎవరికి ఎవరు సంబంధం లేని పరిస్థితులు దాపురించాయని అన్నారు. ఎరా క్లిక్స్ అధినేత, మదర్ ఇండియా ఫౌండేషన్ వ్యవస్థాకులు నక్కా వెంకట్రావు మాట్లాడుతూ... మదర్ ఇండియా ఫౌండేషన్‌ను ప్రపంచ వ్యాప్తంగా చేస్తామని తెలిపారు. సంస్థ ప్రతినిధులు పాండురంగారావు, ఆలూరి దస్తగిరి, పాషా, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పటిష్టంగా ఓటర్ల జాబితా

- ఈ నెల 23 వరకు తప్పొప్పుల సవరణకు అవకాశం
- ఇంటింటి సర్వే చేపట్టనున్న బీఎల్‌వోలు
- సహకరించాలంటున్న ఎన్నికల అధికారులు
- అక్టోబర్ 5న తుది జాబితా



బీఎల్‌వోల సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ రజనీకాంత్‌రెడ్డి

బంజారాహిల్స్: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఓటర్ల జాబితాపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకు సంబంధించిన ప్రత్యేక సమావేశం మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని జీహెచ్‌ఎంసీ సిటీ మేనేజర్స్ శిక్షణా కార్యాలయంలో ఖైరతాబాద్ నియోజకవర్గం ఎన్నికల అధికారి రజినీకాంత్‌రెడ్డి నేతృత్వంలో జరిగింది. బూత్ స్థాయిలో ప్రతి ఇంటిని బీఎల్‌వోలు పరిశీలించాలని తమతో తీసుకెళ్లే ఓటరు జాబితాలో ఆ ఇంట్లో ఓటర్లు ఉన్నారా లేదా సరిగ్గా తెలుసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. కుటుంబం మొత్తం ఒక పోలింగ్ కేంద్రంలోనే ఓట్లు ఉండేలా చూడాలని సూచించారు. ఓటర్ల జాబితా పూర్తయిన తర్వాత నాయకులు వచ్చి వాగ్వాదానికి దిగకముందే ఇప్పుడే బీఎల్‌వోలకు బూత్ స్థాయి కార్యకర్తలు సహకరిస్తే ఓట్ల గల్లంతు ఉండదని అధికారులు సూచిస్తున్నారు. ఎవరైనా ఓటర్లు మరణిస్తే తప్పనిసరిగా మరణ ధ్రువీకరణ పత్రం తీసుకొని కుటుంబ సభ్యుల సంతకాలు తీసుకొని ఫారం–7ను భర్తీ చేయాలని సూచించారు. ఇంటి నెంబర్లలో పొరపాటు ఉంటే ఫారం–8 ద్వారా తప్పొప్పులు సవరణ చేపట్టాలన్నారు. కొత్త ఓటర్లను నమోదు చేయాలని కూడా సూచించారు. ఆన్‌లైన్‌లో కొత్త ఓటరు నమోదుకోసం వచ్చే దరఖాస్తుల ప్రింట్లను బీఎల్‌వోలకు ఇచ్చి క్షేత్ర స్థాయిలో ఆ అడ్రస్ కరెక్టుగా ఉందా లేదా పరిశీలిస్తున్నారు.

> ఒక కుటుంబంలో ఉన్న ఓటర్లంతా ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఇందుకోసం ఈ నెల 23 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఇటీవల నిర్వహించిన సర్వేలో తేలిన అంశాల ఆధారంగా కేంద్ర ఎన్నికల సంఘం కసరత్తు ప్రారంభించింది.

అక్టోబర్ 5న తుది జాబితా...

ఓటరుగా నమోదైన ప్రతి వ్యక్తి ఇంటి నెంబర్ కచ్చితంగా ప్రస్తావించాలని సూచిస్తున్నారు. ఒకే పోలింగ్ కేంద్రం పరిధిలోకి వచ్చేలా ఆ ఇంటి నెంబర్‌తో ఉన్న ఓటర్లంతా ఓటరు జాబితా ద్వారా సిద్ధం చేస్తున్నారు. గతంలో ఒకే ఇంటి నెంబర్ నుంచి ఇద్దరు ఒక చోట, ఇద్దరు మరో చోట నమోదై ఉన్నారు. దీంతో చాలా మంది ఓటు వేసేందుకు విముఖత చూపించారు. పోలింగ్ శాతం పెంచేందుకు అధికారులు తాజా నిర్ణయం తీసుకున్నారు. ఈ నెల 23 వరకు సవరణలకు అవకాశం ఉంది. కొత్తపేర్ల నమోదు మరణించిన వారి పేర్ల తొలగింపు, ఇల్లు మారినా ఇంటి నెంబర్లు జోడింపు, అక్షర దోషాలు ఇలా సవరణలకు అవకాశం కల్పించారు. అక్టోబర్ 5న తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తారు.

ఖైరతాబాద్ ఓటర్లు...

ఖైరతాబాద్ నియోజకవర్గంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, హిమాయత్‌నగర్ డివిజన్లు ఉన్నాయి. 245 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 2,79,497 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 1,45,951 మంది పురుషులు కాగా, 1,33,523 మంది మహిళలు ఉన్నారు. 23 మంది ఇతరులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.

పారదర్శకంగా రూపకల్పన...

ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇందుకోసం ఎప్పటికప్పుడు బీఎల్‌వోలతో సమావేశాలు ఏర్పాటు చేయడం జరుగుతున్నది. బీఎల్‌వోలు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నారో లేదో పరిశీలిస్తున్నాం. ప్రత్యేక నిఘా కూడా పెట్టారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో 245 మంది బీఎల్‌వోలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడమే కాకుండా అవగాహన కూడా కల్పించాం. ఈ నెల 23 వరకు సవరణలకు అవకాశం ఉంది. ప్రతి ఒక్కరు సహకరించాలి. తమ ఓటరు జాబితాను తామే పారదర్శకంగా రూపొందించుకునేలా చూసుకోవాలి.

– రజినీకాంత్‌రెడ్డి, ఎన్నికల అధికారి, ఖైరతాబాద్ నియోజకవర్గం

తొలగించిన కస్తూర్బా టీచర్లను విధుల్లోకి తీసుకోవాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య



పాఠశాల ముట్టడి పాల్గొన్న ఆర్.కృష్ణయ్య తదితరులు

ఖైరతాబాద్: కస్తూర్బా పాఠశాలలో తొలగించిన 937 మంది టీచర్లను వెంటనే విధుల్లోకి తీసుకోవాలంటూ నిరుద్యోగ జాక్ చైర్మన్ నీల వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల విద్యాశాఖ కార్యాలయ ముట్టడి చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. రెండేళ్ల క్రితం కస్తూర్బా పాఠశాలల్లో 937 మంది టీచర్లను మెరిట్‌పై సెలక్ట్ చేసి, నియామకం చేసి కేజీబీవీలలో బోధకులుగా పనిచేస్తున్నారు. వీరికి రాతపూర్వక ఆదేశాలు ఇవ్వడం లేదు. మౌఖికంగా చెప్పి చేయించుకుంటున్నారు. మరలా మార్చిలో తొలగిస్తున్నారు. ఇలా ప్రతి సంవత్సరం మార్చిలో టర్మినేట్ చేసి మరలా ఆగస్టులో తీసుకుంటున్నారు. ప్రభుత్వం ఇటీవల కస్తూర్బా పాఠశాలలలో టీచర్స్‌గా పనిచేసేందుకు 1241 మంది కాంట్రాక్ట్ టీచర్ల రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ జారీ చేశారు. 2021లో కస్తూర్బా పాఠశాలల్లో పనిచేసేందుకు 937 మంది కాంట్రాక్ట్ టీచర్లను నియమించారు. వీరు రెండు సంవత్సరాలుగా పనిచేస్తున్నారని, వీరిని ఎలా తొలగిస్తారని ఆర్.కృష్ణయ్య ప్రశ్నించారు. కార్యక్రమంలో అనంతయ్య, వేముల రామకృష్ణ పాల్గొన్నారు.

ఉద్యమకారులపై కేసులు ఎత్తివేయకుండా ఉత్సవాలా?

ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్

పంజగుట్ట: తెలంగాణ ఉద్యమ కారులపై అప్పటి ప్రభుత్వం పెట్టిన కేసులు ఎత్తివేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలు చేయడం ఎంత వరకు సబబని ఉమ్మడి ఏపీ హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ప్రశ్నించారు. వారు గత తొమ్మిది సంవత్సరాలుగా ఇంకా కోర్టుల వెంట తిరుగుతుంటే, వారి త్యాగాల మీద పదవులు అనుభవిస్తున్న వారు సంబురాలు చేసుకోవడం ఎంతో బాధాకరమన్నారు. మంగళవారం పంజగుట్ట ద్వారకాపూరి కాలనీలోని తెలంగాణ ప్రజల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మురళీధర్‌గుప్తాతో కలిసి ఆయన మాట్లాడుతూ... ప్రజల హక్కుల కోసం పోరాటం చేయడం వేరు పార్టీ కోసం పోరాటం చేయడం వేరని తెలంగాణ వస్తే బతుకులు మారుతాయని ముందుడి పోరాడిన ఒక్కో యువకుడిపై 12, 15 వరకు కేసులు ఉన్నాయని వారు ఇంకా కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, కేసుల మూలంగా ఎంతో మంది ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులు అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 29వ తేదీలోపు వీరిపై కేసులు ఎత్తివేయకపోతే ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలను కలుపుకుపోయి పెద్ద ఎత్తున ఉద్యమానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు విజయలక్ష్మి, వర్కింగ్ ప్రెసిడెంట్ లైన్ శ్యాం సుందర్, శివారెడ్డి, సుదర్శన్, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన ప్రమాణాలు



ఫిలింనగర్ ఎమ్మార్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో నూతన బెంచీల్లో విద్యార్థులతో దానం

ఫిలింనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యాదినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మనబస్తీ–మన బడి పథకం కింద జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని ఎమ్మార్సీ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను అనేక వసతులు కల్పించి ప్రారంభించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో కలిసి పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అభివృద్ధి జరిగిందని విద్యా ప్రమాణాలు మరింత పెరిగాయని వెల్లడించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలని సూచించారు. అనభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉన్నారని విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాల అంటేనే భయపడే పరిస్థితి ఉండేదని ఇప్పుడు ఆ పరిస్థితి లేదని సీట్ల కోసం ఎమ్మెల్యే సిఫారసు చేయాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. నోడల్ అధికారి రజినీకాంత్‌రెడ్డి, డిప్యూటీ డీఈవో శామ్యూల్ రాజు, హెచ్‌ఎం భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యాభివృద్ధిలో తెలంగాణ ముందంజ



మాట్లాడుతున్న ప్రొఫెసర్ లింబాద్రి

బంజారాహిల్స్: ఉన్నత విద్యావ్యాప్తిలో తెలంగాణ జాతీయ సగటు కంటే ఎక్కువ శాతం మెరుగును నమోదు చేసిందని తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన లింబాద్రి మాట్లాడుతూ... ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తూ ప్రభుత్వం ముందుకు పోతున్నదన్నారు. త్వరలోనే యూనివర్సిటీల సమస్యల పరిష్కారానికి సీఎం కేసీఆర్ ముందుకు వస్తారన్నారు. ప్రభుత్వం ఇప్పటికే పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిందని కొన్ని పాలనాపరమైన అడ్డంకులు ఉన్నాయని త్వరలోనే పరిష్కారమవుతాయన్నారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 30 ఎస్సీ బాలికల హాస్టళ్లు, 22 గిరిజన హాస్టళ్లు, 33 బీసీ బాలికల హాస్టళ్లు ఏర్పాటు చేసిందని వీరంతా జాతీయ, అంతర్జాతీయ స్థాయి విద్యాలయాల్లో అడ్మిషన్లు పొందగలుగుతున్నారని ఇది ప్రభుత్వ ఘనత అని అన్నారు. జాతీయ స్థాయిలో సగటు ఉన్నత విద్యను అభ్యసించేవారి సంఖ్య 27.3 శాతం ఉండగా తెలంగాణలో సగటు కంటే చాలా ఎక్కువ 39 శాతం ఉందని ఉన్నత విద్యా వ్యాప్తికి తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషికి ఇది నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సిలర్ సీతారామారావు, అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ ఏవీఆర్‌ఎన్.రెడ్డి, డాక్టర్ ఎల్‌వీకే.రెడ్డి, ప్రొఫెసర్ వడ్డాణం శ్రీనివాస్, ప్రొఫెసర్ గుంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కుల వృత్తులకు ప్రోత్సాహం: వకుళాభరణం

పంజగుట్ట: వృత్తి కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయం ఆరంభం మాత్రమే అని.. మున్ముందు ఒక్కో కులం ఎంచుకుని ప్రణాళికాబద్ధంగా వారి అభివృద్ధికి కృషి చేస్తామని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ అన్నారు. తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి ఆధ్వర్యంలో మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రూ. లక్ష ఆర్థిక చేయూతకు కృతజ్ఞతగా వృత్తి కులాల ఎంబీసీ కులాల ప్రతినిధుల అభినందన, ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఫెడరేషన్ అధ్యక్షులు బెల్లాపు దుర్గారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వకుళాభరణం కృష్ణమోహన్, సభ్యులు సీ.హెచ్ ఉపేందర్, కె.కిషోర్ గౌడ్, బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు కుమారస్వామిలు హాజరై మాట్లాడారు. వివిధ కుల సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దరఖాస్తు చేసుకునేందుకు గడువు పెంచాలన్నారు. ఈ సమావేశంలో బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీర్తి యుగంధర్, అధికార ప్రతినిధి భాస్కరుడు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వివిధ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు



బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వెంగళరావునగర్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన వివిధ రకాల కాంపిటీషన్స్‌లో సాయిసరస్వతి విద్యానికేతన్ చిన్నారులు బహుమతులు సాధించడం అభినందనీయమని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అనూరాధ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో కేబీఆర్ పార్కులో మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన తదితర పోటీలు నిర్వహించారు. వివిధ తరగతుల వారీగా జరిగిన చిత్రలేఖనం పోటీల్లో వైష్ణవి (సెకండ్ ప్రైజ్), దీక్షిత, మేఘన, మాధురీ (థర్డ్ ప్రైజ్), వ్యాసరచన పోటీల్లో వెరోనిక, గగన, శ్రీనిత్యలు ప్రథమ బహుమతులు, జయశ్రీ, సాక్షిత ద్వితీయ బహుతులు, శశాంక్ తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ వ్యవస్థాపకులు శిరీష భవానీశంకర్ తదితర టీచర్లు విద్యార్థులను అభినందించారు.

పెళ్లిచేసుకోవాలంటూ యువతిని వేధిస్తున్న యువకుడిపై ఫిర్యాదు

వెంగళరావునగర్: ఓ యువతిని పెళ్లి చేసుకోమంటూ వేధిస్తున్న యువకుడిపై మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... మేడిపల్లి సమీపంలోని నివసిస్తున్న యువతి(32) అక్కడే ఓ ప్రైవేటు కంపెనీలో పని చేసుకుంటూ జీవిస్తుంది. అదే కంపెనీలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న సిద్దయ్య అనే యువకుడితో స్నేహం ఏర్పడింది. కొద్దికాలంలోనే స్నేహం పెరిగి ప్రేమకు చేరింది. అతను పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి శారీరకంగా ఆమెను కలిశాడు. పెళ్లి చేసుకోమని ఆమె నిలదీయడంతో ముఖం చాటేశాడు. బాధితురాలు 2022లో మేడిపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు అతనిని పట్టుకుని కోర్టుకు అప్పగించగా జైలుకు కూడా వెళ్లాడు. జైలుకు వెళ్లి వచ్చినా కూడా అతని ప్రవర్తలో మార్పు కనిపించలేదు. తిరిగి ఆ యువతిని వేధించడం ప్రారంభించాడు. అతని వేధింపులు తట్టుకోలేక యువతి వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని మధురానగర్‌కాలనీలో ఓ హాస్టల్‌లో ఉంటుంది. అడ్రస్ తెలుసుకున్న సిద్దయ్య ఇక్కడకు కూడా వచ్చి వేధించడం ప్రారంభించాడు. అతని వేధింపులు తట్టుకోలేక ఆమె మధురానగర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఐపీసీ సెక్షన్ 354 (డి) కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చీరకట్టులోనే మగువల అసలైన అందం



శ్రీనగర్‌కాలనీ: చీరకట్టులోనే మగువల అసలైన అందందాగి ఉందని, ఇక్కడి చీరలు చాలా ఆకర్షణీయంగా ఉన్నాయని ప్రముఖనటి ఇందు కుసుమ అన్నారు. శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో మంగళవారం క్రాఫ్ట్ అండ్ వీవర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ఆధ్వర్యంలో వీవ్స్ ఆఫ్ ఇండియా–2023 పేరిట ఏర్పాటు చేసిన చేనేత వస్త్రప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ ప్రదర్శనలోని చీరలు నగర ఫ్యాషన్ ప్రియులను ఆకట్టుకుంటుందని, చేనేతకారులను ప్రతిఒక్కరూ ప్రోత్సహించాలన్నారు. దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేతకళకారులు వారి ఉత్పత్తులైన సిల్క్, కాటన్, డిజైనరీ ఆభరణాలు, పలు ఫ్యాన్సీవస్తువులను సుమారు 60స్టాల్స్‌లో అందుబాటులో ఉంచారు. చేనేత కళాకారుల ఉత్పత్తులు నేరుగా వినియోగదారులకు చేరాలనే ఉద్దేశంతో ఈ వస్త్ర ప్రదర్శనను ఏర్పాటుచేశామని, ఈనెల 25 వరకూ కొనసాగుతుందని నిర్వాహకులు జయేష్‌గుప్తా తెలిపారు.

బాలిక అదృశ్యం

బంజారాహిల్స్: అనుమానాస్పద స్థితిలో ఓ బాలిక అదృశ్యమైన ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని ఓల్డ్ వెంకటేశ్వరనగర్ బస్తీలో నివసించే జి.అనుమోల్(14) 2020లో కేరళలో చదువుకునేందుకు వెళ్లింది. ఇక్కడికి వచ్చిన తర్వాత కొద్ది రోజులు బాగానే ఉన్న అనుమోల్ ఈ నెల 19వ తేదీన సాయంత్రం ఇంట్లో చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. అలమారాలో నుంచి రూ. వెయ్యి తీసుకొని వెళ్లిందని, కేరళలో ఉన్నప్పుడు నెమాల్ అనే యువకుడితో పరిచయం ఉండేదిన అక్కడికే వెళ్లి ఉంటుందనే అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలు తల్లి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పెళ్లి పేరుతో వివాహితను మోసగించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్: ప్రేమిస్తున్నానని వివాహితను లోబర్చుకొని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అత్యాచారానికి పాల్పడిన నిందితుడిపై బంజారాహిల్స్ పోలీసులు క్రిమినల్ కేసు నమోదు చేశారు. వివరాలివీ... అత్తాపూర్‌లో నివసించే మహిళ(44) కంట్రీక్లబ్‌లో పని చేస్తున్న సందర్భంలో మియాపూర్‌కు చెందిన వి.ప్రవీణ్‌కుమార్‌గౌడ్(53)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరూ ఫోన్ నెంబర్లు మార్చుకున్నారు తరచూ మాట్లాడుకునేవారు. పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో 2010లో ఇద్దరూ సహజీవనం చేశారు. కూకట్‌పల్లిలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడగా తాను గర్భందాల్చానని బలవంతంగా గర్భస్రావం చేయించాడని పెళ్లి చేసుకోవాలని ఎన్నిసార్లు అడిగినా దాటవేస్తూ వస్తున్నాడని బాధితురాలు బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదు చేసింది. మూడు రోజుల క్రితం బంజారాహిల్స్‌లోని కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఆమెను ఓదార్చి తీసుకెళ్లిన ప్రవీణ్‌కుమార్‌గౌడ్ కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఓ టిఫిన్ సెంటర్ వద్ద మళ్లీ తీవ్రంగా గొడవపడ్డాడు. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ప్రేమ పేరుతో మోసంచేయడమే కాకుండా పెళ్లి మాట ఎత్తేసరికి ముఖం చాటేసిన నిందితుడిపై చర్యలు తీసుకోవాలంటూ కోరింది. నిందితుడిపై ఐపీసీ సెక్షన్ 417, 420 కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన బంజారాహిల్స్ పోలీసులు కేసును రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు.

దేశానికే ఆదర్శం పేద విద్యార్థులకు ఓవర్సీస్ పథకం

వెంగళరావునగర్: దేశంలో ఎక్కడాలేని విధంగా పేద విద్యార్థులకు సీఎం కేసీఆర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని విదేశీ విద్య కోసం తీసుకొచ్చారని బీఆర్‌ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యాదినోత్సవాన్ని వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాగంటి మాట్లాడుతూ... జవహర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలకు రూ. 50 లక్షలు మంజూరు చేశామన్నారు. జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 ఉప కమిషనర్ ఎ.రమేష్, డీఐఓఎస్ రామలింగం, హైస్కూల్, ప్రైమరీ స్కూల్స్ హెచ్‌ఎంలు పరమేశ్వరమ్మ, ఇందిరా, కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్, సి.ఎన్.రెడ్డి, టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, సంజీవ, సంతోష్, కృష్ణమోహన్, పవన్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల పక్షపాతి



చెక్కులు అందజేస్తున్న మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్(బోరబండ): బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదింటి ఆడపడచులకు అండగా ఉంటుందని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. బోరబండ డివిజన్‌కు మంజూరు అయిన 38 షాదీముబారక్, కల్యాణలక్ష్మీ పథకాల చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం తెలంగాణలో ఈ పథకం అమలు చేసిన ఘనత సీఎం కేసీఆర్ మాత్రమే దక్కుతుందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఇన్‌చార్జ్ సిరాజ్, కో ఆర్డినేటర్ విజయసింహ, విజయ్‌కుమార్ ధర్మ, దేవమణి, సర్దార్, పద్మ, యూసుఫ్, గౌస్, ఖైరతాబాద్ మండల స్పెషల్ ఆర్‌ఐ కిరణ్ పాల్గొన్నారు.

గతి స్కూల్‌లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు ప్రారంభం



క్లాస్‌రూమ్‌లు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నేత కె.విప్లవ్‌కుమార్, స్థానిక కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి డిజిటల్ క్లాస్ రూమ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరిగిందని నాణ్యమైన విద్యను అందిస్తున్నామని సకల సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.



బడి చూడండి.. పిల్లల్ని పంపండి

బొట్టుపెట్టి ఉపాధ్యాయుల ప్రచారం

ఇంటింటికీ ఉపాధ్యాయులు తిరుగుతున్నారు. బొట్టుపెట్టి మరీ పిల్లలను పంపించండని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదేం పెళ్లి కాదు.. పేరంటం కాదు.. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతున్నారు. 'మీ పిల్లలను మా బడికి పంపండి.. ఓ సారి మా బడిని చూడండి' అంటూ మహిళలకు ఉపాధ్యాయినులు, పురుషులకు ఉపాధ్యాయులు బొట్టు పెట్టి పిలుస్తున్నారు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం మల్లంపల్లిలో బడిబాటను మంగళవారం వినూత్న రీతిలో నిర్వహించారు. వీరి పిలుపునకు గ్రామస్తుల నుంచి మంచి స్పందన వస్తోంది. – దుగ్గొండి

హూ... హా!

మంత్రి పువ్వాడ కరాటే విన్యాసాలు



విద్యాదినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని రోటరీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో కరాటే విద్యార్థినితో సరదాగా రవాణాశాఖ మంత్రి పువ్వాడ కరాటే విన్యాసాలు చేయడం ఆకట్టుకుంది. పాఠశాలలో అభివృద్ధి పనులను మంత్రి పువ్వాడ మంగళవారం ప్రారంభించారు. కలెక్టర్ వీపీ గౌతమ్ తదితరులతో కలిసి వచ్చిన ఆయన ప్రారంభోత్సవం తర్వాత మాట్లాడారు. ఈ సందర్భంగా ఒకటో తరగతి చదువుతున్న గ్రేసీ తాను కరాటేలో శిక్షణ తీసుకుంటున్నానంటూ మంత్రి ఎదుట కొన్ని విన్యాసాలు ప్రదర్శించింది. దీంతో మంత్రి సైతం హూ...హా.. అంటూ సరదాగా బాలికను ప్రోత్సహించారు. – ఖమ్మం అర్బన్

సూగూర్‌లో నయా 'విష్ణుమూర్తి' అవతారం



విష్ణుమూర్తి వేషంలో రంగనాథం (ఫైల్)

గద్వాల రూరల్/పెబ్బేరు: ఒకపక్క సైన్స్ దినదినాభివృద్ధి చెందుతుంటే.. మరోవైపు దొంగస్వాములు చెలరేగిపోతున్నారు. మూడురోజుల క్రితం తమిళనాడుకు చెందిన రంగనాథం అనే వ్యక్తి స్వామిగా వేషం వేసి జోగుళాంబ గద్వాల జిల్లా కేటీదొడ్డి మండలం ఉమిత్యాలకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఇంట్లో ఆశ్రయం పొందాడు. ఆరోగ్యం బాగుచేస్తానంటూ, దేవుడే స్వయంగా కలలోకి వచ్చి చెప్పడంతో ఇక్కడికి వచ్చానని నమ్మించే ప్రయత్నం చేశాడు. ఆదివారం ఆయన కోసం భక్తులు భారీగా తరలిరావడంతో దొంగస్వామిని అదుపులోకి తీసుకున్న పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించి వేశారు. అయితే ఈ దొంగస్వామి వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం సూగూరులో ఏడాదిగా అద్దె ఇంట్లో ఉంటున్నట్లు తాజాగా తెలిసింది. గ్రామంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటూ స్థానిక ఆలయంలో పూజలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే ఆలయానికి వస్తున్న భక్తుల సమస్యలు పరిష్కరిస్తానని నమ్మబలికి వింత పనులు చేయించేవాడు. గ్రామ పెద్దలు గమనించి హెచ్చరించడంతో కేటీదొడ్డి శివారులో చెట్టుకింద బాబాగా అవతారమెత్తినట్లు వెలుగులోకి వచ్చింది.

క్లుప్తంగా...

23 మార్గదర్శి చిట్ గ్రూపులు రద్దు

నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలడంతో ఏపీ రిజిస్ట్రేషన్లశాఖ చర్యలు

సాక్షి, అమరావతి: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీలో తవ్వినకొద్దీ అక్రమాలు బయటపడుతున్నాయి. తాజాగా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్లు, ఆడిటర్లు పలు బ్రాంచిల్లో నిర్వహించిన తనిఖీల్లో.. మార్గదర్శి చిట్‌ఫండ్ కంపెనీ నిబంధనలు ఉల్లంఘించడంతోపాటు చందాదారుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించినట్లు తేలింది. దీంతో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఆ కంపెనీకి చెందిన 23 చిట్ గ్రూపులను స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ రద్దుచేసింది. అనంతపురం బ్రాంచిలో రెండు, అరండల్‌పేటలో 1,నరసరావుపేటలో 3, రాజమహేంద్రవరంలో 2, తణుకులో 1, విశాఖ డాబా గార్డెన్స్, కూర్మన్నపాలేల్లో ఒక్కొక్కటి, విశాఖ ఎన్‌ఏడీ బ్రాంచిలో రెండు, విశాఖ సీతంపేట బ్రాంచిలో 10 చిట్ గ్రూపులు రద్దయ్యాయి. ఈ చిట్ గ్రూపులు రూ.25 లక్షల నుంచి రూ.కోటి వరకు ఉన్నాయి.

నేడు యాదాద్రిలో ధూప, దీప నైవేద్య పథకం ప్రారంభం

యాదగిరిగుట్ట: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆధ్యాత్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లా ధూప, దీప నైవేద్య పథకాన్ని ప్రారంభించనున్నట్లు ఈవో గీతారెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో నూతన అన్నదాన సత్ర భవనం ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు.

ఏకపక్షంగా పీడీ చట్టం

• ప్రభుత్వ తీరుపై హైకోర్టు ఆగ్రహం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముందస్తు నిర్బంధ(పీడీ) చట్టాన్ని అధికారులు ఏకపక్షంగా వినియోగిస్తున్నారని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలిగించడమే అవుతుందని వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు చెప్పినా పట్టింపు లేనట్లు వ్యవహరించడాన్ని తప్పుబట్టింది. భూ వివాదానికి సంబంధించి అబ్దుల్ నవాజ్, అబ్దుల్ అహ్మద్, షేక్ ఆసీమ్, మహ్మద్ రహమత్‌లపై మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జారీ చేసిన పీడీ చట్టాన్ని ప్రభుత్వం ధ్రువీకరించడం సరికాదని పేర్కొంది. ఈ నలుగురిపై ఇతర కేసులేవీ లేకుంటే విడుదల చేయాలని ఆదేశించింది. భూ వివాదంలో పీడీ చట్టాన్ని నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ బాధితులు నలుగురి కుటుంబ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ లక్ష్మణ్, జస్టిస్ శ్రీసుధ ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున బి.మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. నలుగురు జైలులో ఉండగా పీడీ చట్టం ప్రయోగించడం చెల్లదని వాదించారు. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని ప్రభుత్వ న్యాయవాది ముజీబ్‌కుమార్ వాదించారు. వాదనలు విన్న ధర్మాసనం.. తెలంగాణలో పీడీ చట్టం వినియోగాన్ని గతంలో సుప్రీంకోర్టు తప్పుబట్టిన విషయాన్ని ప్రస్తావించింది. నేర స్వభావం, తీవ్రత, ప్రజాశాంతికి భంగం కలిగిస్తుందా? లేదా? అన్న విషయాలను పరిగణనలోకి తీసుకోవాలి తప్ప.. యాంత్రికంగా అమలు చేయరాదని స్పష్టం చేసింది.

ఆ 3,500 గజాల భూమి ప్రైవేట్ వ్యక్తులదే: హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: అత్యంత ఖరీదైన బేగంపేటలోని 3,500 చదరపు గజాల భూమి విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆ భూమి సర్వే నంబర్ 214పై హక్కులున్న డాక్టర్ చంద్రరేఖ, ఇతరులదేనని తేల్చిచెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రొటోకాల్ విభాగానికి చెందిన గ్రీన్‌ల్యాండ్ అతిథి గృహం అధికారులు ఈ భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించడాన్ని సవాల్ చేస్తూ చంద్రరేఖ, మరో వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ మాధవీదేవి ధర్మాసనం విచారణ చేపట్టింది. గతంలో ఈ భూమి విషయంలో ధర్మాసనం యథాతథస్థితి విధిస్తూ మధ్యంతర ఆదేశాలిచ్చిన విషయం తెలిసిందే. తుది ఉత్తర్వులు వెల్లడించే వరకు ఈ ఆదేశాలు కొనసాగుతాయని పేర్కొంది. అయితే..ఈ భూమి ప్రభుత్వానిది అనేందుకు ఎలాంటి ఆధారాలు సమర్పించలేక పోయిందని..ఈ భూమి పూర్వీకుల ద్వారా చంద్రరేఖ, ఇతరులకే సంక్రమిస్తుందని తుది ఉత్తర్వులు వెల్లడించింది.

తొక్కతీస్తా.. నార తీస్తా.. ఏమిటీ భాష?

ఎమ్మెల్యే ద్వారంపూడిని దూషించేందుకు మీ సమయాన్ని వృథా చేయొద్దు

జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌కు కాపునేత ముద్రగడ లేఖ



సాక్షి ప్రతినిధి, కాకినాడ: జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ ఒకపక్క టీడీపీ, బీజేపీతో కలిసి పోటీ చేస్తానంటూ మరో పక్క తనను ముఖ్యమంత్రిని చేయాలని కోరడం హాస్యాస్పదంగా ఉందని కాపు ఉద్యమ నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం వ్యాఖ్యానించారు. కలసి పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయమని ఎలా అడుగుతున్నారో అర్థం కావడం లేదన్నారు. పవన్ 175 స్థానాల్లో పోటీ చేస్తే ముఖ్యమంత్రిని చేయాలని కోరడం తప్పు కాదన్నారు. ఓ పార్టీని స్థాపించాక పదిమంది ప్రేమను పొందాలేగానీ వీధి రౌడీ భాషలో మాట్లాడటం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఈ మేరకు పవన్‌ను ఉద్దేశించి రాసిన లేఖను ముద్రగడ మంగళవారం మీడియాకు విడుదల చేశారు. పవన్ కళ్యాణ్ అనుసరిస్తున్న తీరు, ప్రజాప్రతినిధులపై ఉపయోగిస్తున్న పరుష పదజాలాన్ని లేఖలో ముద్రగడ తీవ్రంగా తప్పుబట్టారు. 'ఈ లేఖ రాసినందుకు మీకు ఎక్కడా లేని కోపం రావచ్చు. మీ కోట్లాది మంది అభిమానులు నన్ను తుదిముట్టించే ప్రయత్నం చేయవచ్చు. అయినప్పటికీ నిజాన్ని నిర్భయంగా రాయక తప్పడం లేదు' అని అందులో పేర్కొన్నారు.

రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు

కులాన్ని అడ్డం పెట్టుకుని నేను నాయకుడిగా ఎదగలేదు. కులాన్ని అడ్డు పెట్టుకుని ఎప్పుడూ ఏ పదవీ పొందలేదు. యువతను వాడుకుని భావోద్వేగాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగ్గంపేట సభలో రిజర్వేషన్ల అంశం తన చేతిలో ఉండదని, అది కేంద్రం పరిధిలో ఉందని అన్నప్పుడు నేను ఇచ్చిన సమాధానం ఏమిటో పవన్ ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. పిల్లి సుభాష్ చంద్రబోస్, బొత్స సత్యన్నారాయణలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయమని కోరా. నేను కోట్లాది రూపాయల కోసం, సూట్‌కేసులకు అమ్ముడు పోవడానికి ఉద్యమం చేయలేదు. నాకంటే చాలా బలవంతుడైన పవన్ నేను వదిలేసిన ఉద్యమాన్ని చేపట్టి కాపు యువతకు రిజర్వేషన్ ఫలాలను ఎందుకు సాధించలేదో చెప్పాలి. పవన్‌కు రాజకీయ సలహాలు ఎవరిస్తున్నారో నాకు తెలియదు. ఆయన మాట్లాడే భాష వల్ల నష్టమేగానీ లాభం ఏమాత్రం ఉండదు. 'తొక్క తీస్తా.. నార తీస్తా.. కింద కూర్చోబెడతా.. చెప్పుతో కొడతా.. గుండు గీయిస్తా..!' లాంటి వ్యాఖ్యలు పదేపదే చేస్తున్నారు. ఇప్పటివరకూ ఎంతమందిని అలా చేశారో ఆయనే చెప్పాలి. పవన్ గతంలో నావద్దకు రాయబారులను పంపిస్తే ప్రత్యేక హోదా, రైల్వే జోన్, విశాఖ ఉక్కు, కడప స్టీల్ ప్లాంట్ తదితర సమస్యలపై పోరాడాలని సూచించా. పవన్‌కు నిజంగా రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఈ సమస్యలపై యుద్ధం చేయాలి. అంతేకానీ నాలాంటి అనాథలపై కాదు.

కాపు ఉద్యమానికి ద్వారంపూడి కుటుంబం సహకారం


కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆయన తండ్రి భాస్కరరెడ్డి, తాత కృష్ణారెడ్డి తప్పుడు మార్గాల్లో సంపాదించారన్న పవన్ ఆరోపణల్లో ఏమాత్రం నిజం లేదు. ఆ కుటుంబంతో నాకు ఎన్నో ఏళ్ల అనుబంధం ఉంది. ఎప్పుడూ ఎక్కడికీ వెళ్లని కృష్ణారెడ్డి మాఇంట్లో శుభకార్యాలకు వచ్చి దీవించేవారు. 1984లో ఎన్టీఆర్ ప్రభుత్వంలో మంత్రి పదవిని నేను తీసుకోకపోవడంతో కృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి ఉదయం 6 గంటలకు కిర్లంపూడి వచ్చి రెండు గంటలు నచ్చజెప్పారు. మంత్రి పదవి స్వీకరించి పది మందికి సహాయపడాలని ద్వారంపూడి కుటుంబం నాకు సలహా ఇచ్చింది. అలాంటి కుటుంబాన్ని దూషించేందుకు పవన్ తన విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దు. 1988లో విజయవాడ కాపునాడు సభకు సుమారు 100 లారీలను ఆ కుటుంబమే సమకూర్చింది. 1993 – 94 కాపు ఉద్యమ సమయంలో కోట్ల విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పోస్టర్లు ముద్రించేందుకు మావద్ద రూ.50 కూడా లేని సమయంలో రూ.50 వేలతో పోస్టర్లు సిద్ధం చేసిన కుటుంబం ద్వారంపూడిదే. కాపు ఉద్యమాలకు సహాయం చేసిన వారిని విమర్శించడం పవన్‌కు తగదు. పవన్ ఆరోపణలు నిజమైతే కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిపై పోటీచేసి గెలుపొంది సత్తా చాటుకోవాలి. కాపు ఉద్యమాల్లో పాల్గొనని పవన్ తరచూ కాపులు పెద్దన్న పాత్ర పోషించాలనడం విడ్డూరం.

ముడుమాల్ నిలువురాళ్లపై అధ్యయనం

• డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో రాష్ట్ర వారసత్వ శాఖ ఒప్పందం
• వారసత్వ హోదాకు యునెస్కోకు దరఖాస్తు • నేటి నుంచి అధ్యయనం షురూ



ఒప్పందం పత్రాలు అందజేస్తున్న శ్రీనివాసగౌడ్



నక్షత్రాల వరుసను పోలిన...

సాక్షి, హైదరాబాద్: దాదాపు నాలుగు వేల ఏళ్ల క్రితం ఆది మానవులు ఏర్పాటు చేసిన నిలువురాళ్ల(మెన్హిర్స్)పై అంతర్జాతీయ స్థాయిలో అధ్యయనం జరగబోతోంది. నారాయణపేట జిల్లాలోని ముడుమాల్‌లో దాదాపు 80 ఎకరాల విస్తీర్ణంలో వేల సంఖ్యలో నిలువు రాళ్లు ఉన్నాయి. ఇందులో కొన్ని 20 అడుగుల ఎత్తుతో ఉన్నాయి. పొడవాటి పెద్ద శిలలు దాదాపు 80 వరకు ఉండగా, చిన్నవి మూడు వేల వరకు ఉన్నాయి. ఇవి క్రీ.పూ.2 వేల ఏళ్ల కంటే పాతవని చరిత్ర పరిశోధకులు అభిప్రాయం. యునెస్కో గుర్తింపు పొందిన లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్‌కు ఏ మాత్రం తీసిపోని రీతిలో ముడుమాల్ నిలువు రాళ్లకు ప్రాధాన్యం ఉన్నప్పటికీ ఇంతకాలం తీవ్ర నిర్లక్ష్యం జరుగుతూ వచ్చింది. ఇన్నేళ్లకు వాటి ప్రత్యేకతలపై ఆధునిక పద్ధతిలో అధ్యయనం, డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు. చాలా రాళ్లు ఒంగిపోగా, కొన్ని కూలిపోయాయి. గతంలో అవి ఎలా ఉండేవో గుర్తించి వాటిని సరిచేసి ఆ ప్రాంతాన్ని రక్షిత ప్రాంతంగా గుర్తించి పరిరక్షించేందుకు ఎట్టకేలకు తెలంగాణ వారసత్వ శాఖ సిద్ధమైంది. ఆ మేరకు డెక్కన్ హెరిటేజ్ అకాడమీ ట్రస్టుతో ఆ శాఖ ఒప్పందం కుదుర్చుకుంది. కొద్ది రోజుల క్రితమే ఆ ఒప్పందం జరగ్గా, మంగళవారం అందుకు సంబంధించిన పత్రాలను మంత్రి శ్రీనివాసగౌడ్ అందజేశారు.

ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్

ట్రస్టు చైర్మన్ వేదకుమార్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.పుల్లారావు, , ఏఎస్‌ఐ విశ్రాంత అధికారులు బాబ్జీరావు, తాహెర్, కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ హరగోపాల్, మొయినాబాద్‌లోని జేబీఆర్ ఆర్కిటెక్ట్ కాలేజీ స్కాలర్లు తదితరులు ఈ ప్రాంతంపై ఏడాది కాలంపాటు అధ్యయనం, ఆధునిక పద్ధతుల్లో డాక్యుమెంటేషన్ చేయబోతున్నారు.

ఆదిమానవుల కాలంలో మృతి చెందిన ప్రముఖుల సమాధి వద్ద నిలువురాళ్లకు స్మారకంగా పాతడం ఆనవాయితీ. వాటని మెన్హిర్స్ అంటారు. ముడుమాల్‌లోని నిలువురాళ్లు కూడా అలాంటి స్మారక శిలలే. అయితే వాటిని ఒకేచోట ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయటం ద్వారా అప్పట్లో ఖగోళ పరిశోధనశాలగా వినియోగించారని పరిశోధకులు గతంలో గుర్తించారు. సూర్యుడు గమనం వల్ల ఆ రాళ్ల నీడల్లో వచ్చే మార్పుల ఆధారంగా వాతావరణాన్ని అంచనా వేసేవారని, అక్కడి ఓ రాతిపై సప్తర్షి మండలం (ఉర్సా మేజర్)గా పేర్కొనే నక్షత్రాల వరసను పోలి ఉండటాన్ని గతంలో పరిశోధకులు గుర్తించారు. లండన్ సమీపంలోని స్టోన్ హెంజ్ వద్దకూడా అలాంటి ఏర్పాటే ఉండటం విశేషం. ఇప్పుడు లోతైన అధ్యయనం ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోనున్నారు. ఈమేరకు మంగళవారమే వేదకుమార్, కేపీఆర్ తదితరులు పరిశోధనల కోసం ముడుమాల్ వెళ్లారు.

నేడు అతి తాపపు రోజు కావడంతో

జూన్ 21 వేసవి అతి తాపపు రోజు. ఆ రోజు సూర్యుడి గమనంలో మార్పు వస్తుంది. ఇది పరిశోధనలకు మరింత అనుకూలంగా ఉంటుందన్న ఉద్దేశంతో వెంటనే పని ప్రారంభించినట్టు పరిశోధకులు పేర్కొంటున్నారు. భవిష్యత్తులో దీని ప్రత్యేకతలు మరిన్ని వెలుగులోకి వస్తే, దాని ఆధారంగా ఈ ప్రాంతాన్ని ప్రపంచ వారసత్వ హోదా గుర్తింపు కోసం యునెస్కోకు దరఖాస్తు చేయనున్నారు.

ఖాతాదారుల హక్కుల పరిరక్షణకే 'మార్గదర్శి'పై దర్యాప్తు

ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్



సాక్షి, హైదరాబాద్: మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఖాతాదారుల హక్కుల పరిరక్షణ, ఆర్థిక భద్రత కోసమే ఆ సంస్థలో అక్రమాలను వెలుగులోకి తెస్తున్నామని, అది తమ బాధ్యత అని ఏపీ సీఐడీ అదనపు డీజీ సంజయ్ స్పష్టం చేశారు. మార్గదర్శి యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా నిధులు మళ్లిస్తుండటంతో ఖాతాదారులకు నష్టం కలగకుండా ఇప్పటికే రూ.1,035 కోట్ల విలువైన ఫిక్స్‌డ్ డిపాజిట్లు, మ్యూచ్‌వల్ ఫండ్స్ పెట్టుబడులను అటాచ్ చేసినట్టు తెలిపారు. మార్గదర్శి కంపెనీ ఏ కారణంగానైనా మూతపడితే ఖాతాదారులకు డబ్బులు ఇవ్వాల్సిన బాధ్యత స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీపై ఉంటుందని తెలిపారు. మార్గదర్శి సంస్థ ప్రతి చట్టాన్ని, నిబంధనను అతిక్రమించిందని, ఇంకా అతిక్రమిస్తూనే ఉందని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న 9 బ్రాంచ్‌లలో 23 గ్రూప్ చిట్స్‌ను, వాటికి సంబంధించి రూ. 604 కోట్ల టర్నోవర్ నిలిపివేసినట్టు చెప్పారు. ఇదే తరహాలో ఏపీ, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులోని ఇతర బ్రాంచ్‌ల్లోనూ అక్రమాలపై ఆధారాలు లభిస్తే.. వాటిలోని చిట్ గ్రూప్‌ల టర్నోవర్ నిలిచిపోతుందని చెప్పారు. చివరకు మార్గదర్శి పడిపోతుందన్నారు.

సంజయ్ మంగళవారం ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ.. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో మూడేళ్ల లావాదేవీలను పరిశీలించి, అక్రమాలపై ఆధారాలు సేకరించామన్నారు. ఏపీతోపాటు తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని బ్రాంచ్‌లలో కార్యకలాపాలపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీలోని కేంద్ర ఏజెన్సీలకు కూడా ఈ అక్రమాల సమాచారం ఇచ్చామని, తెలంగాణ, ఇతర రాష్ట్రాల డీజీపీలకు సమాచారం ఇస్తున్నామన్నారు. ఏపీలో పలు ప్రాంతాల్లో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ ఫిర్యాదు మేరకే ఏపీ సీఐడీ కేసు దర్యాప్తు చేస్తోందని తెలిపారు. పూర్తి నిబంధనలు పాటి స్తూనే ఈ కేసులో ఏ–1 రామోజీ రావును, ఏ–2 శైలజాకిరణ్‌ను ప్రశ్నించామన్నారు.

వడ్డీ ఆశ చూపి మభ్యపెడుతున్నారు..

మార్గదర్శి అక్రమాలపై ఖాతాదారుల నుంచి ఫిర్యాదు లేకుండానే కేసు దర్యాప్తు చేస్తున్నారంటూ ఒక సెక్షన్ మీడియా ఆరోపణలు చేస్తోందని, అయితే ఖాతాదారులకు వడ్డీని ఆశజూపి ఆ సంస్థ నిబంధనలకు విరుద్ధంగా నిధులను మళ్లిస్తుండటాన్ని తాము వెలుగులోకి తెస్తున్నామని చెప్పారు. ప్రజలు మోసపోయి ఫిర్యాదు చేసేకంటే ముందే తాము వారి సొమ్ము కాపాడేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఏ బాధితుడి విషయంలో అయినా ఇదే పద్ధతి అని స్పష్టం చేశారు. చాక్లెట్ ఇచ్చి బాలికను కిడ్నాప్ చేస్తే.. సమాచారం అందిన వెంటనే పోలీసులు దర్యాప్తు ప్రారంభిస్తారు కానీ, బాధితురాలు ఫిర్యాదు ఇచ్చేవరకు కూర్చోరని.. అదే తరహాలో లక్షల మంది ఖాతాదారుల సొమ్మును కాపాడేందుకు మార్గదర్శిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులుగా ప్రజలకు న్యాయం చేస్తుంటే మార్గదర్శిపై కక్షసాధింపు అంటూ ఆ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. తమ దర్యాప్తు చట్టానికి లోబడి ఉన్నట్టే.. చిట్‌ఫండ్స్ కంపెనీ నిర్వహణలో రామోజీరావు సైతం చట్టానికి లోబడి ఉండాలన్నారు.

చట్టం అమలు కాకుండా 26 ఏళ్లు అడ్డుకున్నారు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థను చిట్‌ఫండ్ యాక్ట్ 1982 మేరకు నడపడంలేదని అన్నారు. చిట్‌ఫండ్స్ సొమ్ముతో వేరే వ్యాపారం చేయకూడదన్నారు. చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారమే బ్యాలెన్స్ షీట్లు ఫైల్ చేయాల్సి ఉన్నా.. కంపెనీ యాక్ట్స్ ప్రకారం నడుచుకుంటున్నామని ఈ కేసులో ఏ–2 శైలజాకిరణ్ అవివేకంతో కూడిన సమాధానాలు చెప్పారని తెలిపారు. ఒక గ్రూప్ డబ్బు మరో గ్రూప్‌కు వాడొద్దని చట్టం చెబుతున్నా.. మార్గదర్శి బ్రాంచ్‌లన్నింటిలోని డబ్బు అక్రమంగా హైదరాబాద్‌లోని కేంద్ర కార్యాలయానికి తరలిస్తున్నట్టు అన్ని ఆధారాలు లభించాయని చెప్పారు. చిట్‌ఫండ్ యాక్ట్ రావడానికి ముందే మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ ప్రారంభమైందన్న వింత వాదన తెస్తున్నారన్నారు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వం 1982లో చిట్‌ఫండ్ యాక్ట్ పాస్ చేస్తే.. దానిని రాష్ట్ర ప్రభుత్వాలు చట్టసభల్లో పాస్ చేయాల్సి ఉందన్నారు. కానీ 26 ఏళ్ల తర్వాత 2008లో అమలు చేశారని, ఇన్నేళ్లూ రామోజీరావు పలుకుబడితో అడ్డుకున్నారని వివరించారు.

నిబంధనలున్నా.. వారికి అనుకూలంగా..

మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ లావాదేవీలు చిట్‌ఫండ్ యాక్ట్ ప్రకారం కాకుండా రామోజీరావు, శైలజా కిరణ్ వారికి అనుకూలంగా కంపెనీ యాక్ట్ ప్రకారం చూపుతున్నారని దర్యాప్తులో తేలిందన్నారు. ఇదేమని ప్రశ్నిస్తే.. తమకు ఆ నిబంధనలు వర్తించవన్న తరహాలో సమాధానాలిచ్చారన్నారు. ఖాతాదారుల నుంచి సొమ్ము వసూలుకు మాత్రం చిట్‌ఫండ్స్ చట్టాన్నే వాడుకొంటున్నారని చెప్పారు. ఇదే తరహాలో చీరాలలో రూ.65 లక్షల డిఫాల్ట్ కేసులో ష్యూరిటీగా ఉన్న వ్యక్తి నుంచి రూ.6 కోట్లు విలువైన ఆస్తిని అటాచ్ చేయించారని తెలిపారు. ఇలాంటి ఎన్నో అంశాలు దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయన్నారు. సంస్థలోని అంతర్గత లుకలుకలు బయటపడతాయనే చిట్‌ఫండ్స్ యాక్ట్‌ను అమలు చేయడంలేదన్నారు. చిట్ సెటిల్‌మెంట్‌లోనూ నిబంధనలు పాటించడం లేదన్నారు. చిట్ ముగిసిన వారి వివరాలతో, కొన్నింటిలో మానేసిన ఖాతాదారుల పేర్లు వాడి మళ్లీ చిట్‌లు నడుపుతున్నారని, ఇలా ఎన్నో విస్తుపోయే ఆధారాలు లభించాయని తెలిపారు. చిట్ డబ్బు బ్రాంచ్‌లో లేకపోవడంపై ప్రశ్నిస్తే.. మీరెవరు ప్రశ్నించేందుకు అన్న రీతిలో సమాధానాలు ఇస్తున్నారన్నారు.

నగర వార్తలు

నిమ్స్‌లో ఆర్టీసీ ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు



బీరప్పను సత్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

లక్డీకాపూల్: నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్)లో ఆర్టీసీ ఉద్యోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందిస్తామని నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. ఇందుకు ఆస్పత్రిలో ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బందికి మెరుగైన సేవలందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. మంగళవారం బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనర్‌ని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా పదవీ బాధ్యతలు చేపట్టిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పని సజ్జనార్ సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అనంతరం నిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ.. నిమ్స్‌కు ఎలాంటి సమస్యతో వచ్చినా ఉద్యోగులు, సిబ్బందికి నాణ్యమైన వైద్యం అందుతుందన్నారు. ఫైనాన్షియల్ కంట్రోలర్, క్రెడిట్ కలెక్షన్ ఇన్‌చార్జి శ్రీధర్, సూపరింటెండెంట్ సురేష్, రమణ ఉన్నారు.

ఆటంకాలు కలిగిస్తున్న వ్యక్తికి ఏకే ఖాన్ స్వీట్ వార్నింగ్

హిమాయత్‌నగర్: కింగ్‌కోఠిలోని మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్‌లోని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు పలు సందర్భాల్లో ఆటంకాలు కలిగిస్తున్న స్థానికుడికి ప్రభుత్వ సలహాదారు (మైనార్టీ వ్యవహారాలు) ఏకే ఖాన్ స్వీట్ వార్నింగ్ ఇచ్చారు. విద్యార్థులకు ఆసరాగా నిలుస్తూ, అండగా ఉండాలని సూచించారు. మంగళవారం కింగ్‌కోఠిలోని స్కూల్‌లో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలకు ఏకే ఖాన్ హాజరయ్యారు. ఆ సమయంలో పిల్లలు కేరింతలతో స్వాగతం పలుకుతుండగా పక్కనే నివసించే ఓ వ్యక్తి అరవొద్దంటూ ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో క్లాస్‌లో చిన్నపాటి సౌండ్ వచ్చినా ఆ వ్యక్తి ఊరుకోదని, స్కూల్‌కు ఎవరైన ద్విచక్రవాహనంపై వచ్చి గేటు ముందు పార్క్ చేస్తే వారితో వాగ్వాదానికి దిగుతాడని, తమకు అతనిలో ఇబ్బందిగా ఉందంటూ స్కూల్ ప్రిన్సిపాల్ ఏకే ఖాన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్థానికుడిని పిలిచి విద్యార్థుల పట్ల, ఉపాధ్యాయుల పట్ల దురుసు ప్రవర్తన అనేది సమంజసం కాదన్నారు. ఇదే సమయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం హాజరయ్యారు. ఆయనకు కూడా ఈ విషయాన్ని చెప్పడంతో ఎమ్మెల్యే సైతం అతడికి వార్నింగ్ ఇచ్చి అబిడ్స్ పోలీసులకు అప్పగించారు. ఆ వ్యక్తి కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్న కారణంగా అలా ప్రవర్తిస్తున్నాడని, అతనికి కౌన్సిలింగ్ ఇచ్చి పంపివేసినట్లు అబిడ్స్ ఎస్‌హెచ్‌ఓ ప్రసాద్ తెలిపారు.

ఘనంగా విద్యా దినోత్సవం



సాంస్కృతిక ప్రదర్శన దృశ్యం

నాంపల్లి: తెలుగు లలిత కళల వికాసం కోసం ఆవిర్భవించిన శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా లలిత కళాపీఠం ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు మందిరంలో సంగీత, నృత్య, రంగస్థల, జానపద కళల శాఖలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులతో పలు సాంస్కృతిక కళా ప్రదర్శనలను ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్‌రావు విద్యా దినోత్సవాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కళల విశ్వవిద్యాలయంగా పేరొందిన తెలుగు విశ్వవిద్యాలయం తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించే కళా రూపాలతో తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు స్వాగతం పలుకుతూ ఏడాది పాటు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. తొలుత ప్రముఖ కూచిపూడి నృత్య గురువులు వెంపటి చినసత్యం శిష్యులు పద్మరాగిణి తన రష్యా శిష్యబృందంతో గణేష స్తుతితో సాంస్కృతిక ప్రదర్శనలను ప్రారంభించారు. సంగీత శాఖ నుంచి కుమారి భవ్య, సుమన్ తెలంగాణ సాహిత్యకారుల లలిత సంగీత గీతాలను ఆలపించారు. నృత్య శాఖలోని పేరిణి విభాగం నుంచి విద్యార్థులు పేరిణి నృత్యాన్ని, వర్సిటీ పూర్వ విద్యార్థి బోయినపల్లి సుధీర్‌రావు శిష్యబృందంతో రుద్రమ నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. లలిత కళాపీఠం పీఠాధిపతి ఆచార్య హనుమంతరావు దర్శకత్వంలో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ ఆకాంక్ష నుంచి విజయ సాధన వరకు సాగిన జయ జయహే తెలంగాణ సంగీత నృత్య నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలను పొందారు. డాక్టర్ లింగయ్య ఆధ్వర్యంలో జానపద కళల శాఖ విద్యార్థులు తెలంగాణ ఉద్యమ గీతాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్, వివిధ శాఖాధిపతులు, విభాగాధిపతుల, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



సందడిగా 5కే వాక్

వెంకటేశ్వరకాలనీ: తలసీమియా వ్యాధిగ్రస్తులకు అండగా నిలిచేందుకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం కేబీఆర్ పార్కు వద్ద 5కే వాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశ్రాంత ఐఏఎస్ అధికారి, రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ అజయ్ మిశ్రా హాజరై జెండా ఊపి వాక్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎన్టీఆర్ ట్రస్ట్ కాలేజీ విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు.

నేడు మ్యూజియంలో ప్రపంచ సంగీత దినోత్సవం

బహదూర్‌పురా: సాలార్‌జంగ్ మ్యూజియంలో ఈనెల 21న ఆద్య కళ, సాలార్‌జంగ్ మ్యూజియం, తెలుగు విశ్వవిద్యాలయం సంయుక్తాధ్వర్యంలో ప్రపంచ సంగీత దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు మ్యూజియం డైరెక్టర్ డాక్టర్ నాగేందర్‌రెడ్డి తెలిపారు. మ్యూజియంలోని ఈస్టర్న్ బ్లాక్‌లో బుధవారం సాయంత్రం 7 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, కరీంనగర్ నుంచి ఆదివాసీ సంగీత కళాకారులు, తెలంగాణ నలుమూలల నుంచి జానపద సంగీతకారులు వివిధ రకాల వాద్యాలతో వచ్చేస్తున్నారన్నారు. మొదటిసారిగా గిరిజన సంగీత వాద్యాలు, జానపద సంగీత వాద్యాలు కలిసి ఒక కచేరి చేస్తున్నాయన్నారు. 40 మంది కళాకారులు ఒకేసారి ఒకే రాగాన్ని పాడతారని.. 40 వాద్యాలతో ఈ సంగీత గోష్ఠి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన అతిథులుగా పాల్గొంటారన్నారు.

యోగా నిపుణులు, సాధకులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు సోషల్ మీడియాలో తమ ఉనికిని కొత్తగా చాటుతున్నారు. వారి నిజాయితీ, స్ఫూర్తిదాయకమైన వారి మాటలు, ఉత్సాహం ఆకర్షణీయంగా మార్చే సుగుణాన్ని కళ్లకు కడుతున్నాయి. యోగా ఆరోగ్యాన్ని, ఫిట్‌నెస్‌ను రెండింటినీ అద్భుతంగా మారుస్తుంది. రోజువారి జీవనంలో యోగా ఒక భాగం అవడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు మరిన్ని హంగులు అద్దుతున్నారు. శాస్త్రీయ యోగాభ్యాసం ద్వారా వేగవంతమైన ఆధునిక యుగానికి తమను తాము గొప్ప స్ఫూర్తిగా మార్చుకుంటున్నారు. సెలబ్రిటీల నుంచి ఎంతోమంది మహిళలు యోగా పాఠాలు చెబుతూ సోషల్ మీడియాలో కనిపిస్తారు. వారి నుంచి ఎంతో ప్రేరణను పొందవచ్చు. ఈ రోజు నుంచే యోగాను దైనందిన జీవనంలో భాగం చేసుకోవచ్చు.

* యోగా డే

యోగా... కొత్త కొత్తగా

● ఇది ఇన్‌ఫ్లుయెన్సర్ల కథ

ప్రపంచస్థాయి ప్రభావం శిల్పా శెట్టి



భారతదేశంలో అత్యంత ప్రభావ వంతమైన ఫిట్‌నెస్ ఐకాన్స్, యోగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఒకరుగా నిలిచింది శిల్ప. ఐదుపదులకు చేరువలో ఉన్న శిల్ప యోగా కోసం చాలా కాలం శిక్షణ పొందారు. తీరైన శరీరాకృతిని పొందడానికి, దైనందిన జీవనంలో వ్యాయామాన్ని చేర్చడానికి ఫిట్‌నెస్ ఫిల్మ్‌లు రూపొందించింది. యోగాకు సంబంధించిన డీవీడీలను కూడా రిలీజ్ చేసింది. కొన్ని జీవన శైలి మార్పులు మనలో ఎలాంటి పెద్ద మార్పులను తీసుకువస్తాయో చూపించడానికి సోషల్‌మీడియాను ఉపయోగిస్తుంది. ఆమె యూ ట్యూబ్ ఛానెల్‌కి 3 మిలియన్లకు పైగా సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ప్రపంచ స్థాయిలో భారతీయ యోగాను ప్రోత్సహించడంలో శిల్ప చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఆమె వ్యాయామం చేసే విధానం, తీసుకునే ఆరోగ్యకరమైన ఆహారం గృహిణులకు స్ఫూర్తినిస్తుంది.



యోగా సౌందర్యం దీపికా మెహతా



రోజును యోగాసనాలతో కొత్తగా ప్రారంభించాలనే ఆలోచనను దీపికా మెహతా కళ్లకు కడుతుంది. ఆమె యూ ట్యూబ్ ఛానెల్ ద్వారా యోగా లో కళా దృష్టి ఉంటుందని చూపుతుంది. 'రెండు దశాబ్దాల క్రితం మరణం అనుభవాన్ని చవి చూశానని, యోగా పునర్జీవితాన్ని ఇచ్చింద'ని చెబుతుంది. రాక్ క్లైంబింగ్ ప్రమాదం తర్వాత ఆమె ఇకపై నడవలేదని వైద్యులు అంచనా వేశారు. యోగా ట్రైనర్, అష్టాంగ యోగా స్పెషలిస్ట్ అయిన దీపికా యూ ట్యూబ్ ఛానెల్ కి దాదాపు 4 లక్షల మంది సబ్ స్క్రైబర్లు ఉన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె చూపే యోగా ప్రతిభ ఎంతోమందిని ఆశ్చర్యపరుస్తాయి. ఎంతోమంది బాలీవుడ్ సెలబ్రిటీలకు యోగా గురూగా మారింది.

లోపాలను సరిదిద్దుతూ... సునయన రేఖీ



యోగా హెల్త్ అండ్ లైఫ్ స్టైల్ కోచ్‌గా సునైనా రేఖీ తనను తాను కొత్తగా ఎప్పుడూ పరిచయం చేసుకుంటూనే ఉంటుంది. భారతదేశంలోని అత్యంత పేరొందిన యోగా ట్రైనర్లలలో సునయన ఒకరు. రిషీకేశ్‌లో యోగా సాధన చేసిన సునేయన ఇప్పుడు ముంబైలోని అనేక ప్రసిద్ధ యోగా స్టూడియోలలో నిపుణురాలిగా శిక్షణ ఇస్తోంది. సాధనకు బలమైన పునాదిని ఏర్పరచడానికి, గాయాలను మాన్పడానికి నిపుణులైన పర్యవేక్షణ అవసరమని సునయన వీడియోలు నిరూపిస్తాయి. యోగా సాధనలో చిన్న చిన్న లోపాలు ఎలాంటి వ్యతిరేక ఫలితాలు ఇస్తాయో కూడా వివరిస్తుంది. మనస్సు, శరీరం, ఆత్మపై యోగా వల్ల కలిగే మంచి ప్రయోజనాల గురించి వివరిస్తుంది.

నిరాశకు దూరం నటాషా



నృత్యకారిణి, ఫొటోగ్రాఫర్, యోగా సాధకురాలు నటాషా నోయల్. యూ ట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ నుంచే కాదు సోల్‌ఫుల్ హ్యాపీనెస్ బ్లాగ్ ద్వారా తన యోగానుభవాలను తెలియజేస్తుంది. మాట్లాడుతుంది. తత్త్వశాస్త్రాన్ని సాధన చేసే నటాషా 'మీ మానసిక దృఢత్వమే మీ లక్ష్యం. మిగతావన్నీ అప్రధానం' అని చెబుతుంది. తన బాల్యంలో జరిగిన విషాదకర సంఘటనల నుంచి తేరుకొని, కొత్త జీవితాన్ని మొదలుపెట్టింది. కండరాల బలాన్ని పునర్నిర్మించే ప్రయత్నంలో ఆమె యోగా సాధకురాలిగా మారింది. ఆమె యూ ట్యూబ్ ఛానెల్‌కు సుమారు ఏడు లక్షల ముప్పై వేల మంది సభ్యులు ఉన్నారు. నిరాశ, ఆందోళన, బాడీ షేమింగ్ గురించి చర్చించడానికి ఆమె తన సోషల్‌మీడియా ప్లాట్‌ఫారమ్‌ను ఉపయోగిస్తుంది. యోగా ద్వారా సెల్ఫ్ గ్రోత్, చికిత్స గురించి మరీ మరీ చెబుతుంది. ప్రతి రోజూ మరింత బలంగా మారడానికి ప్రయత్నిస్తూనే ఉండాలని సూచనలు ఇస్తుంది. ఆమె ఇన్‌స్టాగ్రామ్ పేజీ ద్వారా కష్టపడి పని చేయడం వల్ల ఎలాంటి ఫలితాలు వస్తాయో అందుకు తనే ఉదాహరణగా చూపుతుంది.

యోగాసిని రాధికా బోస్

అనేక పేరొందిన కంపెనీలతో కలిసి పనిచేసిన అనుభవం రాధికా బోస్‌కు ఉంది. అయితే, ఆమె తన ఆరోగ్యకరమైన జీవనాన్ని సూచించడానికి మాత్రం సోషల్‌మీడియానే ప్రధాన వేదికగా ఎంచుకుంటుంది. రాధిక సూచించే అంశాలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తుంటాయి. ప్రతిష్ఠాత్మకమైన మ్యాగజైన్‌లలో ఆమె యోగసాధన గురించి ప్రచురించాయి. 'మీడియా, ప్రకటనలలో గ్లాస్ సీలింగ్‌ను ఛేదించడానికి మహిళలు గొప్ప పురోగతిని సాధించారు. అయితే మనం ఇంకా పితృస్వామ్యంలో జీవిస్తున్నాం, అన్నింటినీ దాటుకొని చాలా దూరం ప్రయాణించాల్సింది మనమే' అని నమ్మకంగా చెబుతుంది. యోగా, వ్యాయామ జీవనశైలితో పాటు ఇతర ఆరోగ్య మార్గదర్శకాలను అందిస్తుంది. 9 సంవత్సరాలుగా యోగా సాధన చేస్తూ, నిపుణురాలిగా తన ప్రతిభను చాటుతోంది.

ఎండలు మండితే పాటలు ఓదార్పు.
తొలకరి కురిస్తే పాటలు కాఫీకి తోడు.
చలి చక్కిలిగిలి పెడితే పాటే కదా వెచ్చటి రగ్గు.
సంగీతమూ సినిమా పాట లేకుండా జీవితం సాగేది ఎలా.
నేడు వరల్డ్ మ్యూజిక్ డే.
రావు బాల సరస్వతి, పి.లీల, జిక్కి,
భానుమతి రామకృష్ణ, పి.సుశీల, ఎస్.జానకి,
ఎల్.ఆర్.ఈశ్వరి, వాణి జయరాం, శైలజ, చిత్ర...
వీరంతా మన సినీ కోయిలలుగా
మన జీవన సందర్భాలను సంగీతమయం చేశారు.
నేడు వీరి పాటలను తలుచుకోవడం మన విధి.
వీరికి చేరేలా కృతజ్ఞత ప్రకటించడం మన సంతోషం.

కొమ్మకొమ్మకో కోయిల

టాప్ 10 నేడు వరల్డ్ మ్యూజిక్ డే


రావు బాలసరస్వతి


ఎస్.జానకి


పి. లీల


ఎల్.ఆర్.ఈశ్వరి


జిక్కి


వాణీజయరామ్


భానుమతి


ఎస్.పి.శైలజ


సుశీల


చిత్ర

తానే మారెనా గుణమ్మే మారెనా
దారీ తెన్ను లేనే లేక ఈ తీరాయెనా...

రావు బాలసరస్వతి గొంతు మంచురాలిన దారిలో హంస నడకలా ఉంటుంది. నటీనటులే పాటలు పాడుకోవాలి అనుకునే రోజుల్లో ఆమె దాదాపుగా మన తొలి ఫిమేల్ ప్లేబ్యాక్ సింగర్. సాలూరి రాజేశ్వరరావు సంగీతంలో ఆమె పాటలు రెక్కలు విప్పాయి. సువాసనలు చిమ్మాయి. ఆమె తన సినిమా కెరీర్‌ను కొనసాగించి ఉంటే లతా అంతటి గాయనిగా గుర్తింపు పొందేది. ఆమె మనకు పంచిన అమృతం తక్కువ. కాని దాని రుచి ఎంతో మక్కువ.

తెల్లవార వచ్చె తెలియక నాసామీ
మళ్లీ పరుండేవు లేరా...

అప్రయత్నంగా వీచే గాలిలా, అనాయాసంగా తాకే 'మలయ'మారుతంలా ఉంటుంది పి.లీల గొంతు. తెలుగు ఆమె మాతృభాష కాదు. కాని ప్రతి తెలుగు గృహిణి నాలుక మీద ఆమె పాట చర్విత చరణం అయ్యింది.'సడిచేయకోగాలి సడి చేయబోకే', 'ఓహో మేఘమాల.. నీలాల మేఘమాల', 'కలనైనా నీ వలపే... కలవరమందైన నీ తలపే'... పి.లీల సంగీతలీల అద్భుతం.

ఏరువాక సాగారో రన్నో చిన్నన్న
నీ కష్టమంతా తీరెనులో రన్నో చిన్నన్న

తెలుగు పాటల్లో తన ఏరువాకతో కొత్త నారును వేసి సమృద్ధికర పైరును శ్రోతలకు అందించిన గాయని జిక్కి. పిట్ట కొంచమే. కూత పది వర్ణాల పింఛమే. అల్లరి పాటైనా ఆర్ద్ర గీతమైనా జిక్కి చేత చిక్కిందంటే హిట్. 'ఛాంగురే బంగారు రాజా', 'పులకించని మది పులకించు'... ఆమెకు శ్రీలంకలో కూడా ఫ్యాన్స్ ఉండేవారు. అందమైన పాటలు పాడి 'జీవితమే సఫలము' చేసుకున్న ప్రియమైన గాయని జిక్కి.

ఓహోహోహో పావురమా
ఓ... ఓహోహో పావురమా
వెర్రిపేలే పావురమా
ఓహోహో ఓహో పావురమా

ఈ పావురం డేగల్ని కూడా వేటాడగలదు. భానుమతి రామకృష్ణ సకల కళావల్లభురాలు. నాటి తెలుగు మహిళలకు పెద్ద ధైర్యం. ఇండస్ట్రీలో గొప్ప తెగువ. అలాంటి గొంతు, ఆ పాట తీరు రిపీట్ కాలేవు. కాబోవు. 'ఎందుకే నీకింత తొందర', 'నేనే రాధనోయి', 'సావిరహే తవదీన'... ఎన్ని పాటలని. ఇక 'మల్లీశ్వరి' ఆమె ప్రతి పాట గండుమల్లె, రెక్కమల్లె. 'మనసున మల్లెల మాలలూగెనే'..

ముత్యమంతా పసుపు ముఖమెంతో ఛాయ
ముత్తయిదు కుంకుమ బతుకంతో ఛాయ

తెలుగు పాటకు వంద సంవత్సరాల ఛాయను తెచ్చింది సుశీల. ఆమె రాకతో నటిని, గాయనిని దృష్టిలో పెట్టుకోకుండా పాటకు అవసరమైన రేంజ్‌తో బాణీ కట్టడం మొదలెట్టారు సంగీత దర్శకులు. సుశీల పాటలో నిష్ఠ ఉంటుంది. క్రమశిక్షణ ఉంటుంది. శ్రేష్ఠమైన ఉచ్చారణ. నూరుశాతం కచ్చితత్వం. 'ఆకులో ఆకునై పూవులో పూవునై', 'జోరుమీదున్నావు తుమ్మెదా', 'ఇది మల్లెల వేళయనీ'... ఈ కెరటాలకు అంతులేదు. ఈ గాన సముద్రానికి ఉప్పదనం లేదు. అమృత సాగరం.

నీలిమేఘాలలో గాలి కెరటాలలో
నీవు పాడే పాట వినిపింతునేవేళా

నూనె రాసి గట్టిగా బిగించి కట్టిన జడది అందమే. అది సుశీలమ్మ పాటది. తల స్నానం చేసి వదులుగా వదిలిన ముంగురులదీ అందమే. అది జానకమ్మ పాటది. తెలుగు పాట ఊపిరి పీల్చుకోవడానికి తెరిచిన పెద్ద గవాక్షం జానకి. తల్లిదండ్రులను చనువుగా ఒకమాటనగల చిన్న కూతురిలా ఉంటుందామె పాట. సరదా. హుషారు. అద్దంలో ఇమడగల కొండంత ప్రతిభ. 'పగలే వెన్నెల', 'మనసా తుళ్లి పడకే', 'అందమైన లోకమని రంగురంగులున్నాయనీ'... ఇక నాద స్వరం ఎదుట పడగ ఎత్తి నిలిచిన పాట 'నీలీల పాడెద దేవా'...

మాయదారి సిన్నోడు మనసే లాగేసిండు
మాగమాసం ఎల్లేదాకా మంచి రోజు లేదన్నాడు
ఆగేదెట్టాగ అందాక ఏగేదెట్టాగ

గజ్జె కట్టి, బిగుతు దుస్తులు ధరించి, స్టేజ్ ఎక్కి జానపద శృంగారం ఒలికించిన పాట ఎల్.ఆర్. ఈశ్వరిది. ఊరంటే గుళ్లు, ఇళ్లు మాత్రమే కాదు.. పొలాలుంటాయి.. మంచెలూ ఉంటాయి. 'మసక మసక చీకటిలో', 'నందామయా గురుడ నందామయా', 'తీస్కో కోకకోలా'... ప్రతి పాటా సంపెంగ పొదలో పూసిన పువ్వు.

అది మగాళ్లని 'బలేబలే మగాడివోయ్' చేసింది.

విధి చేయు వింతలన్ని మతిలేని చేతలేనని
విరహాన వేగిపోయి విలపించే కథలు ఎన్నో

వాణి జయరామ్‌ది పక్కింట్లో నుంచి వినిపించే పరిచిత గీతంలా ఉంటుంది. అదే సమయంలో దానికో వ్యక్తిత్వం ఉంటుంది. వాణి జయరామ్ పాటల మీద జోకులేయలేం. గౌరవించడం ప్రేమించడం తప్ప. 'పూజలు సేయ పూలు తెచ్చాను', 'నేనా పాడనా పాట... మీరా అన్నదా మాట', 'ఎన్నెన్నో జన్మల బంధం నీది నాదీ'... అద్భుతం.

లాలు దర్వాజ్ లష్కర్ బోనాల్‌కొస్తనని రాకపోతివి
లక్డీకాపూలు పోరికి రబ్బరు గాజులు
తెస్తనని తేకపోతివి

ఎస్.పి.శైలజ పాటను ఒక పల్లవి ఒక చరణం వరకే అనుమతించింది తెలుగు పరిశ్రమ. ప్రతిసారి మైక్ అందలేదు. అందినప్పుడు ఆమె గొంతులో అందం దాగలేదు. 'మాటే మంత్రము', 'నాంపల్లి టేషన్‌కాడి', 'కొబ్బరినీళ్ల జలకాలాడి'... ఆమె పాట, మాట రెండూ మృదురమే.

రానేల వసంతాలె శృతి కానెల సరాగాలే
నీవే జీవన రాగం... స్వరాల బంధం

చిత్ర రాకతో మళ్లీ తెలుగు పాటకు టీనేజ్ వచ్చింది. కొత్త తరానికి పాటను అందించింది చిత్ర. కాలేజీకెళ్లే అమ్మాయిలు 'తెలుసా మనసా' అని... 'కన్నానులే కలలు' అని... 'ఎన్నెన్నో అందాలు' అని పాడుకున్నారు. 'మనసున ఉన్నది చెప్పాలనున్నది' అని కూనిరాగం తీసుకున్నారు.

మన గాయనులు మనకు బుట్టల కొద్ది పాటలు పంచినందుకు కృతజ్ఞతలు. ●

'సిలికాన్ వ్యాలీ ట్రెండ్'గా పేరున్న 'డోపమైన్ ఫాస్టింగ్' సాంకేతిక నిపుణులకే పరిమితం కాలేదు. యువతరానికి దగ్గర అవుతోంది. డిజిటల్ ప్రపంచంలో హద్దులు దాటుతున్న 'ప్లెజర్ కెమికల్'కు నియంత్రణ విధించడానికి 'డోపమైన్ ఫాస్టింగ్' అనేది ఒక మార్గం అయింది...

యూత్ పల్స్




మలైకా అరోరా

మోస్ట్ పవర్‌ఫుల్ బ్రేక్!


అలియా భట్

చెన్నైకి చెందిన ఇరవై రెండు సంవత్సరాల రుచిత తన ఫ్రెండ్ ద్వారా 'డోపమైన్ ఫాస్టింగ్' అనే మాట విన్నది. 'ఒకసారి ట్రై చేసి చూద్దాం' అనుకుంటూ రంగంలోకి దిగింది. తల్లిదండ్రులకు చెప్పి మారుమూల ప్రాంతంలోని చుట్టాల ఇంటికి వెళ్లింది. ఆ పల్లెలో ఉరుకులు పరుగులు కనిపించవు. రణగొణ ధ్వనులు వినిపించవు. పిట్టపాటను దగ్గరగా వినే అదృష్టం దక్కుతుంది.

సెల్‌ఫోన్‌కు సెలవు ఇచ్చి ఆ వారం రోజులు ఒక చెట్టు కింద కూర్చొని నచ్చిన పుస్తకాలు చదువుకుంది.

పట్నాకు చెందిన తేజశ్రీకి నాన్‌స్టాప్‌గా మాట్లాడే అలవాటు ఉంది. రానూ రానూ ఆమె అంటే స్నేహితుల్లో తెలియని భయం లాంటిది ఏర్పడింది. పక్కకు తప్పుకోవడం మొదలైంది. ఇది గమనించిన తేజశ్రీ ఆలోచనల్లో పడినప్పుడు ఆమెకు కనిపించిన దారి... డోపమైన్ ఫాస్టింగ్.

ఫాస్టింగ్‌లో భాగంగా ఒక వారం రోజులపాటు అవసరమైతే తప్ప ఒక్కమాట కూడా ఎక్కువ మాట్లాడలేదు తేజశ్రీ!

ఫాస్టింగ్ తరువాత ఆ ఇద్దరి నోటినుంచి వచ్చిన మాట...

'ఇంత అద్భుతమైన ఫలితాన్ని ఊహించలేదు'

ఈ ఇద్దరు మాత్రమే కాదు దేశవ్యాప్తంగా యువతరంలో ఎంతోమంది జపిస్తున్న మంత్రం... డోపమైన్ ఫాస్టింగ్. 'డోపమైన్ ఫాస్టింగ్' సిలికాన్ వ్యాలీలో మారుమోగిన ట్రెండ్. సాంకేతిక నిపుణులను బాగా ఆకట్టుకుంది.

'దీనికి ఎలాంటి శాస్త్రీయ ప్రాతి పదికా లేదు' అనే మాట 'డోపమైన్ ఫాస్టింగ్' పాపులారిటీని యూత్‌లో తగ్గించలేకపోతోంది.

టీవీ షోలు, యూట్యూబ్ వీడియోలు, పాడ్‌కాస్ట్, మ్యూజిక్ షోలు... డిజిటల్ ప్రపంచంలో వివిధ మార్గాల ద్వారా మెదడులో డోపమైన్ విడుదల అవుతుంది. డిజిటల్ కంటెంట్ నుంచి డివైజ్‌లకు అతిగా అలవాటు పడడం వరకు ప్లెజర్ కెమికల్ అనబడే 'డోపమైన్' హద్దులు దాటితే అది దురలవాటుగా మారి సమస్యల్లోకి తీసుకువెళుతుంది.

అధిక నిద్ర, అధిక తిండి నుంచి అదే పనిగా సోషల్ మీడియాలో తలదూర్చేవరకు... ఎన్నెన్నో అలవాట్లు డోపమైన్ ప్రతిఫలనాలే.

అమెరికన్ సైకియాట్రిస్ట్ అన్నా లెంబ్కే 'డోపమైన్ నేషన్' పేరుతో పుస్తకం రాసింది. ఆ పుస్తకంలో ఆమె రాసిన ఒక మాట...'మన చుట్టూ ఉన్న ప్రపంచంలో అవసరమైన దానికంటే ఎక్కువ సౌకర్యాలు ఉన్నాయి. దీంతో ఒత్తిడి పెరుగుతోంది. సౌకర్యాలు, వస్తువులు పెరిగేకొద్దీ సంతోషం కూడా తగ్గుతుంది'

'డోపమైన్ ఫాస్టింగ్ అంటే తిండికి దూరం కావడం కాదు. ఎవరితో మాట్లాడకపోవడం కాదు. మెదడులో డోపమైన్ విడుదలయ్యేందుకు కారణమయ్యే వాటికి విరామం ఇవ్వడం' అంటున్నారు నిపుణులు.

'డోపమైన్ ఫాస్టింగ్' లక్ష్యం డోపమైన్‌కు దూరం చేయడం కాదు. డోపమైన్ లోపం వల్ల ఏ సంతోషం లేకుండా జీవితం నిస్సారంగా అనిపించడం, డిప్రెషన్‌లో కూరుకుపోవడం, చెడు అలవాట్లకు బానిస కావడం లాంటివి కూడా జరిగే ప్రమాదం ఉంది. అందుకే డిజిటల్ ఫాస్టింగ్ అనేది 'డోపమైన్' మరీ ఎక్కువ కాకుండా, మరీ తక్కువ కాకుండా సమన్వయ ధోరణిలో వెళుతుంది. అందుకే 'డోపమైన్ ఫాస్టింగ్' మోస్ట్ పవర్‌ఫుల్ బ్రేక్‌గా పేరు తెచ్చుకుంది.

'సంతోషకరమైన విషయం ఏమిటంటే యువతరం డోపమైన్ డిటాక్స్‌పై దృష్టి పెడుతోంది. డోపమైన్ ఫాస్టింగ్ వల్ల వచ్చిన విరామం ద్వారా తమ మానసిక ఆరోగ్యంపై టెక్నాలజీ చూపే ప్రతికూల ప్రభావాన్ని గురించి తెలుసుకోగలుగుతున్నారు' అంటుంది అన్నా లెంబ్కే. ●

ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్

బాలీవుడ్‌కు సంబంధించి సోషల్ మీడియాలో బాగా పాపులర్ అయిన ట్రెండ్.. ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్. 'ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్'లోగా భాగంగా 16 గంటల ఫాస్టింగ్ రూల్‌ని అనుసరిస్తూ ఆలియాభట్ బరువు తగ్గింది. వెజిటేరియన్‌గా మారింది. వ్యాయామాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చే జాక్వెలిన్ ఫెర్నాండేజ్ ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌కు కూడా అంతే ప్రాధాన్యత ఇస్తుంది. కమెడియన్ భారతి సింగ్ లాక్‌డౌన్ సమయంలో ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌ను అనుసరించి పదిహేను కిలోల బరువు తగ్గింది. హీరో వరుణ్ ధావన్ రోజుకు 14-16 గంటల ఇంటర్‌మిటెంట్ ఫాస్టింగ్‌ను అనుసరిస్తాడు.



పోరాడి ఓడిన విష్ణువర్ధన్ ద్వయం

తైపీ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-300 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో గరగ కృష్ణప్రసాద్-పంజాల విష్ణువర్ధన్ గౌడ్ (భారత్) జోడీకి నిరాశ ఎదురైంది. తొలి రౌండ్ మ్యాచ్‌లో కృష్ణప్రసాద్-విష్ణువర్ధన్ గౌడ్ జోడీ 18-21, 22-20, 16-21తో విన్సన్ చియు-యువాన్ (అమెరికా) జంట చేతిలో ఓడింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్ లో రుతపర్ణ-శ్వేతపర్ణ (భారత్) జోడీ 7-21, 30-28, 12-21తో చెంగ్ యు పె-సున్ వెన్ పె (చైనీస్ తైపీ) జంట చేతిలో పరాజయం పాలైంది.

క్యాన్సర్ నుంచి బయటపడిన నవ్రతిలోవా

టెన్నిస్ దిగ్గజం మార్టినా నవ్రతిలోవా భయంకరమైన క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకుంది. 66 ఏళ్ల ఈ టెన్నిస్ సూపర్‌స్టార్ జనవరిలో రొమ్ము, గొంతు క్యాన్సర్ బారిన పడింది. వెంటనే జాగ్రత్త పడి ప్రారంభ దశలోనే చికిత్స ప్రారంభించడంతో కోలుకుంది. గతంలో 2010లో కూడా ఇదే రొమ్ము క్యాన్సర్ నుంచి ఆమె సురక్షితంగా బయటపడింది. నవ్రతిలోవా కెరీర్‌లో 18 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ నెగ్గింది.



ఆసీస్ అదరహో

- గెలిపించిన టెయిలెండర్లు
- తొమ్మిదో వికెట్‌కు 55 పరుగుల భాగస్వామ్యం
- కమిన్స్ కెప్టెన్ ఇన్నింగ్స్
- 'యాషెస్' తొలి టెస్టులో 2 వికెట్లతో ఓడిన ఇంగ్లండ్

బర్మింగ్‌హమ్: ఉదయం సెషన్‌లో చినుకులు... మధ్యాహ్నం సెషన్‌లో వికెట్లు... సాయంత్రం సెషన్‌లో టెయిలెండర్ల పరుగులు... ఆఖరి రోజును ఆద్యంతం రక్తికట్టించాయి. ఆస్ట్రేలియా బ్యాటర్స్ నిరాశ పరిచిన చోట... ఇంగ్లండ్ బౌలింగ్ పదునెక్కుతున్న వేళ... 'డ్రా'కు అవకాశమివ్వకుండా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ (73 బంతుల్లో 44 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), నాథన్ లయన్ (28 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు) చక్కని పోరాటం చేశారు. దీంతో ఇంగ్లండ్ గెలిచేందుకు బాట వేసుకున్న ఆఖరి సెషన్‌లో వీళ్లిద్దరు పిచ్‌పై పరుగులతో పాగా వేశారు. అబేధ్యమైన తొమ్మిదో వికెట్‌కు 55 పరుగులు జోడించి ఆస్ట్రేలియాను ఓటమి కోరల్లోంచి గెలుపు మజిలీకి చేర్చారు. దీంతో ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో ఆస్ట్రేలియా శుభారంభం చేసింది. తొలి టెస్టులో 2 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 281 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు మంగళవారం ఓవర్‌నైట్ స్కోరు 107/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆస్ట్రేలియా 92.3 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసి గెలిచింది. ఆఖరి రోజు ఆసీస్ విజయానికి 174 పరుగులు అవసరం కాగా... ఆశలు పెట్టుకున్న ప్రధాన బ్యాటర్స్ ట్రవిస్ హెడ్ (16; 3 ఫోర్లు), గ్రీన్ (28; 2 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (65; 7 ఫోర్లు) కీలకమైన తరుణంలో ఇంగ్లండ్ బౌలింగ్‌కు తలవంచారు. ఫామ్‌లో ఉన్న క్యారీ (20; 2 ఫోర్లు) అవుటైనప్పుడు ఆసీస్ స్కోరు 227/8. లక్ష్యానికి 54 పరుగుల దూరం. మిగిలిందల్లా టెయిలెండర్లే కావడంతో ఆసీస్‌పై ఆసీస్‌కే గెలుస్తామన్న ఆశల్లేవు. ఈ దశలో కమిన్స్, లయన్ ఇంగ్లండ్ కట్టుదిట్టమైన బౌలింగ్‌ను ఎదుర్కొని, వికెట్ల ముందు గోడకట్టి మరీ గెలిచేందుకు పరుగు... పరుగు జత చేశారు. ఆసీస్‌కు 'డ్రా' చేసుకోవడమే గగనం అనుకుంటే ఇద్దరి వీరోచిత ప్రదర్శన ఏకంగా విజయాన్నే కట్టబెట్టింది. అటకు ముందు ఆఖరి రోజు రసపట్టులో ఉన్న టెస్టుతో వర్షం కూడా చాలా సేపు దోబూచులాడింది. దీంతో తొలి సెషన్ పూర్తిగా రద్దయ్యింది. దీంతో అందుబాటులో ఉన్న 67 ఓవర్లలోనే ఆస్ట్రేలియా లక్ష్యాన్ని ఛేదించాల్సిన పరిస్థితి వచ్చింది. ఐదు టెస్టుల సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0తో ఆధిక్యంలో నిలువగా, ఇరు జట్ల మధ్య 28 నుంచి లార్డ్స్‌లో రెండో టెస్టు జరుగుతుంది.


ఇంగ్లండ్ కెప్టెన్ స్టోక్స్

సంక్షిప్త స్కోర్లు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 393/8 డిక్లేర్డ్; **ఆస్ట్రేలియా ఇన్నింగ్స్:** 386 ఆలౌట్; **ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్:** 273 ఆలౌట్; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్:** 282/8 (92.3 ఓవర్లలో) (ఖ్వాజా 65, వార్నర్ 36, కమిన్స్ 44 నాటౌట్, బ్రాడ్ 3/64).


లయన్, కమిన్స్ విజయ సంబరం

కెరీర్ బెస్ట్ ర్యాంక్‌లో సాత్విక్-చిరాగ్ జోడీ

ప్రపంచ బ్యాడ్మింటన్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: గత ఆదివారం ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 బ్యాడ్మింటన్ టోర్నీలో సాధించిన డబుల్స్ టైటిల్ భారత జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టికి కెరీర్ బెస్ట్ అందుకునేలా చేసింది. మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో సాత్విక్ సాయిరాజ్ (ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (మహారాష్ట్ర) ద్వయం మూడు స్థానాలు ఎగబాకి కెరీర్ బెస్ట్ మూడో ర్యాంక్‌కు చేరుకుంది. ఈ ఏడాది సాత్విక్-చిరాగ్ జంట స్విస్ ఓపెన్, ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ టైటిల్స్ సాధించడంతోపాటు ఆసియా చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం సాధించింది.

పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ తొమ్మిదో ర్యాంక్‌లో కొనసాగుతుండగా... లక్ష్య సేన్ 18వ ర్యాంక్‌లో, కిడాంబి శ్రీకాంత్ 19వ ర్యాంక్‌లో, ప్రియాన్షు రజావత్ 30వ ర్యాంక్‌లో ఉన్నారు. టాప్-100లో భారత్ నుంచి 12 మంది క్రీడాకారులు ఉండటం విశేషం.

మహిళల సింగిల్స్‌లో పీవీ సింధు రెండు స్థానాలు పురోగతి సాధించి 12వ ర్యాంక్‌కు చేరుకోగా... సైనా నెహ్వాల్ ఒక స్థానం మెరుగుపర్చుకొని 31వ ర్యాంక్‌లో నిలిచింది. ఆకర్షి కశ్యప్, అష్మిత చాలిహా, మాళవిక బన్సోద్ వరుసగా 41వ, 43వ, 46వ ర్యాంక్‌ల్లో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లోనూ భారత్ నుంచి 12 మంది క్రీడాకారిణులు టాప్-100లో ఉండటం విశేషం. మహిళల డబుల్స్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ ద్వయం 16వ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో సిక్కి రెడ్డి-రోహన్ కపూర్ జంట 33వ ర్యాంక్‌లో నిలిచి భారత నంబర్‌వన్ జోడీగా ఉంది.



భారత్ X పాకిస్తాన్

నేటి నుంచి 'శాఫ్' ఫుట్‌బాల్ టోర్నీ

బెంగళూరు: ఇంటర్ కాంటినెంటల్ కప్ గెలుచుకున్న ఉత్సాహంతో ఉన్న భారత జట్టు దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) టోర్నీలో ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది. పాకిస్తాన్‌తో నేడు జరిగే మ్యాచ్‌తో ఎనిమిదిసార్లు చాంపియన్ భారత జట్టు టోర్నీని మొదలు పెట్టనుంది. రాత్రి గం. 7:30 నుంచి జరిగే ఈ మ్యాచ్‌ను 'ఫ్యాన్ కోడ్' యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

ఫైనల్లో భారత్, బంగ్లాదేశ్

మోంగ్‌కాక్ (హాంకాంగ్): ఎమర్జింగ్ కప్ ఆసియా అండర్-23 మహిళల టి20 క్రికెట్ టోర్నీలో భారత్, బంగ్లాదేశ్ జట్లు ఫైనల్లోకి ప్రవేశించాయి. రెండు జట్ల మధ్య టైటిల్ పోరు నేడు జరగనుంది. భారత్, శ్రీలంక మధ్య మంగళవారం జరగాల్సిన తొలి సెమీఫైనల్ వర్షం కారణంగా రద్దయింది. దాంతో గ్రూప్ దశలో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన భారత్ ఫైనల్ చేరింది. అనంతరం జరిగిన రెండో సెమీఫైనల్లో బంగ్లాదేశ్ ఆరు పరుగుల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది.



జింబాబ్వేను గెలిపించిన సికందర్ రజా

54 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 102 నాటౌట్

హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ క్రికెట్ టోర్నీలో ఆతిథ్య జింబాబ్వే జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. నెదర్లాండ్స్ జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'ఎ' లీగ్ మ్యాచ్‌లో జింబాబ్వే ఆరు వికెట్ల తేడాతో నెగ్గింది. సికందర్ రజా ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జింబాబ్వే జట్టును గెలిపించాడు. ముందుగా నెదర్లాండ్స్ 50 ఓవర్లలో 6 వికెట్లకు 315 పరుగులు చేసింది. విక్రమ్‌జిత్ సింగ్ (88; 9 ఫోర్లు), మాక్స్ ఒడౌడ్ (59; 10 ఫోర్లు), స్కాట్ ఎడ్వర్డ్స్ (83; 8 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించారు. స్పిన్నర్ సికందర్ రజా 55 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. 316 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జింబాబ్వే 40.5 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 319 పరుగులు చేసి గెలిచింది. క్రెయిగ్ ఇర్విన్ (50; 9 ఫోర్లు), సీన్ విలియమ్స్ (91; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఆకట్టుకోగా... సికందర్ రజా (54 బంతుల్లో 102 నాటౌట్; 6 ఫోర్లు, 8 సిక్స్‌లు) అజేయ సెంచరీ సాధించాడు. ఈ క్రమంలో వన్డేల్లో జింబాబ్వే తరఫున వేగవంతమైన సెంచరీ సాధించిన ప్లేయర్‌గా సికందర్ రజా గుర్తింపు పొందాడు.



నేపాల్‌కు తొలి విజయం

గ్రూప్ 'ఎ'లోనే జరిగిన మరో మ్యాచ్‌లో నేపాల్ ఆరు వికెట్ల తేడాతో అమెరికా జట్టును ఓడించి ఈ టోర్నీలో తొలి విజయం సాధించింది. తొలుత అమెరికా జట్టు 49 ఓవర్లలో 207 పరుగులకు ఆలౌటైంది. షాయన్ జహంగీర్ (100 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) అజేయ సెంచరీ చేశాడు. నేపాల్ బౌలర్ కరణ్ 33 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం నేపాల్ 43 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసి విజయం అందుకుంది. భీమ్ షార్కి (77 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), దీపేంద్ర సింగ్ (39 నాటౌట్; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో ఐర్లాండ్‌తో స్కాట్లాండ్; ఒమన్‌తో యూఏఈ తలపడతాయి.

అర్జెంటీనా వస్తానంటే... భారత్ వద్దన్నది!

రూ. 40 కోట్ల అప్పియరెన్స్ ఫీజుకు భారత్ 'నో'

పనాజీ: అర్జెంటీనా ప్రపంచ ఫుట్‌బాల్ చాంపియన్. పైగా సూపర్ స్టార్ మెస్సీ టీమ్. ఇలాంటి మేటి చాంపియన్ టీమ్ వచ్చి ఫ్రెండ్లీ మ్యాచ్‌లు ఆడతామంటే ఫుట్‌బాల్ అభివృద్ధి కోరే ఏ దేశమైనా ఎగిరి గంతేస్తుంది. ఎర్రతివాచీ పరిచి మరీ ఆహ్వానిస్తుంది. కానీ జనాభాలో చైనాను మించిన భారత్ మాత్రం తమ ఫుట్‌బాల్ అభిమానులకు నిరాశ కలిగించే నిర్ణయంతో అర్జెంటీనా వస్తానంటే వద్దన్నది. అర్జెంటీనా జట్టు కానీ, ఆటగాళ్లు కానీ మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్లు. అలాంటి జట్టు అప్పియరెన్స్ ఫీజుగా 50 లక్షల డాలర్లు (రూ. 40 కోట్లు) ఇస్తే చాలు అందుబాటులో ఉన్న జూన్ 12 నుంచి 20 తేదీల్లో భారత్ వేదికపై ఓ మ్యాచ్ ఆడి వెళతామంది. కానీ అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య అంత మొత్తం ఇవ్వలేం అనేసరికి మెస్సీ టీమ్ జూన్ 15న బీజింగ్‌లో ఆస్ట్రేలియాతో ఆడింది. మనకంటే చిన్నదేశం ఇండోనేసియా వాళ్లు అడిగినంత ఫీజులో ఏ లోటు లేకుండా చెల్లించి జకార్తాలో 19న అర్జెంటీనాతో ఆడి ముచ్చట తీర్చుకుంది.



చైనాతో భారత్ తొలి పోరు

ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీ



చెన్నై: భారత్‌లో తొలిసారి జరగనున్న ఆసియా చాంపియన్స్ ట్రోఫీ పురుషుల హాకీ టోర్నీ షెడ్యూల్‌ను ఆసియా హాకీ సమాఖ్య మంగళవారం విడుదల చేసింది. ఆగస్టు 3 నుంచి 12 వరకు జరిగే ఈ టోర్నీకి చెన్నైలోని మేయర్ రాధాకృష్ణన్ స్టేడియం వేదికగా నిలువనుంది. ఆతిథ్య భారత జట్టు తొలి మ్యాచ్‌ను ఆగస్టు 3న చైనాతో ఆడుతుంది. అనంతరం ఆగస్టు 4న జపాన్‌తో, 6న మలేసియాతో, 7న కొరియాతో, పాకిస్తాన్‌తో 9న భారత్ తలపడుతుంది. ఆరు జట్ల మధ్య లీగ్ మ్యాచ్‌లు ముగిశాక టాప్-4లో నిలిచిన జట్ల మధ్య సెమీఫైనల్స్ 11న, ఫైనల్ 12న జరుగుతాయి.

తెలుగు టాలన్స్ మ్యాచ్ 'డ్రా'

జైపూర్: ప్రీమియర్ హ్యాండ్‌బాల్ లీగ్‌లో ఇప్పటికే సెమీఫైనల్ చేరుకున్న తెలుగు టాలన్స్, మహారాష్ట్ర ఐరన్‌మెన్ జట్లు తొలి 'డ్రా' నమోదు చేశాయి. ఈ రెండు జట్ల మధ్య మంగళవారం జరిగిన మ్యాచ్ 30-30తో 'డ్రా' అయింది. తెలుగు టాలన్స్ తరఫున దవిందర్ ఏడు గోల్స్ చేశాడు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గోల్డెన్ ఈగల్స్ ఉత్తరప్రదేశ్‌తో ఢిల్లీ పంజెర్స్; గర్విత్ గుజరాత్‌తో తెలుగు టాలన్స్ తలపడతాయి.

ఆసియా క్రీడలకు సాకేత్ మైనేని, సహజ





న్యూఢిల్లీ: ఆసియా క్రీడల్లో పాల్గొనే 12 మంది సభ్యులతో కూడిన భారత టెన్నిస్ జట్లను ప్రకటించారు. పురుషుల జట్టులో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ సాకేత్ మైనేనికి... మహిళల జట్టులో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లికి చోటు దక్కింది. 35 ఏళ్ల సాకేత్ ఆసియా క్రీడలకు ఎంపిక కావడం ఇది రెండోసారి. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సాకేత్ పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజతం... సానియా మీర్జాతో కలిసి మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం సాధించాడు. 22 ఏళ్ల సహజ తొలిసారి ఆసియా క్రీడల్లో బరిలోకి దిగనుంది. ఆసియా క్రీడలు సెప్టెంబర్ 23 నుంచి అక్టోబర్ 8 వరకు చైనాలోని హాంగ్జౌ పట్టణంలో జరుగుతాయి. **భారత పురుషుల జట్టు:** రోహన్ బోపన్న, సుమిత్ నగాల్, శశికుమార్, రామ్‌కుమార్ రామనాథన్, యూకీ బాంబ్రీ, సాకేత్ మైనేని. **భారత మహిళల జట్టు:** అంకితా రైనా, కర్మన్‌కౌర్, రుతుజా భోస్లే, సహజ యామలపల్లి, వైదేహి చౌదరి, ప్రార్థన.


నాని

సీక్వెల్.. మార్పుల్...

కథ పెద్దదైతే సినిమా రెండు భాగాలవుతుంది.. ఒక్కోసారి మూడు కూడా అవుతుంది. ఇప్పుడలాంటి కథలతో రూపొందుతున్న సీక్వెల్స్ కొన్ని ఉన్నాయి. అయితే ఒకటో భాగంలో నటించిన నటీనటులు, తెరకెక్కించిన దర్శకుడు రెండో భాగంలో కంటిన్యూ కావడంలేదు. ఒకటీ హీరో మారుతున్నారు.. లేదా డైరెక్టర్ మారుతున్నారు... లేదా హీరోయిన్ మారుతున్నారు... ఇక మార్పుల్‌తో రూపొందుతున్న సీక్వెల్స్ గురించి తెలుసుకుందాం.


హిట్: ది థర్డ్ కేస్

తెలుగు చిత్ర పరిశ్రమలో 'హిట్' ఫ్రాంచైజీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకించి చెప్పక్కర్లేదు. శైలేష్ కొలను దర్శకత్వం వహించిన 'హిట్: ది ఫస్ట్ కేస్', 'హిట్: ది సెకండ్ కేస్' చిత్రాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ రెండు చిత్రాలను నిర్మించింది హీరో నాని కావడం విశేషం. కాగా తొలి రెండు భాగాలు నిర్మించిన నాని థర్డ్ పార్ట్ 'హిట్: ది థర్డ్ కేస్'లో హీరోగా నటించనుండటం విశేషం. 'హిట్: ది ఫస్ట్ కేస్' (2020) చిత్రంలో విశ్వక్ సేన్ హీరోగా నటించారు. క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో హోమిసైడ్ ఇంటర్వెన్షన్ టీమ్‌ను (హిట్) లీడ్ చేసే పోలీస్ ఆఫీసర్ రుద్రరాజు పాత్రలో నటుడిగా విశ్వక్ సేన్‌కి మంచి మార్కులే పడ్డాయి. ఈ మూవీ మంచి హిట్‌గా నిలిచింది. కాగా హిట్ ఫ్రాంచైజీలో రెండో భాగం 'హిట్: ది సెకండ్ కేస్'లో హీరోగా అడివి శేష్‌ని తీసుకున్నారు శైలేష్. ఎస్పీ కృష్ణదేవ్ పాత్రలో అడివి శేష్ తనదైన శైలిలో నటించి, మెప్పించారు. ఈ సినిమా కూడా హిట్. ఇక మూడో భాగం 'హిట్: ది థర్డ్ కేస్'లో హీరో నాని నటించనున్నట్లు 'హిట్: ది సెకండ్ కేస్' చివర్లో రివీల్ చేశారు. పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నాని నటిస్తారు. కాగా హిట్ ఫ్రాంచైజీలో మొత్తం 7 భాగాలుంటాయని శైలేష్ కొలను గతంలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

చంద్రముఖి-2


కంగనా, లారెన్స్

'చంద్రముఖి' (2005)లో 'లక లక లక..' అంటూ హీరో రజనీకాంత్ రాజు గెటప్‌లో విలనిజమ్ పండించి, డాక్టర్ ఈశ్వర్‌గా మంచితనం కనబరిస్తే ప్రేక్షకులు కాసుల వర్షం కురిపించారు. పి. వాసు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో రజనీకాంత్, నయనతార జంటగా జ్యోతిక, ప్రభు కీలక పాత్రలు చేశారు. 'చంద్రముఖి' విడుదలైన 18 ఏళ్లకు సీక్వెల్‌కి శ్రీకారం చుట్టారు పి. వాసు. 'చంద్రముఖి 2' పేరుతో తెరకెక్కిన ఈ చిత్రంలో రజనీ ప్లేస్‌లోకి లారెన్స్ వచ్చారు. అలాగే కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించారు. ఇంకా వడివేలు, లక్ష్మీ మీనన్, రాధిక తదితరులు నటించారు. ఇటీవల మైసూర్‌లో జరిగిన షెడ్యూల్‌తో ఈ మూవీ పూర్తయింది. తమిళ, తెలుగు భాషల్లో సెప్టెంబర్ 15న రిలీజ్ కానున్న ఈ చిత్రానికి ఎం ఎం కీరవాణి స్వరకర్త.


ధనుష్

యుగానికి ఒక్కడు-2

వైవిధ్యమైన చిత్రాలతో తెలుగు, తమిళ ప్రేక్షకులను అలరించారు దర్శకుడు సెల్వ రాఘవన్. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'ఆయిరత్తిల్ ఒరువన్' (తెలుగులో యుగానికి ఒక్కడు -2010) ఎంత హిట్ అయిందో చెప్పక్కర్లేదు. కార్తీ హీరోగా, ఆండ్రియా, రీమా సేన్ హీరోయిన్లుగా నటించారు. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'ఆయిరత్తిల్ ఒరువన్ 2' (యుగానికి ఒక్కడు 2) తెరకెక్కించనున్నారు సెల్వ రాఘవన్. అయితే ఈ సినిమాలో తన సోదరుడు, హీరో ధనుష్‌ని లీడ్ రోల్‌కి తీసుకున్నారాయన. కార్తీ స్థానంలో ధనుష్ కనిపిస్తారని కొందరు అంటుంటే.. అలాంటిదేం లేదు.. కార్తీ కూడా ఉంటారు.. సీక్వెల్‌లో ధనుష్ పాత్ర యాడ్ అయిందని మరికొందరు అంటున్నారు. మరి 'యుగానికి ఒక్కడు 2'లో కార్తీ పాత్ర ఉంటుందా? లేదా? అనేది చూడాలి.



అనుపమ

టిల్లు స్క్వేర్


మల్లిక్ రామ్

'డీజే టిల్లు పేరు వీని స్టయిలే వేరు..' అంటూ హీరో సిద్ధు జొన్నలగడ్డ స్టెప్పులేస్తే ప్రేక్షకులు కూడా ఫుల్‌గా ఎంజాయ్ చేశారు. విమల్ కృష్ణ దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'డీజే టిల్లు'. రొమాంటిక్ క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది విడుదలై సూపర్‌హిట్‌గా నిలిచింది. ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'టిల్లు స్క్వేర్' మూవీ తెరకెక్కుతోంది. అయితే సీక్వెల్‌కి అటు డైరెక్టర్, ఇటు హీరోయిన్ ఇద్దరూ మారడం విశేషం. 'టిల్లు స్క్వేర్'కి మల్లిక్ రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే తొలి భాగంలో నేహా శెట్టి హీరోయిన్‌గా నటించి గ్లామర్‌తో మెప్పించారు. అయితే సీక్వెల్‌లో మాత్రం అనుపమా పరమేశ్వరన్‌ని హీరోయిన్‌గా తీసుకున్నారు. ఈ సినిమాని సెప్టెంబర్ 15న విడుదల చేయాలనుకుంటున్నారు.


చేతన్ చీను


కీరవాణి


గోకుల్ కృష్ణ

జెంటిల్‌మన్-2

అర్జున్, మధుబాల జంటగా శంకర్ దర్శకత్వంలో కేటీ కుంజుమోన్ నిర్మించిన 'జెంటిల్‌మేన్' (1993) చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచింది. దాదాపు ముప్పైఏళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్ 'జెంటిల్‌మన్ 2'ని నిర్మిస్తున్నారు కుంజుమోన్. అయితే రెండో భాగంలో దర్శకుడు, హీరో, సంగీత దర్శకుడు ముగ్గురూ మారడం విశేషం. గోకుల్ కృష్ణ దర్శకత్వం వహించనున్న ఈ సీక్వెల్‌లో 'మంత్ర-2, రాజుగారి గది, పెళ్లికి ముందు ప్రేమకథ' వంటి చిత్రాల్లో నటించిన చేతన్ చీను హీరోగా నటించనున్నారు. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రూపొందనున్న ఈ చిత్రం కన్నడ, మలయాళ భాషల్లో డబ్బింగ్ కానుంది.

జిగర్తండా-2

సిద్ధార్థ్, బాబీ సింహా, లక్ష్మీ మీనన్ కీలక పాత్రల్లో కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'జిగర్తండా' (2014) తమిళంలో ఘనవిజయం సాధించింది. ఈ చిత్రం తెలుగులో వరుణ్ తేజ్ హీరోగా 'గద్దలకొండ గణేష్'గా రీమేక్ అయి, ఇక్కడా ఘనవిజయం సాధించింది. కాగా 'జిగర్తండా' విడుదలైన దాదాపు తొమ్మిదేళ్లకు 'జిగర్తండా డబుల్ ఎక్స్' పేరుతో కార్తీక్ సుబ్బరాజ్ సీక్వెల్ తీశారు. ఇందులో రాఘవ లారెన్స్, ఎస్‌జే సూర్య లీడ్ రోల్స్‌లో నటించారు. గ్యాంగ్‌స్టర్ డ్రామా నేపథ్యంలో కార్తీక్ సుబ్బరాజ్ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ దీపావళికి విడుదల కానుంది.


ఎస్.జె. సూర్య

ఇవే కాదు.. మరికొన్ని సినిమాల సీక్వెల్స్‌లో కూడా నటీనటులు, దర్శకులు, సంగీత దర్శకులు మారుతున్నారు.

మెగా ఆనందం


రామ్‌చరణ్, ఉపాసన

చిరంజీవి కుటుంబానికి మంగళవారం (జూన్ 20) మెగా ఆనందాన్నిచ్చింది. రామ్‌చరణ్ భార్య ఉపాసన ఒక పాపకు జన్మనిచ్చారు. చరణ్-ఉపాసనలకు 2012 జూన్ 14న పెళ్లయింది. కాగా అల్లు అరవింద్ దంపతులు, అల్లు అర్జున్, స్నేహ, వరుణ్ తేజ్ తదితరులు ఆస్పత్రికి వెళ్లి చరణ్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్నేళ్లకు నెరవేరింది - చిరంజీవి

అపోలో ఆస్పత్రిలో మనవరాలిని చూశాక చిరంజీవి మాట్లాడుతూ– ''మంగళవారం ఉదయం 1 గంట 49 నిమిషాలకు పాప పుట్టింది. చరణ్, ఉపాసన తల్లిదండ్రులై, బిడ్డలను మా చేతిలో పెట్టాలని ఎన్నో సంవత్సరాల నుంచి అనుకుంటున్నాం. ఇన్నేళ్లకు ఆ భగవంతుడి దయ, అందరి ఆశీస్సుల వల్ల ఆ కోరిక నెరవేరింది. పాప పుట్టిన ఘడియలు చాలా మంచివని పెద్దలు అంటున్నారు. ఈ మధ్య కాలంలో చరణ్ ఎదుగుదల, తను సాధించిన విజయాలు, వరుణ్ తేజ్ ఎంగేజ్‌మెంట్.. ఇలా మా ఇంట్లో అన్నీ శుభకార్యాలే జరగటం చూస్తుంటే ఈ బిడ్డ ప్రభావం కూడా ఉందని అనుకుంటున్నాను. నా కుటుంబం ఆంజనేయ స్వామినే నమ్ముకున్నాం. మంగళవారం రోజున ఆడబిడ్డను ప్రసాదించటంతో అపురూపంగా భావిస్తున్నాం'' అన్నారు.

ట్రైలర్ చూస్తుంటే టెన్షన్ మొదలైంది - హీరో కార్తికేయ


గరిమా కౌశల్, శివ, ప్రగతి, కార్తికేయ

''శివ కందుకూరి మొదట్లో సాఫ్ట్ సినిమా చేశాడు. 'మను చరిత్ర' ట్రైలర్ చూస్తుంటే టెన్షన్ మొదలైంది.. ఎందుకంటే శివ నాకు పోటీ వచ్చినట్లు అనిపించింది (నవ్వుతూ). నా 'ఆర్‌ఎక్స్ 100' విడుదలకు ముందు ఎలాంటి వైబ్స్ ఉన్నాయో ఇప్పుడూ అలానే అనిపిస్తోంది. 'మను చరిత్ర' పెద్ద విజయం సాధిస్తుంది'' అని హీరో కార్తికేయ అన్నారు. శివ కందుకూరి హీరోగా భరత్ పెదగాని దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మను చరిత్ర'. మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్ కథానాయికలు. ఎన్. శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి కార్తికేయ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. శివ కందుకూరి మాట్లాడుతూ– ''మను చరిత్ర' నాకు స్పెషల్ మూవీ'' అన్నారు. ''మను చరిత్ర' స్వచ్ఛమైన కథ'' అన్నారు భరత్ పెదగాని.

మంచి ఎంటర్‌టైనర్ - దశరథ్


దశరథ్, డీవై చౌదరి, రోహిత్, అపర్ణ

రోహిత్ బెహల్, అపర్ణా జనార్ధనన్ జంటగా నటించిన చిత్రం 'లవ్ యూ రామ్'. దర్శకుడు కె. దశరథ్ కథ అందించిన ఈ చిత్రానికి డీవై చౌదరి దర్శకత్వం వహించారు. దర్శకుడు కె. దశరథ్, డీవై చౌదరి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. ఈ వేడుకలో రోహిత్ మాట్లాడుతూ– ''ఈ సినిమా ప్రయాణంలో చాలా విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు. దశరథ్ మాట్లాడుతూ– ''లవ్ యూ రామ్' మంచి ఎంటర్‌టైనర్. కథ, మ్యూజిక్ అన్నీ బాగున్నాయి. మైత్రీ మూవీస్ వారి ద్వారా ఈ సినిమాను విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''అందరికీ నచ్చేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు డీవై చౌదరి.

ఎడిటర్ పి. వెంకటేశ్వరరావు మృతి



సీనియర్ ఎడిటర్ పి. వెంకటేశ్వరరావు (72) చెన్నైలో తుదిశ్వాస విడిచారు. ఆరు నెలలుగా అనారోగ్యంతో ఇబ్బందిపడుతున్న ఆయన చెన్నైలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మంగళవారం కన్నుమూశారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో దాదాపు రెండొందల చిత్రాలకు పైగా వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా వర్క్ చేశారు. 'యుగంధర్', 'మొండి మొగుడు పెంకి పెళ్ళాం', 'కెప్టెన్ కృష్ణ', 'ఇద్దరూ అసాధ్యులే' వంటి పలు హిట్ చిత్రాలకు ఎడిటర్‌గా చేశారు వెంకటేశ్వరరావు. ఆయన భార్య కొన్నేళ్ల క్రితం మరణించారు. ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా వెంకటేశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు, తెలుగు ఫిల్మ్ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కోటగిరి వెంకటేశ్వర రావు, ప్రధాన కార్యదర్శి మార్తాండ్ కె. వెంకటేష్ సంతాపం వ్యక్తం చేశారు. వెంకటేశ్వరరావు అంత్యక్రియలు ఈ నెల 22న చెన్నైలో జరుగుతాయి.

సాక్షి బిజినెస్

బుధవారం
21-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	159	63,328
నిఫ్టీ ▲	61	18,817

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.00 గంటలకు)			
నాస్‌డాక్	13,683	▽	6
డోజోన్స్	34,127	▽	172
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,569	▽	19
డాక్స్	16,111	▽	90
షాంఘై	3,240	▽	15
నికాయ్	33,389	▲	18

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	59,345	▲	118
బంగారం (99.5 స్వచ్ఛత)	59,107	▲	117
వెండి (కిలో)	72,091	▽	268

మలబార్‌తో అనుబంధం హర్షణీయం

- జూనియర్ ఎన్టీఆర్
- బ్రాండ్ అంబాసిడర్‌గా మరోసారి సంతకాలు

హైదరాబాద్: ప్రపంచ వ్యాప్తంగా 11 దేశాల్లో 320 షోరూమ్‌లతో 6వ అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్‌గా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ బ్రాండ్ అంబాసిడర్‌గా జూనియర్ ఎన్టీఆర్ కొనసాగనున్నారు. సంబంధిత పత్రాలపై ఆయన సంతకాలు చేశారు. సంస్థ ప్రచార చిత్రాలతో ఆయన వినియోగదారులను ఆకట్టుకోనున్నారు. బ్రాండ్ అంబాసిడర్‌గా జూనియస్ ఎన్టీఆర్ రెండో ఇన్నింగ్స్‌తో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 30వ వార్షికోత్సవాలకు మరింత శోభ చేకూరనుందని సంస్థ ఒక ప్రకటనలో తెలిపింది.



ప్రముఖ జ్యువెలరీ రిటైలర్‌తో భాగస్వామ్యం కొనసాగడం సంతోషంగా ఉందని జూనియర్ ఎన్టీఆర్ పేర్కొన్నారు. కాగా, దేశ వ్యాప్తంగా ఆరాధించే సినీ తారల్లో ఒకరైన జూనియర్ ఎన్టీఆర్‌తో తమ సంస్థ అనుబంధం కొనసాగడం వల్ల.. ప్రపంచవ్యాప్తంగా నంబర్ 1 రిటైలర్ జ్యువెలరీ బ్రాండ్‌గా నిలవాలనే తమ ఆశయం త్వరలోనే నెరవేరుతుందన్న విశ్వాసం మరింత బలపడుతోందని మలబార్ గ్రూప్ చైర్మన్ ఎంపీ అహ్మద్ తెలిపారు. కస్టమర్లకు ప్రపంచ స్థాయి ఆభరణాల షాపింగ్ అనుభూతితో పాటు పారదర్శకత, ఆభరణాల డిజైన్‌లో వైవిధ్యం, నైపుణ్యం తదితర అంశాలకు సంబంధించి తమ నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నట్లు వెల్లడించారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
21-6-2023	
విశాఖ	550-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	525-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
20-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	535-00
వరంగల్	537-00
రిటైల్ ధర	5.95

దేశంలో విలువైన కంపెనీ రిలయన్స్

- 16.4 లక్షల కోట్ల మార్కెట్ విలువ
- అత్యంత లాభదాయక, పన్ను చెల్లించే సంస్థ
- తర్వాతి స్థానాల్లో టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశంలోనే అత్యంత విలువైన కంపెనీగా మరోసారి గుర్తింపు సొంతం చేసుకుంది. '2022 బుర్గుండీ ప్రైవేటు హురూన్ ఇండియా 500' జాబితా మంగళవారం విడుదలైంది. 16.4 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రిలయన్స్ మొదటి స్థానంలో ఉంటే, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) రూ.11.8 లక్షల కోట్ల మార్కెట్ క్యాప్‌తో రెండో అత్యంత విలువైన కంపెనీగా నిలిచింది. రూ.9.4 లక్షల కోట్ల మార్కెట్ విలువతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మూడో స్థానంలో ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విలీనం అనంతరం రిలయన్స్ తర్వాత రెండో అత్యంత విలువైన కంపెనీ స్థానానికి చేరుకునే అవకాశం ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ మరికొన్ని ప్రత్యేకతలు కూడా సొంతం చేసుకుంది. 2022-23 సంవత్సరానికి రూ.67,845 కోట్ల లాభంతో అత్యంత లాభదాయక సంస్థగానూ ఉంది. అలాగే, అత్యధికంగా రూ.16,297 కోట్ల పన్నును చెల్లించింది.



టాప్-10 మార్కెట్ విలువ(రూ.కోట్లలో)	
కంపెనీ	2023 ఏప్రిల్ 30 నాటికి
రిలయన్స్ ఇండస్ట్రీస్	16,37,327
టీసీఎస్	11,76,385
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	9,41,386
ఐసీఐసీఐ బ్యాంక్	6,41,930
ఐటీసీ	5,29,682
ఇన్ఫోసిస్	5,19,794
హెచ్‌డీఎఫ్‌సీ	5,08,172
భారతీ ఎయిర్‌టెల్	4,76,737
కోటక్ మహీంద్రా బ్యాంక్	3,84,001
ఎల్‌అండ్‌టీ	3,31,694

సీరమ్ ఇనిస్టిట్యూట్

అన్‌లిస్టెట్ కంపెనీల్లో అత్యంత విలువైన సంస్థగా సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా నిలిచింది. ఈ సంస్థ మార్కెట్ విలువ రూ.1.97 లక్షల కోట్లుగా ఉంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ రూ.1.65 లక్షల కోట్ల మార్కెట్ విలువతో రెండో స్థానాన్ని సొంతం చేసుకుంది. రూ.69,100 కోట్లతో బైజూస్ మూడో అత్యంత విలువైన అన్‌లిస్టెడ్ సంస్థగా ఉంది. 2022 అక్టోబర్ 30 నుంచి 2023 ఏప్రిల్ 30 మధ్య ఆరు నెలల కాలంలో దేశంలోని టాప్-500 ప్రైవేటు కంపెనీల మార్కెట్ విలువల వ్యత్యాసాన్ని బర్గుండీ ప్రైవేటు, హురూన్ ఇండియా ట్రాక్ చేసి ఈ నివేదికను రూపొందించాయి. మార్కెట్ విలువ ఆధారంగానే వాటికి ర్యాంకులను కేటాయిస్తుంటాయి. దేశంలోని టాప్-500 ప్రైవేటు కంపెనీల మార్కెట్ విలువ 2022 అక్టోబర్ 30 నాటికి రూ.227 లక్షల కోట్లుగా ఉండగా, 2023 ఏప్రిల్ 30 నాటికి 6.4 శాతం క్షీణించి రూ.212 లక్షల కోట్లకు పరిమితమైంది. టాప్-10 కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.71.5 లక్షల కోట్లుగా ఉంది. దేశ జీడీపీలో ఇది 37 శాతానికి సమానం. అత్యధికంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ మార్కెట్ విలువను పెంచుకున్నాయి. అదానీ గ్రూపులో ఎనిమిది కంపెనీల మార్కెట్ విలువ 52 శాతం క్షీణించింది.

హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా విక్రయం

డీల్ విలువ రూ. 9,060 కోట్లు

న్యూఢిల్లీ: విద్యా రుణాల విభాగం హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలాను క్రిస్‌క్యాపిటల్ తదితర పీఈ దిగ్గజాల కన్సార్షియంకు విక్రయించినట్లు మార్టిగేజ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ తాజాగా పేర్కొంది. కంపెనీలో 90 శాతం వాటాను రూ. 9,060 కోట్లకు విక్రయించినట్లు వెల్లడించింది. ప్రయివేట్ రంగ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుతో విలీనం నేపథ్యంలో విద్యా రుణాల సంస్థను హెచ్‌డీఎఫ్‌సీ విక్రయించింది. బీపీఈఏ ఈక్యూటీ, క్రిస్‌క్యాపిటల్ ఇన్వెస్టర్ల కన్సార్షియంకు హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలా ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను విక్రయించేందుకు తప్పనిసరి ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ ద్వయం తాజాగా తెలియజేశాయి. దేశ, విదేశాలలో ఉన్నత విద్యనభ్యసించేందుకు విద్యార్థులకు రుణాలందించే హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిలాలో 9.99% వాటాను కొనసాగించనున్నట్లు హెచ్‌డీఎఫ్‌సీ వెల్లడించింది.

ఫార్మా ఎగుమతులు రూ.2,29,600 కోట్లు!

- 2023-24లో ఫార్మెక్సిల్ అంచనా
- జూలై 5 నుంచి హైటెక్స్‌లో ఐఫెక్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశం నుంచి ఔషధ ఎగుమతులు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ నుంచి వివిధ దేశాలకు సరఫరా అయ్యే ఫార్మా ఉత్పత్తుల విలువ రూ.2,29,600 కోట్లకు చేరుకుంటుందని ఫార్మాస్యూటికల్స్ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఫార్మెక్సిల్) అంచనా వేస్తోంది. 2022-23లో ఇది 3.25% ఎగసి రూ.2,08,198 కోట్లు నమోదైందని ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ రవి ఉదయ భాస్కర్ మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'ఎగుమతుల విషయంలో ఇతర విభాగాలు అంతగా ప్రతిభ కనబర్చలేదు. అనేక ఎదురుగాలులు, ప్రపంచ సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఫార్మా ఈ స్థాయి వృద్ధిని సాధించింది. ఎగుమతుల్లో 31% పైగా వాటా ఉన్న యూఎస్ విపణి స్థిరంగా ఉంది. ఇది నిరంతర వృద్ధిని సూచిస్తున్న సానుకూల సంకేతం. మొత్తం ఎగుమతులు 2023 ఏప్రిల్‌లో 10% పైగా, మే నెలలో 0.7% అధికం అయ్యాయి' అని వివరించారు.



మీడియాతో మాట్లాడుతున్న రవి ఉదయ భాస్కర్. చిత్రంలో లక్ష్మీ ప్రసన్న

ఐఫెక్స్ జూలై 5 నుంచి..

ఇంటర్నేషనల్ ఫార్మా ఎగ్జిబిషన్ (ఐఫెక్స్) జూలై 5 నుంచి ప్రారంభం కానుంది. హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో మూడు రోజులపాటు ఈ కార్యక్రమం జరుగనుందని ఫార్మెక్సిల్ రెగ్యులేటరీ అఫైర్స్ డైరెక్టర్ లక్ష్మీ ప్రసన్న తెలిపారు. 375కు పైగా ఎగుమతిదార్లు తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించనున్నారు.

470 విమానాలకు ఎయిరిండియా ఆర్డర్

- ఎయిర్‌బస్, బోయింగ్‌తో ఒప్పందం
- డీల్ విలువ రూ.5,74,700 కోట్లు

న్యూఢిల్లీ: విమానయాన రంగ సంస్థ ఎయిరిండియా 470 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది. ప్యారిస్ ఎయిర్ షో సందర్భంగా ఎయిర్‌బస్, బోయింగ్‌తో ఈ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మంగళవారం ప్రకటించింది. డీల్ విలువ రూ.5,74,700 కోట్లు. టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా వైడ్ బాడీ ఎయిర్‌క్రాఫ్ట్‌లతో సహా 470 విమానాలను కొనుగోలు చేయనున్నట్లు 2023 ఫిబ్రవరిలో ప్రకటించిన సంగతి తెలిసిందే.



ఈ ఏడాది చివర్లో కొత్త ఎయిర్‌క్రాఫ్ట్ డెలివరీలకు ఎయిర్‌బస్ ఏ350 నాయకత్వం వహిస్తుందని, 2025 మధ్యకాలం నుండి ఆర్డర్‌లో ఎక్కువ భాగం విమానాలు ల్యాండ్ అవుతాయని కంపెనీ పేర్కొంది. దీర్ఘకాలిక వృద్ధి, విజయానికి పెద్ద అడుగు పడిందని టాటా సన్స్, ఎయిరిండియా చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ప్రైవేట్ కార్లకు కనీసం రూ. 2,094

- టూ-వీలర్లకు రూ. 538
- థర్డ్ పార్టీ బేస్ ప్రీమియం రేట్ల ప్రతిపాదనలు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను (2023-24) వివిధ రకాల వాహనాల థర్డ్-పార్టీ మోటార్ ఇన్సూరెన్స్‌కి సంబంధించి కేంద్రం కొత్త బేస్ ప్రీమియం రేట్లను ప్రతిపాదించింది. బీమా రంగ నియంత్రణ సంస్థ ఐఆర్‌డీఏఐతో సంప్రదించిన మీదట 1,000 సీసీ సామర్థ్యం లోపు గల ప్రైవేట్ కార్లకు రూ. 2,094, 1000-1,500 సీసీ కార్లకు రూ. 3,416, అంతకు మించిన వాటికి రూ. 7,897 బేస్ ప్రీమియంను సూచించింది. కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ ఈ మేరకు ఒక ముసాయిదా నోటిఫికేషన్ జారీ చేసింది. పరిశ్రమ వర్గాలు 30 రోజుల్లోగా దీనిపై అభిప్రాయాలు చెప్పాలి. నోటిఫికేషన్ ప్రకారం..

- 75 సీసీ లోపు సామర్థ్యమున్న టూ-వీలర్లకు రేటు రూ. 538గాను, అంతకు మించి 350 సీసీ వరకు రూ. 714-2,804 శ్రేణిలోనూ బేస్ ప్రీమియం ఉండనుంది.



- గూడ్స్ రవాణా చేసే వాణిజ్య వాహనాలకు సంబంధించి (త్రిచక్ర వాహనాలు కాకుండా) 7,500 కేజీలలోపు వైతే రూ. 16,049, అది దాటి 40,000 కేజీలు.. అంతకు పైన వాటికి రూ. 27,186-44,242 శ్రేణిలో బేస్ ప్రీమియం రేటు ఉంటుంది.
- ఈ-కార్టులు మినహా మోటార్ త్రీ-వీలర్లకు బేస్ ప్రీమియంను రూ. 4,492గా ప్రతిపాదించారు.
- అటు ప్రైవేట్ ఈ-కార్ల విషయానికొస్తే.. 30 కిలోవాట్ సామర్థ్యం ఉన్న వాటికి రూ. 1,780, అంతకు మించి 65 కేడబ్ల్యూ వరకు రూ. 2,904, దాన్ని దాటితే రూ. 6,712 గాను బేస్ ప్రీమియం ఉండనుంది.

నష్టాల్లోంచి లాభాల్లోకి...



- ఆదుకున్న ఆఖరి గంట కొనుగోళ్లు
- మళ్లీ 18,880 పైకి నిఫ్టీ

ముంబై: ట్రేడింగ్ చివర్లో ఐటీ, ఇంధన, విద్యుత్, వినిమయ రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీలు మంగళవారం కనిష్ట స్థాయిల నుంచి రికవరీ అయ్యాయి. ఉదయం సెషన్‌లో 366 పాయింట్లను కోల్పోయిన సెన్సెక్స్ చివరికి 159 పాయింట్ల లాభంతో 63,328 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 94 పాయింట్ల పతనం నుంచి తేరుకొని 61 పాయింట్లు బలపడి 18,817 వద్ద ముగిసింది.

రూపీకి రెండు వారాల్లో అతిపెద్ద నష్టం

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి రెండువారాల్లో అతిపెద్ద నష్టాన్ని చవిచూసింది. డాలర్ మారకంలో 18 పైసలు పతనమై 82.12 స్థాయి వద్ద స్థిరపడింది.

జీవితకాల గరిష్టానికి ఇన్వెస్టర్ల సంపద

బెంచ్‌మార్క్ సూచీల అనూహ్య రికవరీతో ఇన్వెస్టర్ల సంపద సైతం జీవితకాల గరిష్టానికి చేరుకుంది. సెన్సెక్స్ జోరుతో మంగళవారం ఒక్క రోజే రూ.1.08 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఫలితంగా ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.293.51 లక్షల కోట్లకు చేరింది.

భవిత

జాబ్ పాయింట్

తెలంగాణ కేజీబీవీల్లో 1241 అధ్యాపక పోస్టులు

తెలంగాణ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ.. కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో.. మహిళా కాంట్రాక్ట్ అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలచేసింది. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 1241
» **పోస్టుల వివరాలు (కేజీబీవీలు):** స్పెషల్ ఆఫీసర్-38, పీజీసీఆర్‌టీ(ఇంగ్లిష్)-110, పీజీసీఆర్‌టీ (గణితం)-60, పీజీసీఆర్‌టీ(నర్సింగ్)-160, పీజీసీఆర్‌టీ(తెలుగు)-104, పీజీసీఆర్‌టీ(ఉర్దూ)-02, పీజీసీఆర్‌టీ(వృక్షశాస్త్రం)-55, పీజీసీఆర్‌టీ(కెమిస్ట్రీ)-69, పీజీసీఆర్‌టీ(సివిక్స్)-55, పీజీసీఆర్‌టీ(కామర్స్)-70,పీజీసీఆర్‌టీ(ఎకనామిక్స్)-54, పీజీసీఆర్‌టీ(ఫిజిక్స్)-56, పీజీసీఆర్‌టీ(జంతుశాస్త్రం)-54, పీజీసీఆర్‌టీ(బయో సైన్స్)-25, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-52, సీఆర్‌టీ(హిందీ)-37, సీఆర్‌టీ(గణితం)-45, సీఆర్‌టీ(ఫిజికల్ సైన్స్)-42, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-26, సీఆర్‌టీ(తెలుగు)-27, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్-77. ఈ పోస్టులకు మహిళలు మాత్రమే అర్హులు.
» **అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్స్(యూఆర్‌ఎస్):** పురుష, మహిళా అభ్యర్థులు అర్హులు. స్పెషల్ ఆఫీసర్-04, సీఆర్‌టీ(తెలుగు)-05, సీఆర్‌టీ(ఇంగ్లిష్)-05, సీఆర్‌టీ(సైన్స్) -06, సీఆర్‌టీ(సోషల్ స్టడీస్)-03.
» **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో డిగ్రీ, పీజీ, బీఈడీ/బీఈడీ(స్పెషల్ ఎడ్యుకేషన్) /యూజీపీఈడీ/బీపీఎడ్ ఉత్తీర్ణతతోపాటు టెట్/సీటెట్‌లో అర్హత సాధించి ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్లు, మాజీ సైనికులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ఎంపిక విధానం

» **సీఆర్‌టీ పోస్టులు:** రాతపరీక్ష(80 శాతం వెయిటేజీ), టెట్(20 శాతం వెయిటేజీ)లో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **స్పెషల్ ఆఫీసర్:** రాతపరీక్ష(75 శాతం వెయిటేజీ), టెట్(20 శాతం వెయిటేజీ), పని అనుభవం(5 శాతం వెయిటేజీ)లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పీజీసీఆర్‌టీ పోస్టులు:** రాతపరీక్ష(95 శాతం వెయిటేజీ), పని అనుభవం(5 శాతం వెయిటేజీ)లో పొందిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పీఈటీ పోస్టులు:** రాతపరీక్ష(100 శాతం వెయిటేజీ)లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.06.2023
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 05.07.2023.
» **స్పెషల్ ఆఫీసర్ పోస్టుల రాతపరీక్ష(ఆన్‌లైన్):** జూలై 2023.
» **పీజీసీఆర్‌టీ పోస్టుల రాతపరీక్ష(ఆన్‌లైన్):** జూలై 2023.
» **వెబ్‌సైట్:** www.schooledu.telangana.gov.in

ఐఐఎస్ఈఆర్, తిరుపతిలో టీచింగ్ పోస్టులు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(ఐఐఎస్ఈఆర్).. తిరుపతి వివిధ విభాగాల్లో ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 32
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-07, అసిస్టెంట్ ప్రొఫెసర్-25.
» **విభాగాలు:** బయాలజీ, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ క్లైమేట్ సైన్స్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మ్యాథమేటిక్స్, ఫిజిక్స్.
» **అర్హత:** సంబంధిత విభాగంలో పీజీ,పీహెచ్‌డీతోపాటు పని అనుభవం ఉండాలి.
» **ప్రారంభ వేతనం:** ప్రొఫెసర్‌కు రూ.1,59,100, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ/ప్రజెంటేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.07.2023.
» **వెబ్‌సైట్:** www.iisertirupati.ac.in

జోసా.. కౌన్సెలింగ్ ఇలా!

» ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, జీఎఫ్‌టీఐల్లో ప్రవేశాలకు జోసా
» అడ్వాన్స్‌డ్, మెయిన్స్ ఉత్తీర్ణులకు జోసా కౌన్సెలింగ్‌తోనే అడ్మిషన్
» ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహణ
» ఈ నెల 19 నుంచి ప్రారంభమైన రిజిస్ట్రేషన్

జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ.. సంక్షిప్తంగా జోసా! జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్ ర్యాంకుల ఆధారంగా.. ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు.. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇతర సాంకేతిక విద్యా సంస్థల్లో.. ప్రవేశాలకు కౌన్సెలింగ్ నిర్వహించే ప్రత్యేక వ్యవస్థ! ఆన్‌లైన్ విధానంలో ఉమ్మడి కౌన్సెలింగ్ జరిపే జోసా-2023కు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. జోసా కౌన్సెలింగ్ పూర్తి వివరాలు..

50 వేలకు పైగా సీట్లు

- 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 26 ట్రిపుల్ ఐటీలు,కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మరో 38 టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్స్‌లో మొత్తం 54,477 సీట్లు అందుబాటులో ఉంటాయి. **ఇన్‌స్టిట్యూట్స్ వారీగా సీట్ల వివరాలు:** ఐఐటీలు-16,598, ఎన్ఐటీలు-23,994, ట్రిపుల్ ఐటీలు-7,126, జీఎఫ్‌టీఐలు -6,759.
- ఈ ఏడాది కూడా మహిళా విద్యార్థులకు 20 శాతం తక్కువ కాకుండా.. సూపర్ న్యూమరరీ కోటా పేరుతో ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని నిర్ణయించారు.

ఛాయిస్ ఫిల్లింగ్

- జేఈఈ-అడ్వాన్స్‌డ్, మెయిన్‌లో అర్హత సాధించిన విద్యార్థులు జోసా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని.. తమ వివరాలు పొందుపరచాలి. తమ ఆసక్తి మేరకు కోర్సు, ఇన్‌స్టిట్యూట్ ప్రాథమ్యాలను ఆన్‌లైన్‌లోనే పేర్కొనాల్సి ఉంటుంది. ఇలా ప్రాథమ్యాలను పేర్కొనడాన్నే.. ఛాయిస్ ఫిల్లింగ్ అంటారు.
- ఆన్‌లైన్‌లో ప్రాథమ్యాలను పొందుపరిచిన తర్వాత విద్యార్థులు ఎంచుకున్న కోర్సు, ఇన్‌స్టిట్యూట్, అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుంది. ఉదాహరణకు.. ఒక విద్యార్థి మొదటి ప్రాథమ్యంగా ఐఐటీ-ఢిల్లీలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను, రెండో ప్రాథమ్యంగా ఐఐటీ-ముంబైలోని సీఎస్ఈ బ్రాంచ్‌ను ఎంచుకుంటే..ఆ విద్యార్థి పొందిన ర్యాంకు ఆధారంగా ఐఐటీ-ఢిల్లీలో సీటు లభించకపోతే.. ఐఐటీ-ముంబైలోని సీటుకు పరిగణనలోకి తీసుకుంటారు.

అడ్వాన్స్‌డ్‌తో అన్నింటికీ అర్హత

జేఈఈ-అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐలు.. ఇలా అన్ని ఇన్‌స్టిట్యూట్‌లను తమ ప్రాధాన్యత క్రమంలో పేర్కొనొచ్చు. మెయిన్‌లో అర్హత సాధించిన వారు నిట్‌లు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐల్లో సీటు కోసం ఆన్‌లైన్ దరఖాస్తు, ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేయాలి. వీరికి ఐఐటీలకు అర్హత ఉండదు.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా

- ఆన్‌లైన్ విధానంలో జోసా కౌన్సెలింగ్ ప్రక్రియ మొత్తం ఆరు రౌండ్లలో జరుగుతుంది. మొదటి రౌండ్ నుంచి ఆరో రౌండ్ వరకు.. కౌన్సెలింగ్‌లో పాల్గొనే అవకాశం ఉంటుంది. విద్యార్థులకు ఫ్రీజ్, స్లైడ్, ఫ్లోట్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి.
- **ఫ్రీజ్:** మొదటి రౌండ్‌లోనే తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్, ప్రోగ్రామ్‌తో సంతృప్తి చెందితే ఫ్రీజ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి. దీంతో తదుపరి రౌండ్లకు ఛాయిస్‌లను పరిగణనలోకి తీసుకోరు. తొలిదశలో సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌లోనే జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.
- **స్లైడ్:** మొదటి రౌండ్‌లో నిర్దిష్టంగా ఒక ఇన్‌స్టిట్యూట్‌లో ఒక బ్రాంచ్‌లో సీటు వచ్చిన విద్యార్థి.. అదే ఇన్‌స్టిట్యూట్‌లో మరో బ్రాంచ్‌లో సీటు కోరుకుంటే స్లైడింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.
- **ఫ్లోట్:** మొదటి రౌండ్(దశ)లో వచ్చిన సీటు నచ్చకపోతే.. మరింత మంచి ఇన్‌స్టిట్యూట్ లేదా బ్రాంచ్ కోసం ఫ్లోటింగ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవచ్చు. ఫలితంగా ఆ విద్యార్థి ప్రాథమ్యాలను తదుపరి రౌండ్లకు పరిగణనలోకి తీసుకుంటారు.
- ఇలా ఫ్లోటింగ్, స్లైడింగ్ ఆప్షన్‌లు పేర్కొనడం వల్ల అభ్యర్థులకు చివరగా కేటాయించిన సీట్లే ఖరారవుతాయి. తొలిదశలో లేదా అంతకుముందు దశల్లో వచ్చిన సీట్లు రద్దవుతాయి.

మాక్ సీట్ అలోకేషన్

- జోసా వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు..అదే రోజు నుంచి 'ఛాయిస్ ఫిల్లింగ్' ఆప్షన్‌ను వినియోగించుకుని.. తమ ప్రాథమ్యాలను(ఆసక్తి ఉన్న ఇన్‌స్టిట్యూట్, బ్రాంచ్ వివరాలు) ఆన్‌లైన్‌లో పేర్కొనాలి. ఇలా ఆన్‌లైన్‌లో నిర్దేశిత గడువు తేదీలోగా ఛాయిస్ ఫిల్లింగ్ పూర్తి చేసిన విద్యార్థులకు ముందుగా.. మాక్ సీట్ అలొకేషన్(నమూనా సీటు కేటాయింపు) వివరాలను అందుబాటులో ఉంచుతారు. అంటే.. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగా సీటు వచ్చే అవకాశం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌లు, బ్రాంచ్‌ల వివరాలు తెలుస్తాయి. మాక్ సీట్ అలొకేషన్ జాబితాను బేరీజు వేసుకున్న విద్యార్థులు.. తమ ర్యాంకుకు ఇంకా మంచి ఇన్‌స్టిట్యూట్‌లో సీటు వస్తుందనుకుంటే..ఆప్షన్లను మార్చుకునే వెసులుబాటు కూడా కల్పిస్తారు.



ఇంజనీరింగ్ స్పెషల్

ఆమోదం లేదా ఉపసంహరణ

సీట్లు పొందిన విద్యార్థులు.. ప్రతి రౌండ్ తర్వాత సీటు యాక్సెప్టెన్స్ లేదా ఉపసంహరణ విషయాన్ని స్పష్టం చేయాలి. మొత్తం ఆరు రౌండ్ల కౌన్సెలింగ్‌లో అయిదో రౌండ్ వరకే ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. చివరి రౌండ్(ఆరో రౌండ్)లో ఉపసంహరణకు వీలుండదు.

రిపోర్టింగ్ తప్పనిసరి

ప్రతి రౌండ్ సీట్ అలొకేషన్ తర్వాత విద్యార్థులు నిర్దిష్ట గడువులోపు తమకు సీటు లభించిన ఇన్‌స్టిట్యూట్‌కు సంబంధించి పేర్కొన్న రిపోర్టింగ్ సెంటర్‌లో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఇలా రిపోర్ట్ చేయకపోతే.. సీటు రద్దవుతుంది. విద్యార్థులు తమకు ఆసక్తి లేని ఇన్‌స్టిట్యూట్‌లో చేరాల్సి వస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. కారణం.. ఒక రౌండ్‌లో నచ్చిన ఇన్‌స్టిట్యూట్ లేదా బ్రాంచ్ పట్ల ఆసక్తి లేకుంటే.. మిగతా రౌండ్లకు తమ ఆప్షన్లను పరిగణనలోకి తీసుకునేలా సరళీకృత విధానం అమల్లో ఉంది.

సీట్ యాక్సెప్టెన్స్ ఫీజు తప్పనిసరి

- జోసా కౌన్సెలింగ్ విధానంలో సీటు పొందిన అభ్యర్థులు తప్పనిసరిగా సీట్ యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. దీన్ని కూడా ఆన్‌లైన్ విధానంలో నెట్ బ్యాంకింగ్ లేదా డెబిట్ కార్డ్ లేదా ఎస్‌బీఐ ఈ-చలాన్ రూపంలో మాత్రమే చెల్లించాలి.
- ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఇతర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో సీటు పొందిన జనరల్ కేటగిరీ విద్యార్థులు రూ.35 వేలు;ఎస్సీ,ఎస్టీ, పీడబ్ల్యుడీ విద్యార్థులు రూ.15 వేలు చొప్పున యాక్సెప్టెన్స్ ఫీజు చెల్లించాలి.తర్వాత దశలో చివరగా తాము ప్రవేశించిన ఇన్‌స్టిట్యూట్‌కు అనుగుణంగా అకడమిక్ ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

కోర్ మొదలు ఏఐ వరకు

ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, జీఎఫ్‌టీఐల్లో సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్,మెకానికల్,ఎలక్ట్రికల్ వంటి కోర్ బ్రాంచ్‌లు మొదలు.. తాజాగా డిమాండ్ నెలకొన్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్ వరకూ.. వినూత్న కోర్సులు ఎన్నో అందుబాటులో ఉన్నాయి. బయోమెడికల్ ఇంజనీరింగ్, బయో టెక్నాలజీ, బయో ఇంజనీరింగ్, బయోటెక్ ఇంజనీరింగ్ తదితర వైద్య అనుబంధ కోర్సులను సైతం ఐఐటీలు, ఎన్ఐటీలు అందిస్తున్నాయి.

ఆ బ్రాంచ్‌లకే ఓటు

- ఐఐటీల్లో చేరే టాప్ ర్యాంకర్లు ముఖ్యంగా అయిదు బ్రాంచ్‌లకే ప్రాధాన్యం ఇస్తున్నారు. మొదటగా సీఎస్ఈ డిమాండింగ్ బ్రాంచ్‌గా అగ్రస్థానంలో ఉంటోంది. ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్,సివిల్, మెకానికల్‌లను విద్యార్థులు ఎంచుకుంటున్నారు. గత రెండేళ్లుగా అడ్వాన్స్‌డ్‌లో నాలుగు వేలలోపు ర్యాంకు పొందిన విద్యార్థులందరూ దాదాపు ఈ బ్రాంచ్‌లలోనే చేరారు.
- నాలుగేళ్ల ప్రోగ్రామ్‌ల్లో అడ్మిషన్ లభించని విద్యార్థులు..అయిదేళ్ల కోర్సులో సీటు దక్కినా చేరేందుకు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా సీఎస్ఈ విషయంలో నాలుగేళ్ల బీటెక్‌లో సీటు లభించకపోతే.. అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీలో చేరేందుకు సైతం వెనుకాడట్లేదు.

జోసా-2023 ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ముఖ్య తేదీలు

- **జూన్19:** జోసా వెబ్‌సైట్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్, ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం.
- **జూన్ 25:** మాక్ సీట్ అలొకేషన్ (సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-1 విడుదల. (జూన్ 24 రాత్రి 8 గంటల వరకు అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా దీన్ని విడుదల చేస్తారు.
- **జూన్ 27:** మాక్ సీట్ అలొకేషన్ (సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-2 విడుదల. (జూన్ 26 సాయంత్రం అయిదు గంటల వరకు పేర్కొన్న ప్రాథ్యమాల ఆధారంగా వెల్లడించనున్నారు).
- **జూన్ 28:** ఛాయిస్ ఫిల్లింగ్, క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ.
- **జూన్ 29:**వివరాల పునస్సమీక్ష, పరిశీలన.
- **జూన్ 30:** మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూన్ 30-జూలై 4:** మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి. అదే విధంగా యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- **జూలై 6:** రెండో దశ సీట్ల కేటాయింపు.
- **జూలై 6-10:** రెండో రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ల అప్‌లోడ్.
- **జూలై 7-11:** రెండో రౌండ్‌లో పొందిన సీటు విషయంలో ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి విరమించుకునే అవకాశం.
- **జూలై 12:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 12-14:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్,డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 13-15:** మూడో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి ఉపసంహరణ.
- **జూలై 16:** నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 16-19:** నాలుగో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 18-20:** నాలుగో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 21:** అయిదో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 21-24:** అయిదో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు పేమెంట్.
- **జూలై 21-25:** అయిదో రౌండ్ తర్వాత సీటు విత్‌డ్రా లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 26:** ఆరో రౌండ్(చివరి రౌండ్) సీట్ల కేటాయింపు.
- **జూలై 26-28:** ఆరో రౌండ్‌లో పొందిన సీటుకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు.
- **వెబ్‌సైట్:** https://josaa.nic.in

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.